ఓం భూర్భువః స్వః తత్సవితుర్వరేణ్యం భర్గోదేవస్య ధీమహి ధియోయోనః ప్రచోదయాత్



# యుగశక్తి గాయత్రి





ఓం వందే భగవతీం దేవీం శ్రీరామంచ జగద్గురుం
పాదపద్మే తయోః శ్రిత్వా ప్రణమామి ముహుర్ముహుః

ప్రఖర ప్రజ్ఞ — మాతృ దేవోభవ ! పితృ దేవోభవ ! ఆచార్య దేవోభవ ! అతిథి దేవోభవ ! — సజల శ్రద్ధ

సంకల్పం - సంరక్షణ
వేదమూర్తి, తపోనిష్ఠ, పండిత
**శ్రీరామ శర్మ ఆచార్య**
శక్తి స్వరూపిణి
**మాతా భగవతీ దేవి శర్మ**

ప్రధాన సంపాదకులు
**డా॥ ప్రణవ్‌పండ్యా**
సంపాదకులు
**బి.సి.హెచ్.వి. సుబ్బారావు (అశ్విని)**
ఉప సంపాదకులు
**ముక్కామల రత్నాకర్**
సంపాదక మండలి
సాధన నరసింహాచార్య
శ్రీమతి లక్ష్మీరాజగోపాల్
డి.వి.ఆర్. మూర్తి

సంపుటి 20 - సంచిక 06
**నవంబర్ 2015**

పత్రిక అందనివారు మరియు పత్రికకు సూచనలు, సలహాలు ఇవ్వదలచినవారు ఈ క్రింది ఫోన్ నంబర్లలో సంప్రదించగలరు
**040-23700722**
**99491 11175**
**94407 69798**

## ఒక జీవనక్రమములో సాగే ఉత్తరోత్తర వికాసం

వృక్షము ఏ బీజమునుండి ఉత్పన్నమౌతుందో, అది తర్వాత తర్వాత అంకురమునుండి వృక్షముగా ఎదుగుతున్నప్పుడు ఆ దిశగానే అడుగులు వేస్తుంది. పరిపక్వమైన మానవత్వము వైపే శిశువుయొక్క ఉత్సాహము పెల్లుబుకుతుంది. ప్రతి జీవంతమైన వస్తువు తన ఉచ్చతరమైన రూపమును పొందాలనుకుంటుంది. దాని పేరే ఉత్కర్ష, అది జీవి సహజ స్వభావము.

మానవస్థాయిలో ఈ ఉద్దేశ్యమే గొప్ప జ్ఞానరూపమును ధరిస్తుంది. మనస్సు బయటికి వచ్చి ప్రకృతి అధ్యయనములో భాగముగా శృంఖల, వ్యవస్థ, నియమము, ఉద్దేశ్యము మరియు సౌందర్యములను గురించి అన్వేషిస్తున్నప్పుడు వస్తుతః అది 'కళ్ళు అద్దములో తమను తాము చూసుకున్నట్లుగా' తనను తానే ప్రకృతిలో పొందాలనుకుంటుంది, దర్శించాలనుకుంటుంది. నిజము చెప్పాలంటే ప్రకృతి అనేది ఆత్మదర్శనము కొరకు ఉపయోగపడే ఒక విరాట్ దర్పణము!

జీవితము ఒక క్రమగతిలో సాగుతూ ఉంటుంది. తర్వాత తర్వాత 'వికాసము మరియు నూతనకాంతిని' పొందే నిమిత్తము అది నిరంతరము ప్రయత్నశీలియై ఉంటుంది. ఈ ఇచ్ఛ మొదటిది మరియు చివరిది కూడా! దీని స్వభావము చిరకాలము ముందుకు సాగటము మరియు ఉన్నత శిఖరాలను అందుకోవడము. అందుచేత కొద్దికాలముపాటు ఇతరేతర ఉపాసనలన్నింటినీ నిలిపివేసి కేవలము ప్రకృతిని 'మాతృభావన'తో ఉపాసించండి!!

**భక్తి వల్లనే విషం తిన్నప్పటికీ మీరా బ్రతికిపోయింది**

# విషయసూచిక


1. **సంపాదకీయం :**
ఒక జీవన క్రమంలో సాగే ఉత్తరోత్తర వికాసం 3
2. **విషయసూచిక-సద్గురువాణి :** ఆత్మ సంతోషం 4
3. **వేదమంత్రం:** జీవన లక్ష్యం 5
4. **యుగనిర్మాణ చిత్రావళి-7 :** సుకన్య ప్రాయశ్చిత్తం 6
5. **అశ్వమేధం-9 :** వైదికి హింస - హింస న భవతి"
దీని తాత్పర్యము తెలుసుకోండి 8
6. **పరమపూజ్య గురుదేవుల సుదీర్ఘయాత్ర - 41 :**
విశ్వానికి ఆశ్రయం ఆ ఆశ్రమం-1 11
7. **బాలల దినోత్సవ ప్రత్యేకం:**
అద్భుతమైన విలక్షణమైన బాలలు 14
8. **జ్యోతిర్విజ్ఞానమునకు పునర్ వైభవం**
**తీసుకురావల్సిన సమయం ఆసన్నమైనది** 16
9. **దీపావళి ప్రత్యేకం:** వేర్పాటువాదం అనే చీకటిని
తొలగించగల దీపాన్ని వెలిగిద్దాం రండి! 19
10. **పరమపూజ్య గురుదేవుల అమృత వచనాలు - 3:**
విధేయతతో కూడిన ఆలోచనలు ప్రగతికి మూలం 21
11. **కర్మకాండ ఎందుకు ఎలా?-6:**
గాయత్రీ సాధనా విధానము 23
12. **అతీంద్రియ విజ్ఞానం-6:** శ్రవణ-దర్శనములకు
సంబంధించిన దివ్యశక్తులు - 2 26
13. **నాదబ్రహ్మ - శబ్దబ్రహ్మ:** వాక్‌శక్తిని
ఉపయోగించుకుని శ్రేయస్సు పొందండి 28
14. **జీవించే కళ:** ఆర్ట్ ఆఫ్ లివింగ్ 31
15. **భారతీయ సంస్కృతి తిరిగి జాగృతమౌతుంది** 33
16. **బోధకథ:** ఐక్యమత్యంతో ఉంటే ఎన్ని
కష్టాలనైనా ఎదిరించవచ్చు 36
17. **పూజ్య గురుదేవుల అమృతవాణి:**
ఆధ్యాత్మిక ఔన్నత్యమునకు సోపానాలు యోగము
మరియు తపస్సు - 3 38
18. **నా వారితో నా మాట:**
దృష్టిని, దిశను మార్చే నవరాత్రులు 41
19. **ఆయుర్వేదవైద్యం-7 :**
ఆయుర్వేదగుణ పత్రాలు-1 45
20. **స్ఫూర్తిదాయక గాయత్రీపరివార్ సభ్యులు-18** 47
21. **వార్తలు :** రాష్ట్రంలో జరిగిన వివిధ కార్యక్రమాలు 49




## సద్గురు వాణి

## ఆత్మ సంతోషం

ఆత్మ సంతోషం సాధించడం చాలా గొప్ప విషయం. దీనిని సాధించడం కొరకు చాలా ఉన్నతమైన జీవిత విధానం అవసరమవుతుంది. ఎవరైన తప్పుడు పనులు చేసి తాత్కాలికమైన సఫలత్వం ప్రాప్తించుకున్నప్పటికి తరువాత ఆత్మగ్లాని అతనిని పీడిస్తుంది. ఇలాంటివారు ఇతరుల నమ్మకం కోల్పోతారు. తల ఎత్తుకు తిరగలేని పరిస్థితి వస్తుంది. సవ్యమైన నడవడికగల వారికి సమాజంలో గౌరవం లభిస్తుంది. ఆత్మ సంతోషంతో పాటు దైవీఅనుగ్రహం లభిస్తుంది. *- అనువాదం: ముక్కామల రత్నాకర్*


# యుగశక్తి గాయత్రి

**విడి ప్రతి రూ॥ 15/-** **సం॥ చందా రూ॥ 150/-**
**3 సం॥ చందా రూ॥ 420/-** **10 సం॥ చందా రూ॥ 1300/-**

చందా రుసుమును ఎట్ పార్ చెక్ ద్వారా (at par cheque) లేక డి.డి.ద్వారా కాని పంపగలరు. యం.ఒ. ద్వారా కూడా పైకం పంపించవచ్చు. కానీ యం.ఒ. ద్వారా వచ్చినప్పుడు పూర్తి అడ్రస్సు ఉండుట లేదు. అందువలన యం.ఒ. ద్వారా పైకం పంపినప్పుడు క్రింద ఇచ్చిన ఫోన్ నంబర్లను సంప్రదించి మీ వివరాలు అన్నీ ఇవ్వ ప్రార్థన. రూ.5,000 లేక అంతకన్నా ఎక్కువ పంపదలచుకున్నప్పుడు ఆన్‌లైన్ ద్వారా పంపవచ్చును. దీనికన్నా తక్కువ పంపే వారు, రూ. 50/- అదనంగా చేర్చి పంపాలి.

ఖాతాపేరు: **శ్రీ వేదమాత గాయత్రీ ట్రస్టు**
బ్యాంకు పేరు: **స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా**
**ఎర్రగడ్డ శాఖ, హైదరాబాద్**
ఖాతా నెం.: **32506416087**
IFSC Code: **SBIN-0013272**

ఆన్‌లైన్‌లో పంపినప్పుడు బ్యాంక్ చలానా జిరాక్సు కాపీని మీ చిరునామా తెలుపుతూ తప్పక మాకు పంపించాలి.



**"శ్రీ వేదమాత గాయత్రీ ట్రస్టు"**
**గాయత్రీ చేతనా కేంద్రము,** హెచ్.పి. రోడ్, మూసాపేట
అశ్విని హౌస్ దగ్గర, హైదరాబాదు - 500 018.
ఫోన్: 040-23700722, సెల్: 9949111175


**శ్రద్ధ వ్యక్తిలో భగవంతుని సృష్టిస్తుంది**

వేద మంత్రం

# జీవన లక్ష్యం

**స వి జానామి యది వేదమస్మి**
**నిణ్యః సన్నద్ధో మనసా చరామి ।**
**యదా మాగన్ప్రథమజా ఋతస్యాదిద్వాచో**
**అశ్నువే భాగమస్యాః ॥ (ఋగ్వేదం 1/164/37)**

**భావార్థం:** మనిషి తనను తాను తెలుసుకోలేదు. ఇది ఎంత పెద్ద పొరపాటు. అతడు, భాష సాహిత్యం మొదలైన వాటితో ఏ సామర్థ్యం పొందాడో దానితో శరీరము, జీవాత్మల జ్ఞానము ప్రాప్తించుకోవాలి.

**సందేశము:** ఈ మనుష్య శరీరము మళ్ళీ మళ్ళీ లభించేది కాదు. మన పరమలక్ష్యమైన ప్రభుప్రాప్తికి ఒక పనిముట్టుగా ఇది లభించింది. కానీ అజ్ఞాన వశమున ప్రాపంచిక భోగ విలాసాలలో దారి తప్పి మనం ఈ సదవకాశమును పోగొట్టుకుంటున్నాము. ధనము, సంపద, సాధనాలు – సంపత్తి, భార్యాబిడ్డలు, బంధువులు స్నేహితులు మనకు అక్కరకు రారు. సత్కర్మలు మాత్రమే అక్కరకు వస్తాయి. మనం ఈ ప్రపంచం నుండి ఏదో ఒక రోజు వెళ్ళిపోతాం అనేది మనం మరచిపోతుంటాము. ఈ శరీరాన్ని ఎంతో ముద్దు మురిపెంతో ప్రేమతో అలంకరించుకోవటానికి మనం నిజం–అబద్ధం, మోసం–దగ, నీతి–అవినీతి అన్నింటిని ఉపయోగించు కుంటాం. ఏమేమి పాపాలు చేస్తామో తెలియదు. ఈ దేహం చివరికి అగ్నిలో కాలి భస్మమై పోతుంది. ఒక్క క్షణానికి కూడా భరోసా లేదు. మన సమస్త జ్ఞానము, విజ్ఞానము, ప్రతిభ, సామర్థ్యము, చదువులు విద్య అన్నీ భౌతిక విషయాలకే పరిమితమయ్యాయి. ఈ శరీరంలో ఉన్న ఈ శరీరపు యజమాని అయిన ఆత్మను మరచిపోయాము. ఈ ఆత్మయే పరమాత్మ యొక్క అంశ, దీనిని తెలుసుకోలేకపోతే మనం అంధకారంలో దారి తప్పి, ఎప్పుడు దుఃఖిస్తూ ఉంటాము.

ఆత్మను గుర్తించి, సత్యమార్గంలో నడిచే బుద్ధి మనకు లభిస్తే మానవ జీవితం సార్థకమవుతుంది. సాధారణంగా బుద్ధి రెండు రకాలుగా ఉంటుంది. ఒకటి దుర్బుద్ధి, అది మనలను స్వార్థం, మోహం, లోభం మొదలైన పాపకర్మలవైపు లాగుతుంది. రెండవది సద్బుద్ధి, మన హితానికి కావలసిన కర్మలవైపు ప్రేరేపించి, పాపకర్మల నుండి కాపాడుతుంది. వీటి కంటే పైన ఉన్నది మేధస్సు, ఇది మంచి–చెడుల మధ్య తేడా తెలుసుకొనే సామర్థ్యాన్ని వికసింప చేస్తుంది. **మేధస్సు కంటే పైస్థాయి ప్రజ్ఞ, వివేకానుసారము లోకహిత కార్యాలకు ప్రేరణనిస్తుంది. దీనివలన తమోగుణం నశించి, మనుష్యుడు స్వార్థం వైపు వెళ్ళడు. ప్రజ్ఞ కంటే వికసించిన స్థాయి ప్రతిభ. దీనినే ఆత్మ దృష్టి అని అనవచ్చు. ఈ విలక్షణమైన బౌద్ధికశక్తి ఆధారంగా మనుష్యుడు ప్రపంచంలోని అత్యంత గూఢమైన రహస్యాలు తెలుసుకోగలడు.** బుద్ధి యొక్క సర్వోత్తమ రూపం ఋతంభరా బుద్ధి. దీనిలో కేవలం సత్వగుణమే మిగిలి ఉంటుంది. దీని వెలుగులో ప్రతి వస్తువు ఉన్నదున్నట్లుగా కన్పించి, భ్రమ, సంశయము మటుమాయం అవుతాయి.

నేడు మనుష్యుడు రకరకాలైన జ్ఞానము, విజ్ఞానము, భాష మొదలైనవి అధ్యయనం చేసి వాటిని అనేకానేక రంగాలలో వినియోగిస్తున్నాడు. సుఖ, సౌకర్యాల పరికరాల రాశిని ప్రోగు చేస్తున్నాడు. ఒక స్విచ్ నొక్కగానే ప్రపంచములోని ఏ మూలలో నైనా, ఏ కార్యమైనా చేయగలిగే స్థితికి చేరుకున్నాడు. మనుష్యుడు ఈ స్థితితో పరమాత్మకంటే కూడా తాను గొప్పవాడనుకునేంత మూర్ఖత్వానికి చేరుకున్నాడు. ఈ మానవ శరీరం ఇందు కొరకే ప్రాప్తించిందా? ఈ బుద్ధి యొక్క ఉపయోగం ఇదేనా? జీవనలక్ష్యం ఇదేనా?

మనము మన బుద్ధిని వికసింపచేసుకుంటూ, మానవ జీవితం వాస్తవిక లక్ష్యాన్ని గుర్తించి, ఆ దిశలో ముందుకు వెళ్ళాలి.

★★★

## పండుగలు

**నవంబర్ 2015**

| | |
|---|---|
| 11-11-2015 | దీపావళి |
| 14-11-2015 | బాలల దినోత్సవము |
| 25-11-2015 | కార్తీక పౌర్ణమి |

**డిసెంబర్ 2015**

| | |
|---|---|
| 21-12-2015 | గీతా జయంతి<br>ముక్కోటి (వైకుంఠ) ఏకాదశి |
| 25-12-2015 | దత్తాత్రేయ జయంతి<br>క్రీస్తు జయంతి |

**శ్రద్ధ వలన మనిషిలోని వ్యక్తిత్వం వికసిస్తుంది**

### యుగనిర్మాణ చిత్రావళి-8

# సుకన్య ప్రాయశ్చిత్తం



రాజకుమారి సుకన్య ఒకరోజు తన తండ్రితో రాజపరివారంతో కూడి వన విహారానికై వెళ్ళింది. ఆమె అచ్చట ఒక చిన్నపాటి పొదను చూచింది. అచ్చట చెద పుట్ట పెరిగి ఉంది. దానిలోపల నుండి మెరుస్తున్న రెండింటిని చూచింది. కుతూహలం కొద్దీ ఆమె కట్టెతో మెరుస్తున్న వానిని పొడిచి చూసి లోనున్న పదార్థములేమిటి అని తెలుసుకోవాలనుకున్నది. పొడిచినంతనే ఆ మెరుస్తున్న వాని నుండి రక్తము కారసాగింది. దీనిని గాంచిన సుకన్య మనస్సు భయంతో మరియు ఆశ్చర్యంలో మునిగి పోయింది.

జరిగిన వృత్తాంతమంతటిని ఆమె తన తండ్రియైన అజాత శత్రువు వద్దకు వెళ్ళి చెప్పింది. దీనిని విన్న మహారాజు మిగుల చింతాక్రాంతుడై "ఈ పుట్టలో వృద్ధుడైన చ్యవన ఋషి తపస్సు చేస్తున్నాడు. ఈయన శరీరంపై మట్టిపుట్టలుగా పెరిగింది. నీవు ఆయన కన్నులను పొడిచావని నాకు అనిపిస్తున్నది." అంటూ పుట్ట దగ్గరకు వెళ్ళిచూడగా అది నిజమని తేలింది.

కన్నులకు దెబ్బ తగలగానే చ్యవనుడు తపస్సు భంగమైంది. ఆయన చాలా దుఃఖానికి లోనైనాడు. అప్పుడు సుకన్య ఆలోచనలో పడి, "మానవజాతి ఉద్ధరణకై చ్యవనుడు తపస్సు చేస్తున్నాడు. అట్టి ఆయనను అంధుని గావించి, అసమర్థుని చేసి నేను మహా అపరాధాన్ని చేశాను. ఇప్పుడు నేనేమి చేయాలి! అంతటి గొప్ప ఋషి యొక్క లాభాన్ని తిరిగి సమాజానికి అందేలా చూసినచో, నాకు ప్రాయశ్చిత్తం కూడా అవుతుంది" అని ఆలోచించింది.

ఇలా ఆలోచన చేస్తూ-చేస్తూ, సుకన్య ఒక నిర్ణయానికి వచ్చింది. "తన కన్నులను, శరీరాన్ని ఆ ఋషి సేవకై అర్పించినచో, ఋషి శక్తి సామర్థ్యాలు, విశ్వకళ్యాణానికి నిరుపమానంగా నిరాటంకంగా లభించగలవు". అని తలచింది.

ఆమె తన తప్పిదానికి ప్రాయశ్చిత్త రూపంగా, ఋషిని వివాహం చేసికొనే ప్రస్తావన తెచ్చి ఇలా ఋషితో అన్నది – "తమరు నా సేవలను నిస్సంకోచంగా స్వీకరించ ప్రార్థన. మీ యొక్క ప్రతిభ, జ్ఞానం మరియు బ్రహ్మవర్చస్సు మున్నగు లాభాలు సమాజానికి అందించబడాలి, శారీరక అసమర్థత కారణంగా వీనిని నిరర్థకం కానివ్వను".

ఋషి కొంత చెప్పిచూశాడు, దీనికి పూర్వం సుకన్య తండ్రి కూడా ఈ వివాహ ప్రస్తావనకు అడ్డు చెప్తూ ఇలా అన్నాడు – "అర్థం చేసుకో! జరిగినదంతా మరచిపో తల్లి! నీ నిర్ణయం దీనికి సమాధానం కాదు! ఒక రాజకుమారి చేయిని ఒక వృద్ధ ఋషి చేయికి అందించుట సరికాదు. ఒకవేళ ఋషి ఏదైనా సహాయం కోరినచో మేము అదంతా నెరవేరుస్తాము"

సుకన్య తండ్రి చెప్పినదంతా విని, ఇలా అంది – "తండ్రీ! ఇది బాధ్యతతో కూడినది మరియు సమాజానికి తలమానిక మైన వ్యక్తి పట్ల జరిగిన అపరాధ పరిహారానికి చేయవలసిన ప్రాయశ్చిత్తం. తప్పుచేసినవారు శిక్ష నుండి తప్పించుకొనుటకై

**గురుశిష్యుల సంబంధం క్రమశిక్షణపై ఆధారపడి ఉంటుంది**

ప్రయత్నించిన, సమాజంలో మానవతకు, నైతికతకు మరియు న్యాయానికి రక్షణ ఎట్లు లభిస్తుంది? వివాహం శారీరిక సుఖాని కొరకు కాదు, సౌందర్యం మరియు ధనసంపత్తులు దానికి సరియైన ఆధారం. నేను మాత్రం వివాహాన్ని ఆదర్శాల స్థాపనకై చేసికొన సంకల్పించాను. నా వద్ద సాధన మరియు సహాయతలను అందించే శక్తి ఉన్నది. వీనిని లోకకళ్యాణానికై, ఋషికోత్తమునికి సహాయానికై వినియోగిస్తాను. ఆమె వృద్ధ చ్యవనుని వివాహ మాడింది.

సుకన్య చేసిన ఈ త్యాగం వలన, అశ్వినీ కుమారులు గొప్పగా ప్రభావితులైనారు. వారు స్వయంగా అచ్చుటికి విచ్చేసి వృద్ధ చ్యవనునికి ఉపచారాలు చేసి, ఆయన కన్నుల, దృష్టిని తిరిగి కల్పించారు. దీనికితోడు ఋషి వృద్ధాప్యాన్ని తొలగించారు. సుకన్య చూపిన ఆదర్శం నేడు కూడా భారతీయ స్త్రీలకు ఆదర్శ ప్రాయంగా నిలచి ప్రేరణనిస్తున్నది. వివాహ ప్రక్రియ కేవలం సుఖభోగాల కొరకు కాదు, దీనితోపాటు ఆదర్శ మరియు లోకకళ్యాణ భావాలు జోడింపబడి ఉన్నాయి. ఇట్లు జరిగిన నాడు ఆయువు మరియు శారీరక స్థితితో సంబంధం లేకుండా వ్యక్తి సంబంధం ద్వారా కూడా సుఖంగా జీవనం సాగించగలరు.

*– హిందీమూలం: యుగనిర్మాణ చిత్రావళి*

*– అనువాదం: పార్థసారథి*

## జ్ఞానయజ్ఞము

| | |
|---|---|
| 1. అన్నింటికన్నా మించిన యజ్ఞమేది? | జ్ఞాన యజ్ఞము |
| 2. అన్నింటికన్నా మించిన తపమేది? | జ్ఞాన యజ్ఞము |
| 3. అన్నింటికన్నా మించిన దానమేది? | జ్ఞాన యజ్ఞము |
| 4. అన్నింటికన్నా మించిన పుణ్యమేది? | జ్ఞాన యజ్ఞము |
| 5. అన్నింటికన్నా మించిన పరమార్థమేది? | జ్ఞాన యజ్ఞము |
| 6. అన్నింటికన్నా మించిన సాధువు యొక్క పని ఏమి? | జ్ఞాన యజ్ఞము |
| 7. అన్నింటికన్నా మించిన బ్రాహ్మణుని కర్తవ్యం ఏమిటి? | జ్ఞాన యజ్ఞము |
| 8. అన్నింటికన్నా మించిన భక్తి ఎట్టిది? | జ్ఞాన యజ్ఞము |
| 9. అన్నింటికన్నా మించిన ఉపసాన ఏమి? | జ్ఞాన యజ్ఞము |
| 10. అన్నింటికన్నా మించిన ఆరాధన ఏమి? | జ్ఞాన యజ్ఞము |
| 11. అన్నింటికన్నా మించిన ధర్మము ఏమి? | జ్ఞాన యజ్ఞము |
| 12. అన్నింటికన్నా మించిన సత్కర్మ ఏమి? | జ్ఞాన యజ్ఞము |
| 13. దైవత్వాన్ని మేల్కొల్పుట ఎలా? | జ్ఞాన యజ్ఞము |
| 14. సత్యయుగాన్ని తెచ్చెడి మార్గము ఏది? | జ్ఞాన యజ్ఞమార్గము |
| 15. విశ్వనిర్మాణం చేసే వారెవరు? | జ్ఞాన యజ్ఞం చేసేవారు |
| 16. పరలోకాన్ని నిర్మించే వారెవరు? | జ్ఞాన యజ్ఞం చేసేవారు |
| 17. భగవంతుని దర్శింపజేసేవారు ఎవరు? | జ్ఞాన యజ్ఞం చేసేవారు |
| 18. కళ్యాణాన్ని ఒనగూర్చెడి వారెవరు? | జ్ఞాన యజ్ఞం చేసేవారు |
| 19. స్వర్గాన్ని అందించేవారు ఎవరు? | జ్ఞాన యజ్ఞం చేసేవారు |
| 20. మూర్తిని అందించేవారు? | జ్ఞాన యజ్ఞం చేసేవారు |

*– యుగ నిర్మాణ యోజన*

*అనువాదం: ఎ. వేణుగోపాలరెడ్డి*

**సిద్ధాంతములను, ఆదర్శములను స్థాపించుటనే శ్రద్ధ అంటారు**

# వైదికి హింస - హింస న భవతి" దీని తాత్పర్యము తెలుసుకోండి

యజ్ఞములలో జరిగే పశుహింస హింసకాదు. వేదోక్తము కనుక ఇందులో ఏమి దోషము లేదు అని పైన చెప్పబడిన మాటకి అర్థము. కానీ ఈ అర్థము ఏవిధంగాను బుద్ధి వివేక సంగతము కాదు దీని నిజమైన అర్థము తెలుసుకొనుటకు పూర్వాగ్రహము వదలి ఆలోచించవలసిన అవసరము ఉన్నది.

ముందు 'వైదికి' అనే శబ్దము గురించి తెలుసుకుందాం. భౌతికీ అంటే భౌతిక పదార్థాలకు సంబంధించిన విజ్ఞానము లేక అనుశాసనము. నైతికీ అంటే నీతి విజ్ఞానము లేక నీతితో కూడిన అనుశాసనము, ఆత్మకీ అంటే ఆత్మవిజ్ఞానము లేక ఆత్మచేతనకు సంబంధించిన అనుశాసనము. ఇదే క్రమములో వైదికీ శబ్దానికి అర్థము వేదవిజ్ఞానము. వేదము అనగా జ్ఞానము యొక్క సర్వోచ్ఛ స్థాయి. ఇందులో అతిశయోక్తి ఏమీలేదు. ఆలోచించి చెప్పబడిన ప్రామాణిక సత్యము.

ఋషుల ఆత్మానుభూతితో అవతరించిన జ్ఞానమే వేదము, అనుభవజన్య-అనుభూతి జన్యజ్ఞానము ఎప్పుడు శ్రేష్టమని చెప్పబడుతుంది. ఆత్మచేతన-బ్రాహ్మీచేతన అతి ఉచ్ఛస్థాయికి వెళ్ళి పొందిన అనుభూతి శ్రేష్టతమము అని చెప్పుటలో తప్పు లేదు కదా.

సామాన్య భావ సంవేదన కలిగిన వ్యక్తి హింస చేయటము అటుంచి హింసను దూరం నుంచి చూడటమే ఇష్టపడదు. అటువంటప్పుడు ఉచ్చతమ భావసంవేదనల అనుభూతిలో పైన చెప్పబడిన మాట యొక్క అర్థము హింసని సమర్థిస్తున్నట్లు తీసుకొనలేము.

వైదిక సందర్భములో కొన్ని చోట్ల హింసాపదమైన శబ్దములు ప్రయోగించబడినప్పటికీ వాటిని హింస అనే అర్థములో తీసుకొనకూడదు.

అన్ని భాషలలోను అనేక అర్థాలు వచ్చే శబ్దాలు ఉంటాయి. కావ్యాలలో వాటి ఆలంకారిక ప్రయోగములు కూడా చేయబడు తుంది. ఒకప్పుడు సహజముగా వాడుక భాషలో కూడా అవి ప్రయోగింపబడుతాయి. కానీ సందర్భానుసారము అక్కడ ఒకే అర్థాన్ని తీసుకుంటాము కానీ అనేకార్థాలు తీసుకోము. విపరీతార్థాలు తీసుకొనటం మన అజ్ఞానము, లేక భాషకి అన్యాయము చేయుట అవుతుంది.

భాష-భావనలు, ఆలోచనలను స్పష్టముగా వ్యక్తము చేయటానికి ఉపయోగపడుతుంది. భాషను మనస్సును రంజింపచేయటానికి హాస్యానికి కూడా ఉపయోగించుకొన వచ్చు. కానీ విపరీతార్థము వచ్చేటట్లు ఉపయోగించకూడదు.

ఉదా: మహిషి అనే శబ్దానికి అర్థము రాణి అని, గేదె అని అర్థములున్నాయి. అందువల్ల ఎవరైన మహారాజు సభకు వెళ్ళే ముందు రాజమహిషిని కలుసుకొని వస్తున్నారు. అంటే ఇక్కడ రాజమహిషి అనే శబ్దానికి అర్థము మహారాణి అని అర్థము. కానీ ఎవరైనా దీనికి రాజ్యము ద్వారా పోషింప బడుతున్న గేదెను కలుసుకొని వస్తున్నారనుకుంటే అతని బుద్ధిని గురించి ఏమనుకోవాలి?

వేదాలలో స్వాభావికంగా "మేధ" "బలి" "ఆలభన" మొదలైన అనేక శబ్దాలు విరివిగా ఉపయోగించబడ్డాయి. ఇందులో ప్రతి శబ్దానికి అనేక అర్థాలు ఉన్నాయి. ఇందులో ఒక అర్థము హింసాపరముగా కూడా ఉంది. కానీ ఆలోచనా పరులకు యుక్తి సంగతమైన అనేక అర్థాలను ఉపేక్షించి అసంగతమైన అర్థాన్ని తీసుకుంటామనుట శోభించదు. ఒక్కొక్క శబ్దాన్ని దాని అర్థాన్ని ప్రచులిత ఉపయోగాన్ని ఆలోచిస్తే ఇంకా స్పష్టమైన రూపము ఏర్పడుతుంది.

మేధా: ఈ శబ్దానికి వ్యాకరణ సూత్రము -

మేధ్రు - మేధా, హింసనయోః సంగమేచ ।

అంటే-మేధా అనే శబ్దానికి 3 అర్థాలున్నాయి. 1) మేధా-బుద్ధి సంవర్ధనము 2) హింస 3) సంగమము, సంగతీకరణము, ఏకీకరణము - సంఘటనము.

"మేధ" యజ్ఞమునకు పర్యాయవాచ శబ్దము. అందువల్ల భ్రమవశమున యజ్ఞములో హింస చేయవచ్చు అనే మాన్యత

**ఆధ్యాత్మిక జీవితానికి శ్రద్ధ ప్రాణము వంటిది**

ఏర్పడింది. కానీ యజ్ఞ విజ్ఞానములో హింసకి ఏవిధమైన తావులేదు.

నిఘంటువులో యజ్ఞశబ్దానికి 15 పేర్లు ఇవ్వబడ్డాయి. వాటిని తెలుసుకుంటే పరిస్థితి ఇంకా స్పష్టముగా ఉంటుంది.

**1) యజ్ఞము:** ఇది యజ్ అనే ధాతువు నుంచి ఏర్పడింది. యజ్ అనగా దేవపూజనము, సంగతీకరణము, దానము.

**దేవపూజనము:** శ్రేష్టప్రవృత్తులున్న వారిని సన్మానించుట, అనుసరించుట

**సంగతీకరణము:** ప్రేమపూర్వకముగా కలసి మెలసి సహకరించుకునే భావముండుట.

**దానము:** కరుణతో అభావమును దూరము చేసి శ్రేష్ఠ ప్రవృత్తులను పోషించుటకు సహకరించుట.

**2) వేనః :** వేన్ – వేన, గతి, జ్ఞాన్, చింత – నిశామన వాదిత్ర గ్రహణీషు, ఇది సూత్రము. అంటే గతిని ఇచ్చుట, తెలుసుకొనుట, చూచుట, వాయిద్యములు మ్రోగించుట, గ్రహణము చేయుట అనే అర్థాలలో ప్రయోగించబడుతుంది.

**3) అధర్వః సూత్రం:** 'ధ్వరతి పధకర్మా' – 'నధ్వరః ఇతి అధ్వరః' అనగా హింసను నిషేధము చేసేది. అది హింసను బోధించుట జరగదు కదా. అందరికి తెలిసిన విషయమేమిటంటే యజ్ఞములో ప్రమాదవశాత్తు క్రిమికీటకములు కూడా నశించకూడదని తగు జాగ్రత్తలు తీసుకొనబడతాయి.

**4) మేధః :** దీని మూడు అర్థాలు ముందే ఇవ్వబడ్డాయి.

**5) విద్ధ–విద్–జ్ఞానే సత్తాయామ్ లాభే విచారణే, చేతనా – అఖ్యాన నివాశేషు** అనే సూత్రమువల్ల ఈ శబ్ద ప్రయోగము జ్ఞానము, అస్థిత్వము, లాభము. ఆలోచన, చేతనత్వము, వ్యాఖ్యానము, నివాసము అనే అర్థాలలో ఉపయోగిస్తారు.

**6) నార్యః :** నారీ – "నృ–నయె" మనుష్యులను నేతృత్వము చేయించుటకు వారిని శ్రేష్ఠమార్గములో నడిపించుట అని ఉపయోగిస్తారు.

**7) సవనం – సు–ప్రసవే–ఏశ్వదోః** – దీని తాత్పర్యము ప్రేరణ ఇచ్చుట, ఉత్పన్నము చేయుట.

**8) హోత్రా–హు–దాన–ఆదాన యోః అదవేచః** అనగా సహాయము చేయుట, ఇచ్చి పుచ్చుకొనుట, భోజనము చేయుట.

**9) ఇష్ఠి :** ఇది కూడా యజ్ఞార్థముగా ఉపయోగిస్తారు. ఇచ్ఛ, అవస్థ అనే అర్థాలలో కూడా ఉపయోగింపబడుతుంది.

**10) మఖః :** అనగా పూజించుట, సత్కరించుట, వృద్ధి చెందించుట, భాష అనే అర్థాలు.

**11) దేవ :** దేవత్వమును విస్తరించుట, శ్రేష్ట ప్రవృత్తులను సమర్థించుట.

**12) విష్ణు :** వ్యాపక కర్మము అని దీని భావము. సర్వభూత హితము కొరకు చేసే కర్మలను వ్యాపక కర్మలు అంటారు.

**13) ఇందుః :** తడి చేయుట, శాంతపరచుట అని అర్థము. చంద్ర సోమ శబ్దములు శాంతి బోధక పర్యాయ పదములు.

**14) ప్రజాపతిః :** ప్రజలను పాలించేవారు.

**15) ధర్మః :** వేడి, ఉష్ణము, ఊర్జ దీని అర్థములు.

పైన ఇచ్చిన అన్ని అర్థములు జాగ్రత్తగా పరిశీలిస్తే యజ్ఞములో హింసాపరమైన ఆచరణ ఉండకూడదని తెలుస్తోంది.

**ఆలభన :** ఆలభన అనే శబ్దానికి అర్థము స్పర్శ, పొందుట, వధించుట. కానీ వేదాలలో వధ అనే అర్థము తీసుకొనకూడదు. ఉదా:

**బ్రాహ్మణే బ్రాహ్మణం ఆలభేత**
**క్షత్రాయ రాజస్యం ఆలభేత**

అనగా – బ్రాహ్మణత్వము కొరకు బ్రాహ్మణమునితో సహవాసం చేయండి. శౌర్యము కొరకు క్షత్రియునితో సహవాసం చేయండి.

ఇక్కడ ఆలభేత అనే పదానికి వధించుట అనే అర్థము తీసుకుంటే బ్రాహ్మణత్వము కొరకు బ్రాహ్మణుని వధించు, శౌర్యము కొరకు క్షత్రియుని వధించు అని అర్థము కూడా వస్తుంది. ఇటువంటి అనర్థాలు జరుగకుండుటకే "వైదికి హింస –హింస న భవతి" అని అన్నారు.

**బలి:** ఈ శబ్దాన్ని కూడా వధ అనే అర్థములో ఉపయోగించటం మొదలెట్టారు. నిజానికి సూత్రము బలి–

**మతం హృదయాన్ని శాసించగలుగుతుంది**

బల్-ఇన్ దీని అర్థము 1) ఆహుతి, నివేదించుట, ఇచ్చుట. 2) భోజ్య పదార్థాలు సమర్పించుట.

ప్రాచీన వాడుక భాషలో గృహస్తుని నిత్యకర్మలో "బలి వైశ్య దేవయజ్ఞ" విధానములో తను స్వీకరించే ఆహారము యొక్క కొంత అంశము అగ్నికి అర్పించుటయేగాక కొంత అంశము పశు, పక్షి, క్రిమి కీటకాలకు కూడా వేసేవారు. బలి అని చెప్పబడే ఈ క్రియలో జీవవధ ప్రశ్నేలేదు. అంతేగాక తనకంటే దుర్బల జీవాలను పోషించుట అనే అర్థము ఉన్నది.

'మృచ్ఛకటకం' అనే నాటకంలో ఒకపాత్ర ఆర్యచారుదత్తుడు తన మిత్రునితో ఇలా అంటాడు. యాసాం బలిః సపది మద్గృహదేహలీనాం హంసైశ్చ సారస గణైశ్చ విలుప్త పూర్వః॥

అనగా నా ఇంటి గడపవద్ద సమర్పితబలిని హంస, కొంగ, మొదలైన పక్షులు తినేస్తాయి. స్పష్టముగా ఇక్కడ 'బలి' బలివైశ్య రూపములో సమర్పించిన అన్నమే.

బలి యొక్క అర్థము పన్ను (Tax) అని కూడా.

రఘువంశ మహాకావ్యములో రాజదిలీపుని శాసన వ్యవస్థను వర్ణిస్తూ -

**ప్రజానామేవ భూత్యర్థం స తేభ్యో బలి మగ్రహీత్ ।**
**సహస్ర గుణముద్ స్రష్టుం అదత్తే హి రసం రవిః ॥**

అనగా-ప్రజల కళ్యాణము కొరకు "బలి" (Tax) గ్రహించి దానిని ఏ విధంగా సూర్యుడు నీటిని శోషించి వెయ్యి రెట్లు ఫలవంతంగా వర్షిస్తాడో ఆ విధముగా ఉపయోగించేవాడు.

ఇటువంటిచోట్ల బలియొక్క వాడుకలో ఉన్న అర్థము తీసుకుంటే ఏమవుతుంది?

సంస్కృతకోశములో "బలి" కి క్రింది అర్థాలివ్వబడ్డాయి.

1. ఆహుతి లేక బహుమతి 2. నిత్యము ఆహారము ఇచ్చుట 3. పూజ, ఆరాధన 4. ఉచ్ఛిష్టము 5. దేవతలకు అర్పించిన నైవేద్యము 6. సుంకము లేక పన్ను 7. వింజామరాలకి ఏర్పరించే కఱ్ఱ 8. బలి చక్రవర్తి (ప్రహ్లాదుని మనుమడు)

శ్రాద్ధకర్మములో ఇచ్చే గోబలి, కాకబలి మొదలైన విధానాలలో వాటిని వధించుట జరుగదు. శ్రద్ధగా ఆహార పదార్థాలు అర్పించుట జరుగుతుంది.

హిందూ ధర్మకోశము (డా॥ రాజబలి పాండేయ)లో బలిని కన్నడ భాష శబ్దము అన్నారు. దీనినే తమిళంలో "బలి" తెలుగులో కూడా బలి అని అంటారు. ఇది ఒక వన్నె జాతి మనుష్యులకు ఉపయోగించే సంభోదనము. వీరు పశు, పక్షి, లేక ఒక జలచరము యొక్క చిహ్నము తమ సముదాయాలకు గుర్తుగా ఉపయోగిస్తారు. ఏ సముదాయము ఏ చిహ్నాన్ని ఉపయోగిస్తుందో దానిని సంరక్షించుట తమ విశేష బాధ్యతగా స్వీకరిస్తారు. ఇక్కడ కూడా బలి అనే పదము రక్షించటానికి తప్ప వధించుట అనే అర్థములో ఉపయోగించుట లేదు.

యజ్ఞాలలో పూర్ణాహుతి సమయంలో దేవతలకు, యజ్ఞ భగవానునికి భోజ్య పదార్థములు నివేదించే విధానము ఉన్నది. దీనిని "బలి" అని అంటారు. సాధారణంగా సాత్విక ఆహారమే ఇవ్వబడేది కానీ మాంసాహార ప్రేమికులు తామస భోజనము అర్పించటం ప్రారంభించి ఉంటారు. అప్పుడు బలి యొక్క హింసాత్మక అర్థం ప్రచారంలోకి వచ్చి ఉంటుంది. కాని వస్తుతః వైదికి-యజ్ఞీయ సందర్భములో హింసాత్మక చర్యలు వర్జించ బడినవి.

- సశేషం

## మనమంతా యాత్రికుల్లా వచ్చాము

*అమెరికా యాత్రికుడు ఒక భారతీయ యోగిని దర్శించాడు. యోగినివాసమున్న గదిని చూసి అతని అతి సామాన్య జీవితాన్ని చూసి ఆశ్చర్యపోయాడు. ఆ గది చాలా చిన్నది మరియు చాలా సౌలభ్యంగా ఉంది. ఆయనకు ఉన్నది పడుకోవడానికి ఒక చాప మరియు త్రాగుటకు మంచినీటి కుండ. "స్వామీజీ! మిమ్మల్ని ఒక ప్రశ్న అడుగుతాను మీరు ఏమనుకోరు కదా. మీ వస్తు సామాగ్రి తదితర సామాన్లు ఎచ్చట ఉన్నాయి?" అని యాత్రికుడు ప్రశ్నించాడు. స్వామీజీ జవాబిస్తూ "మరి మీ వస్తువులు ఎక్కడ ఉన్నాయి" అని యాత్రికుని ప్రశ్నించాడు. "స్వామీజీ! నేను ఇచ్చటికి యాత్రికునిగా మాత్రమే వచ్చాను" అని యాత్రికుడు జవాబివ్వగా "నేనూ అంతే! యాత్రికునిలా వచ్చాను" అని స్వామి జవాబిచ్చాడు.*

*- సేకరణ: ఎ. శారద*

**దైవీశక్తి వల్లనే మనుష్యులు మారుతారు**


పరమపూజ్య గురుదేవుల సుదీర్ఘయాత్ర-41

# విశ్వానికి ఆశ్రయం ఆ ఆశ్రమం-1

*(గతసంచిక తరువాయి...)*

బోల్‌పూర్ నుండి సుమారు మైలుదూరం నడవగానే, శాంతినికేతన్ వాతావరణం అనుభవం అయింది. నలువైపులా పచ్చదనం, కిలకిలరావాలు చేసే పక్షులు, జలజలా పారుతున్న సెలయేళ్ళు, వయ్యారంగా నడుస్తున్న పశువులు, స్వేచ్ఛగా విహరిస్తున్న మనుషులు. త్రోవ నిర్మానుష్యంగా ఉంది. అక్కడక్కడ కనిపించే వ్యక్తులతో ఎక్కువ మంది యువజనులే.

శ్రీరామ్‌కు ఆసన్‌సోల్‌లోనే శాంతినికేతన్‌కు దగ్గర దారి తెలిసింది. ఆసన్‌సోల్ నుండి వర్ధమాన్ మీదుగా బోల్‌పూర్ చేరుకోవడానికి ఆయనకు సుమారు ఆరుగంటలు పట్టి ఉండవచ్చు. రవీంద్ర కవీంద్రుని పుణ్యభూమి సమీపిస్తోందని బోల్‌పూర్‌లోనే అనుభవమయింది. ఆ రోజుల్లో శాంతినికేతన్ వికాసం చెందుతోంది, అక్కడ ఒక విశిష్ట వాతావరణం నెలకొని ఉంది.



### విశ్వం ఏకమయ్యే స్థలం

శాంతినికేతన్ ముఖ్య ద్వారంపై వ్రాసి ఉన్న ఒక వాక్యాన్ని దూరం నుండే చదవగలుగుతాము. ఆ వాక్యంలో విశ్వమంతటికి ఒక ప్రకటన ఉంది. అది ఆశ్రమానికి సంబంధించిన ప్రకటన కూడా. ఆ సంస్కృత సూక్తి ప్రతి యాత్రికుణ్ణి ఉర్రూతలూగిస్తుంది. **'యత్ర విశ్వం భవత్యేకం నీడమ్'** – అనే ఆ సూక్తి శ్రీరామ్ చిత్తాన్ని పరవశింపజేసింది. సుమారు యాభై సంవత్సరాల పాటు ఒక ఋషి సాధనా స్థలంగా ఉన్న ఆ భూమిలోని కణ కణంలో ఆధ్యాత్మిక సౌరభం వ్యాపించి ఉన్నది. రవీంద్రనాథ్ ఠాగూర్ తండ్రిగారు మహర్షి దేవేంద్రనాథ్ తమ తండ్రి తాతల నివాసాన్ని వదలి 1861లో ఇక్కడికి వచ్చారు. ఆనాడు పేరు ప్రతిష్ఠలు కలిగిన ధార్మిక, సామాజిక, ఆధ్యాత్మిక ఉద్యమం బ్రహ్మ సమాజానికి అగ్రనాయకులలో వారొకరు. గ్రుడ్డి నమ్మకాల నుండి, దురాచారాల నుండి విముక్తి పొందిన సమాజాన్ని నిర్మించడానికై ఉపనిషత్తుల సిద్ధాంతాలతో పాటు పాశ్చాత్య సంస్కృతిలోని మంచి విషయాలను స్వీకరించాలని వారు ప్రబోధించారు. వారు తమ విశ్వాసాలను దృఢంగా ప్రచారం చేశారు.

ఆరోజులలో కూడా సామాజిక సంస్థలలో తీవ్రమైన సంక్షోభాలు చెలరేగేవి. అగ్ర నాయకుల మధ్య అభిప్రాయ భేదాలు కారణంగా బ్రహ్మ సమాజం చీలిపోయింది. సంఘ సంస్కరణ ప్రక్రియ తీవ్రవేగంగా సాగాలన్నది కేశవ చంద్ర సేన్ అభిప్రాయం. సంస్కరణ నెమ్మదిగా జరగాలన్నది దేవేంద్ర నాథ్ మున్నగు నాయకుల అభిప్రాయం. ఆవేశంలో తీసుకున్న చర్య దీర్ఘకాలిక ఫలితాన్ని ఇవ్వదని, దానివల్ల కొత్త చిక్కులు వచ్చిపడతాయని వారు భావించారు. ఈ అభిప్రాయ భేదంవల్ల కేశవచంద్ర సేన్ మున్నగు వారు 'నవవిధాన్' అనే పేరుతో క్రొత్త సంస్థను ఏర్పరచారు.

### మహర్షి వేసిన పునాది

మహోన్నతమైన శీలం, ఆధ్యాత్మిక జ్ఞానం కలిగి ఉన్నందువల్ల దేవేంద్రనాథ్ ఠాగూర్‌ను సమాజం మహర్షి అని సంబోధించేది. ఆయన విద్యకు విశేష ప్రాధాన్యం ఇచ్చారు. బెంగాలులో అనేక విద్యాసంస్థలను ఆయన స్థాపించారు. తమ ఆధ్యాత్మిక లక్ష్యాన్ని సాధించడానికై ఆయన 1861లో బోల్‌పూర్ సమీపంలో 20 బిఘాల స్థలాన్ని కొన్నారు. సాధనా కుటీర్ అనే పేరుతో అక్కడ గృహాన్ని నిర్మించారు. మిగతా స్థలంలో పొలాలు, తోటలు, వాటిమధ్య పూరిళ్ళు ఏర్పాటు చేశారు. ఆ స్థలానికి 'శాంతి నికేతన్' అని పేరుపెట్టారు. పెక్కు సంవత్సరాల తర్వాత ఆయన ఒక ట్రస్టు ఏర్పరచి, ఆ స్థలాన్ని ఆ ట్రస్టుకు అప్పగించారు.

శాంతినికేతన్ కోసం స్థలం కొన్న సంవత్సరంలోనే రవీంద్ర నాథ్ జన్మించడం ఒక విశేషం. రవీంద్రనాథ్‌తోపాటు ఆశ్రమం కూడా పెరిగింది. అయితే దానిలో జీవితం సక్రియంగా లేదు. శాంతి నికేతన్ ప్రశాంతమైన ఆశ్రమంగా ఉండేది. ప్రజలు అక్కడికి ధ్యాన–ధారణలకు, సాధన– స్వాధ్యాయాలకు మాత్రమే వచ్చేవారు. రవీంద్రనాథ్ ఠాగూర్ 1901లో అయిదుగురు

**స్థూల ఉపచారములతో ఏమి జరుగదు. ఆధ్యాత్మికతను లోతుల లోలోపలికి మునిగి తెలిసికోవాలి**

విద్యార్థులకు అక్కడ చదువుచెప్పడం ప్రారంభించారు. ప్రాచీన కాలంలోని బ్రహ్మచర్య ఆశ్రమాలను దృష్టిలో పెట్టుకొని ఆ ప్రారంభం జరిగింది. అందులో 20వ శతాబ్దానికి అవసరమైన ప్రత్యేకతలను జోడించారు.

### విస్తరణ జరిపిన రవీంద్రులు

శ్రీరామ్ 1933లో చూచిన శాంతినికేతన్ 32 సంవత్సరాల క్రితం జరిగిన ఆరంభానికి విరాట్ రూపం. 12 సంవత్సరాల క్రితం అక్కడ ఒక విశ్వవిద్యాలయం స్థాపించబడింది. విద్యార్థులు ఆరుబయటకాని, చెట్ల నీడలోకాని చదివేవారు. విద్యార్థులకు, విద్యార్థినులకు మధ్య అంతరం ఏదీ ఉండేది కాదు. అందరూ కలసి కూర్చునేవారు. తమ తమ విషయాలలో నిష్ణాతులు కావడానికై పరస్పరం సహకరించుకునేవారు. రవీంద్రనాథ్ ఠాగూర్ పర్యటనలలోనే ఎక్కువ సమయం గడిపేవారు. అయితే పర్యటన లేనప్పుడు ఆయన శాంతినికేతన్ లోనే ఉండేవారు. ఆయన నివాసాన్ని 'ఉత్తరాయణ్' అని పిలిచేవారు. శ్రీరామ్‌ను మంత్రముగ్ధుణ్ణి చేసిన విషయం అక్కడి సహజ వాతావరణం, నైసర్గిక వాతావరణం. విద్యార్థులకు చదువు చెప్పడంతోపాటు వారి ఆధ్యాత్మిక వికాసం పట్ల కూడా శ్రద్ధ తీసుకునేవారు. ప్రపంచంలోని వివిధ ఆధ్యాత్మిక సిద్ధాంతాలను అభ్యసించడానికై పెద్ద గ్రంథాలయం ఉండేది. 'సాధనా కుటీర్'లో విద్యార్థులు, ఆగంతకులు, సామూహికంగా ధ్యానం చేసేవారు. చెట్లు, పొదరిళ్ళు, లతల, పూలమడుల సమీపంలో నిర్మించిన మండపాలలో కూడా విద్యార్థులు ధ్యానం చేస్తూ అభ్యసిస్తూ కనిపించేవారు.

### ప్రభుత్వం నుండి సహాయం తీసుకోలేదు

శ్రీరామ్‌ను కలుసుకుని విశ్వవిద్యాలయ అధికారి అమియ రాయ్ ఆనందభరితులు అయినారు. స్వరాజ్య ఉద్యమ సైనికుడు కాక, ఒక సాధుసంత్ శాంతినికేతన్‌ను చూడడానికి వచ్చినందుకు ఆయన గద్గదులు అయ్యారు. సాధకుని పరిచయం ఆయనను మరింతగా ప్రభావితం చేసింది. అమియ రాయ్ శాంతినికేతన్ గురించి ఇలా చెప్పారు. "శాంతి నికేతన్‌ను బ్రహ్మచర్య ఆశ్రమంగా అభివృద్ధిపరచాలనే పథకం రూపొంది నప్పుడు ఠాగూర్ కొన్ని కఠోర నిర్ణయాలను తీసుకున్నారు. ప్రభుత్వం నుండి ఏవిధమైన సహకారం తీసుకోకూడదన్నది ఆ సంకల్పాలలో ఒకటి. ఇలాంటి సంకల్పాలు కారణంగా ఆశ్రమ అభివృద్ధిలో ఇబ్బందులు ఏర్పడ్డాయి. అయితే, వాటి ప్రాధాన్యం కొన్ని సంవత్సరాల తర్వాత అనుభవంలోనికి వచ్చింది."

"ఎలాంటి అనుభవం కలిగింది" – అని శ్రీరామ్ అడిగారు. అమియ రాయ్ ఇలా అన్నారు. "ప్రభుత్వం నుండి సహకారం తీసుకుంటే దాని ఒత్తిడిని కూడా భరించవలసి వచ్చేది. గురుదేవులు రవీంద్రనాథ్ ఠాగూర్ విశ్వభారతికి స్వతంత్ర ప్రతిపత్తిని ఇవ్వగలిగేవారు కారు." శ్రీరామ్ మరో ప్రశ్న వేశారు – "ప్రభుత్వానికి వ్యతిరేకమైనదిగా కనిపించే నిర్ణయం ఏదీ గురుదేవులు తీసుకోలేదు కదా. వారు నిరంతరం విదేశాలకు ముఖ్యంగా బ్రిటన్‌కు వెళుతూ ఉండేవారు కదా."

అమియ రాయ్ ఇలా అన్నారు – "ఆ మాట మీరు ఎలా చెప్పగలరు? బ్రిటీషు ప్రభుత్వం ఆయనకు 'సర్' అనే బిరుదు ఇచ్చింది. 1919లో జలియన్‌వాలాబాగ్‌లో జనరల్ డయ్యర్ అమాయక ప్రజలపై తుపాకీ గుండ్ల వర్షం కురిపించినప్పుడు, గురుదేవులు ఆ బిరుదును త్యజించారు." "బిరుదును వదులుకోవడం వల్ల జరిగేది ఏమిటి?" అని శ్రీరామ్ ప్రశ్నించారు. అందుకు అమియ రాయ్ ఇలా సమాధానం ఇచ్చారు. "బ్రిటీషు ప్రభుత్వంపై దాడి చేయడానికి ఆయన చేతుల్లో తుపాకీ అయితే లేదు. జలియన్‌వాలాబాగ్ కాండ తర్వాత గురుదేవులు వివిధ స్థలాలలో పర్యటించారు. ఆ పర్యటనలో గురుదేవులు ఎద్దుబండిలో ప్రయాణించారు. తమ పర్యటనలో ఆయన దీన స్థితిలో హీన స్థితిలో ఉన్న భారత్‌ను చూసారు. ఆ భారత్‌కు తమ సంవేదన స్వరాన్ని అందించారు. మీకు తెలిసే ఉంటుంది. ఆయన వేలాదిమంది ప్రజలతో సంపర్కం జరిపారు. ఆంగ్లపాలనకు విరుద్ధంగా ప్రజలకు ప్రేరణ ఇచ్చారు.

### విశ్వకవిలోని విప్లవ చైతన్యం

"పర్యటనలో ఆయన గ్రామ పంచాయితీలను స్థాపించ డానికి ప్రేరణ ఇచ్చారు. ఆ పంచాయతీలు గ్రామ సమస్యలను పరిష్కరించాలని, పేదరికాన్ని నిర్మూలించాలని సూచించారు. ఆ పర్యటనలో సుమారు 80 గ్రామాలలో గ్రామ పంచాయితీలు ఏర్పడ్డాయి. గురుదేవులు తలచుకుంటే రైలులో ప్రయాణం చేయగలిగేవారు. రైలు మార్గాలు పట్టణాలనే కలుపుతాయి. ఏ రైలు గ్రామాల వరకు వెళ్ళదు. కనుకనే, రవీంద్ర కవీంద్రులు ఎద్దులబండిని వాడారు. మీకు గుర్తుండే ఉంటుంది. మహాత్మా గాంధీ కూడా ఆయన కార్యం వల్ల, ఆలోచనల వల్ల

**ప్రాణాయామం, ధైర్య సాహసాలను లోపలికి పీల్చుకుంటూ తద్వారా ప్రాణములలో జీవమును ఉత్పన్నం చేస్తుంది**

ప్రభావితులై, ఆయనను గురుదేవులని శ్రద్ధగా సంబోధించారు."

రవీంద్రనాథ్ ఠాగూర్ వ్యక్తిత్వం గురించి, శాంతినికేతన్ గురించి అమియ రాయ్ ద్వారా శ్రీరామ్‌కు ఆంతరిక సమాచారం లభించింది. జలియన్‌వాలాబాగ్ కాండకు పూర్వం ఠాగూర్ నిరంతరం విదేశ పర్యటనలు చేస్తూ ఉండేవారు. బ్రిటన్, డెన్మార్క్, అమెరికా, జర్మనీ, ఫ్రాన్స్, చైనా, ఇరాన్, రష్యా, బర్మా మున్నగు దేశాలలో ఆయన మన సంస్కృతి సందేశాన్ని వినిపించారు; ఆయా దేశాల తత్వజ్ఞానాన్ని అవగాహన చేసుకున్నారు. ఈ పర్యటనలలో ఆయన విశ్వభారతిని పరిచయం చేస్తూ ఉండేవారు. ఆయన ఉపన్యాసాలు, సంపర్కాలు, గోష్ఠులే కాక – ఆయన వ్యక్తిత్వం కూడా ఆయన దేశాలలో విశేషమైన ప్రభావాన్ని కలిగించింది. ఫలితంగా – విదేశీ విద్వాంసులు పలువురు పెద్ద పెద్ద ఉద్యోగాలను వదులుకొని, విశ్వభారతిలో చదువు చెప్పడానికై భారత్‌కు వచ్చారు. ఇక్కడికి వచ్చి విశ్వభారతిలోనే నివసించారు.

జలియన్‌వాలాబాగ్ కాండను గర్హిస్తూ 'సర్' బిరుదును వదులుకుంటూ నాటి వైస్రాయ్ చెమ్స్‌ఫోర్డ్‌కు ఆయన ఒక లేఖ వ్రాశారు. ఆ లేఖ ప్రతిని అమియ రాయ్ శ్రీరామ్‌కు చూపారు. 'సర్' లేక 'నైట్' బిరుదు గౌరవచిహ్నమని ఆయన ఆ లేఖలో పేర్కొన్నారు. ఆ లేఖలోని ఒక భాగాన్ని శ్రీరామ్ తమ నోట్‌బుక్‌లో వ్రాసుకున్నారు. ఆ భాగం ఇలా ఉంది.

### "మా కళ్ళు తెరుచుకున్నాయి"

"మేము ఎంతటి నిస్సహాయ స్థితిలో ఉన్నామో తెలుసు కున్నాము. మా కళ్ళు తెరుచుకున్నాయి. భారత ప్రజలకు ఇప్పుడు ఇవ్వబడిన దండన వంటిది ఏ సభ్యదేశపు చరిత్రలోను, ఏ సభ్య ప్రభుత్వపు చరిత్రలోను కనిపించదు. ఈ కాండకు లజ్జను, గ్లానిని అనుభవించడానికి బదులుగా – భారతీయులకు మంచి గుణపాఠం చెప్పామని మిమ్మల్ని మీరు అభినందించు కుంటున్నారు.

"అధిక సంఖ్యాక ఆంగ్లో ఇండియన్ పత్రికలు ఈ నిర్దయను ప్రశంసించాయి. కొన్ని పత్రికలు పాశవికత పరిధికి చేరుకుని, మా భావనలను ఎగతాళి చేశాయి కూడా. ప్రభుత్వ అధికారులు ఆ పత్రికలపై ఎలాంటి ఆంక్షలు విధించలేదు. అంతే కాదు, భారతీయ సమాజం పట్ల సానుభూతి చూపే పత్రికల గొంతులు నొక్కారు. ఈ పరిస్థితులలో నేను కనీసం ఈ పని అయినా చేయగలుగుతాను; ఎలాంటి దుష్పరిణామాలనయినా అనుభవించడానికి సిద్ధపడి – భయం కారణంగా భీతాహం కారణంగా ప్రభుత్వ దమనకాండను మౌనంగా సహిస్తున్న కోట్లాది దేశ ప్రజల తరపున ఇందుకు వ్యతిరేకతను ప్రకటిస్తున్నాను. ప్రభుత్వం ఇచ్చిన బిరుదులు జాతీయ అభిమానానికి పొసగని తరుణం వచ్చింది. అవి మా సిగ్గు మాలిన తనాన్ని మరింతగా బహిర్గతం చేస్తాయి. కనుక– సామ్రాట్టు ఇచ్చిన 'నైట్' (knight) బిరుదు నుండి నన్ను విముక్తి చేయవలసిందిగా నేను తప్పనిసరి అయి సాదరంగా విజ్ఞప్తి చేస్తున్నాను."

### స్వావలంబన బోధించిన విశ్వభారతి

అమియరాయ్ శ్రీరామ్‌కు శాంతినికేతన్ తర్వాత శ్రీనికేతన్‌ను చూపారు. ఈ స్థలం రవీంద్ర కవీంద్రుని నివాసానికి సుమారు మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్నది. ఆ సమయంలో శ్రీనికేతన్‌లో పరిశ్రమలలో, శిల్పకళలలో ప్రశిక్షణ ప్రారంభ మయింది. భవిష్య దృష్టి ఇక్కడ వికసిస్తోంది. గ్రామాలు స్వయం సమృద్ధిని సాధించాలని ఠాగూర్ ప్రబోధించారు. పరిశ్రమలు, వృత్తులు అభివృద్ధి పొందవలసిందే; అయితే గ్రామాలు పట్టణాలపై పూర్తిగా ఆధారపడకూడదు; వాటి స్వంత వ్యవస్థ సుదృఢం కావాలి. ఇదే ఆయన అభిప్రాయం.

అమియ రాయ్‌ని శ్రీరామ్ ఇలా అడిగారు – "మీరు ప్రభుత్వం నుండి సహకారం తీసుకోవడం లేదు. మరి, సంస్థ ఎలా నడుస్తోంది." ఆ అధికారి ఇలా చెప్పారు – "వాస్తవం ఏమంటే – సంస్థ ఎలా నడుస్తోందో ఎవ్వరికీ ఎంతమాత్రం తెలియదు. వారసత్వపు సంపదపై వచ్చే ఆదాయాన్ని ఠాగూర్ ఈ సంస్థకు ఇస్తున్నారు. వారి మిత్రుల సంఖ్య, శాంతినికేతన్ సానుభూతిపరుల సంఖ్యా చాలా పెద్దది. ఈ వనరులన్నింటి ద్వారా ఆశ్రమపు అవసరాలు తీరుతాయి. ప్రభుత్వ సహాయాన్ని తీసుకునే అవసరం ఎన్నడూ రాలేదని ఖచ్చితంగా చెప్పగలను."


శ్రీరామ్ మనస్సులో, మెదడులో కాశీ హిందూ విశ్వ విద్యాలయపు స్మృతులు వెలికిరాసాగాయి. ఆ స్మృతులు శాంతి నికేతన్ అనుభూతులలో కలియడంతో – ఆయన మనస్సులో ఒక సంకల్పం రూపొందసాగింది. తన విరాట్ సంకల్పం కూడా నెరవేరే తరుణం వస్తుందని ఆయనకు అనిపించింది.

*(సశేషం)*

**పరధ్యానం, బద్ధకం, అస్తవ్యస్తత, సోమరితనం, నిరుత్సాహం ఉన్నటువంటి మనోభూమిలో శక్తివిహీనమైన ఆలోచనలు ఉత్పన్నమై వాడిపోతాయి**

బాలల దినోత్సవ ప్రత్యేకం

# అద్భుతమైన విలక్షణమైన బాలలు




చిన్నారులు అందరికీ ప్రియమైన వారే! పిల్లల లేబ్రాయపు పసితనము, అమాయకత్వము అందరి మనస్సులను రంజింప జేస్తుంది. పసివారి వచ్చీరాని ముద్దుముద్దు మాటలు, తెలుసుకోవాలనే జిజ్ఞాస, నిష్కపటత్వముతో నిండిన చంచలమైన స్వభావము అందరినీ ఇట్టే ఆకర్షిస్తుంది. మనస్సుకు ప్రశాంతతను చేకూరుస్తుంది. పిల్లల సుతిమెత్తని చిఱునవ్వులు, పకపకల సవ్వడులు ఎల్లరినీ సంతోషములో ముంచెత్తుతాయి. చిన్నారుల మనస్సు మల్లెవలె స్వచ్ఛంగా ఉంటుంది. ఈ కారణముగానే దివంగత మాజీ ప్రధాని జవహర్‌లాల్‌నెహ్రూ గారు నిర్మల మనస్కులైన పిల్లలంటే అమిత మక్కువ చూపే వారు. వారికి చిన్నారులతో గట్టి అనుబంధమున్నది. అందు చేతనే నెహ్రూగారు తమ పుట్టినరోజును 'బాలలదినంగా' జరుపుకోవాలని కోరుకున్నారు. నెహ్రూగారి జన్మదినంనాడు దేశవాసులంతా పిల్లలను తలచుకుంటారు. చిన్నపిల్లలు సైతం నెహ్రూగారిని 'చాచానెహ్రూ' అని ప్రేమతో పిలుస్తారు.

పిల్లలు కోమల మనస్కులు. వారి మనస్సు మృదువుగా ఉంటుంది. అందుచేత చాలా తేలికగా వారిని ఎలా కోరుకుంటే అలా మలచవచ్చు. కోమలమైన మొక్కవలె సున్నితముగా ఉండే ఆ చిన్నారులను కంటికి రెప్పవలె పెంచి-పోషించుటకు కఠోరముగా శ్రమించితీరాలి. అప్పుడే వారిలో భిన్నభిన్న ప్రతిభలు పైకి పెల్లుబుకుతాయి. అలాకాకుండా ఒకవేళ పిల్లవానిలోని ప్రతిభ బాల్యములోనే స్వతఃసిద్ధముగా వ్యక్తమైతే దానిని 'చమత్కారము'(అద్భుతం) అనే భావించాలి. ఎందుకంటే అందరిలో పసిప్రాయములో ఏదైనా ఒక విశేషమైన ప్రతిభ వికసించుట అన్నది కనబడదు. ఎవరో కొంతమంది విలక్షణమైన పిల్లలు మాత్రమే తమ అద్వితీయమైన ప్రతిభను ప్రదర్శించి, దానిని జీవితములో ఉపయోగించుకుంటారు.

అట్టి విలక్షణమైన ప్రతిభావంతులలో ఏడేళ్ళ వయస్సున్న చిన్నారి పృథ్వీక్ ఒకడు. 7వ తరగతి చదువుతున్న ఆ చిన్న ప్రాయములోనే 'జంతురసాయన శాస్త్రము' వంటి జటిలమైన విషయము మీద రెండు పుస్తకములను వ్రాశాడు. అందులో ఒకటైన – When Dinosaurs Roamed The earth అన్నది వైజ్ఞానిక రంగములో ప్రకంపనలు సృష్టించినది. పృథ్వీక్‌కు డైనోజార్స్‌కు సంబంధించిన విశేషాల మీద అభిరుచి మెండు. వీటిని గూర్చిన లోతైన విషయ సేకరణ చేసి, సమీక్షించి వ్రాసినదే ఆ పుస్తకము. డైనోసార్స్ గురించి పృథ్వీక్ ఇలా అంటాడు. 'డైనోసార్స్ లక్షలాది సంవత్సరముల పాటు ఈ భూమి మీద జీవించాయి. అయితే ఇప్పటివరకు వాటిలోని కొన్ని జాతులనే మనము గుర్తించటము జరిగింది.' పృథ్వీక్‌కు బాల్యము నుండే ఎన్నోరకములైన భౌతికశాస్త్ర సంబంధిత సిద్ధాంతముల పరిజ్ఞానమున్నది. కేవలము $2^1/_2$ ఏళ్ళ వయస్సులోనే ఆ చిన్నారికి 'అపకేంద్రీయశక్తి' (ఎదురుగాలి) (Opposite Force) గురించి తెలుసు. మనము మన మోటారుబండిని ఏదైనా మలుపు వద్ద మలుపు త్రిప్పుతున్నప్పుడు ఎదురుగాలిలోని శక్తి వలన బండి నడపటము కష్టమైనపుడు అనుభవమయ్యే విషయము ఆ బాలుడికి చిన్నప్పుడే తెల్సింది. పృథ్వీక్ తల్లి ఇందిర ఇలా అంటారు. 'పృథ్వీక్ కోరే ప్రతి కోరిక తీర్చటమంటే అది కఠినమైన పరీక్షను ఎదుర్కోవటం కంటే తక్కువైనదేమీ కాదు.' చిన్నారి పృథ్వీక్ పేర్లను గుర్తుపెట్టు కోవటం చూసినచో ఈ బాలుడు మిగతా పిల్లలకంటే భిన్నమైన వాడు అని మనకు అనిపిస్తుంది.

ఇదేవిధముగా శివపూర్‌లోని కోటద్వార్‌లో ఉంటున్న దియానేగీ కేవలము ఏడేళ్ళ పసిప్రాయపు చిన్నారి. అయితే 3వ తరగతి చదువుతున్న దియా బుద్ధి మాత్రము కంప్యూటర్ వలె భలే చురుకైనది. దియా యొక్క అమోఘమైన జ్ఞాపకశక్తి అందరినీ ఆశ్చర్యపరుస్తుంది. దియా కేవలము జటిలమైన పెద్దపెద్ద సూత్రములను చాలా తేలిగ్గా గుర్తుపెట్టుకోవటమే కాక; వాటిని అలవోకగా పరిష్కరించేస్తుంది. గణితము, విజ్ఞాన శాస్త్రములో దియా కనబరిచే ప్రతిభ విస్మయమును కలిగిస్తుంది

ప్రలోభాలకు లోనైన మనస్సు లక్ష్యాన్ని సాధింపజాలదు

అని పిల్ల తల్లిదండ్రులు అంటారు. దియా ఏ సూత్రమునైనా సరే ఒక్కసారి విన్నా లేక చదివినా దానినెన్నడూ మర్చిపోదు. దియాకు ఎన్నో విషయములు గుర్తుంటాయి. ఉదా: 10వ తరగతిలోని లెక్కల సూత్రాలను చిటికెలో చెప్తుంది.

12వ తరగతి (ఇంటర్) మరియు బి.ఎస్సీ స్థాయి గణితములో ఉండే త్రికోణమితి సూత్రములన్నీ దియాకు కొట్టిన పిండే. భౌతికవిజ్ఞానములో ఐఐటి స్థాయిలో ఉండే అయస్కాంతక్షేత్రము, ఎలక్ట్రోస్టేటిస్టిక్స్ వంటి కష్టమైన పాఠ్యాంశములలోని సూత్రముల మాతృకలను చెపితేచాలు దియా పూర్తిసూత్రములను ఒప్పజెప్పగల దిట్ట. అంతేకాదు ఆ సూత్రములను మౌఖికముగా చెప్పటమే కాక; ఎడంచేత్తో బంతాట ఆడినంత తేలిగ్గా ఆ సూత్రాలను పరిష్కరిస్తుంది. ఇంతమాత్రమే కాదు. రసాయనశాస్త్రములో ఆవర్తనపట్టిక (Periodic Table)లో ఏది – ఎక్కడ అడిగినా దియా తడుము కోకుండా ఇట్టే చెప్పేస్తుంది. 118 రసాయన తత్త్వముల పరమాణుభారము (బరువు), వాటి సంఖ్య మరియు సూత్రము, వాటి పేరును చెప్పగల ధారణాశక్తి దియా స్వంతము.

ఇంతేకాకుండా కళ్ళుమూసుకుని కంప్యూటర్ కీ–బోర్డ్‌ను చెప్పగలదు. ఈ ప్రతిభలన్నింటితో పాటు చూచినదాన్ని దేన్నయినాసరే తేలిగ్గా గుర్తుపెట్టుకోగల స్మరణశక్తి ఉన్నది. దియాకున్న అసాధారణ ప్రతిభను లోకం గుర్తించినది. దియా తన తరగతి పరీక్షలు జరుగబోయే కొద్దిరోజుల ముందు మాత్రమే పాఠాలను చదివినప్పటికినీ పరీక్షలలో 99 నుండి 100% మార్కులతో ఉత్తీర్ణురాలౌతుంది. ఇంత చిన్న వయస్సులో అంతటి విలక్షణమైన ప్రతిభ ఖచ్చితముగా అరుదుగా మాత్రమే గోచరిస్తుంది. దియాలోని ప్రతిభను గురించి విన్నప్పుడు ఆశ్చర్యము వెయ్యటమే కాదు అసలు ఇదెలా సాధ్యము అన్న అనుమానము తలెత్తడము సహజమే! దియా విషయములో మాత్రము జరిగింది ఇదే.

చిన్నారులలోని ప్రతిభలను గురించి చెప్పుకుంటున్న ఈక్రమములో తన రెండు చేతులతో ఏకకాలములో వ్రాయగల నేర్పరియైన నైనా అశ్వనీకుమారి హైదరాబాద్‌కు చెందిన మరొక చిన్నారి. కేవలము ఎనిమిదేళ్ళ చిరుప్రాయములోనే ఉన్నత పాఠశాల చదువులో ఉత్తీర్ణురాలైనది. 10 సంవత్సరముల వయస్సులో ఇంటర్‌లో ఉత్తీర్ణతను సాధించి అందరిని విస్మితులను గావించినది. కేవలం 13 ఏళ్ళకే ప్రస్తుతం మాస్ కమ్యూనికేషన్ డిగ్రీ మూడవ సంవత్సరము చదువుతున్నది. 7 యేళ్ళ వయస్సునుండే ఈ అద్భుత ప్రతిభ నైనాలో గోచరించడము ఆరంభమైనది. ఆ చిట్టివయస్సులోనే సంపూర్ణ రామాయణము కంఠస్థము చేసి ఎల్లరను చకితులను చేసింది.

చదువులోనేకాక నైనా మంచి ఆటగత్తె కూడా. టేబుల్ టెన్నిస్ ఆటలో 12 సంవత్సరముల లోపు బాలికల విభాగములో ఉత్తమ జాతీయ క్రీడాకారిణిగా నిలిచింది. ఈ ఆటలో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో నైనా 18 బంగారు పతకములను గెల్చుకున్నది. ఈ ప్రతిభతో పాటు నైనాకు ఉన్న మరో ప్రతిభ పియానోను వీనులవిందుగా వాయించడము. ఈవిధముగా నైనా బహుముఖ ప్రతిభా సంపన్నురాలు! తనకున్న ఈ ప్రతిభా పాటవాలతో నైనా మన దేశం పేరును ప్రపంచమంతా మారుమ్రోగేటట్లు చేసింది.

పైన చెప్పినవారంతా పేరెన్నికగన్న ప్రతిభాశాలురు. అయితే మన దేశములో ఎంతోమంది బాల ప్రతిభాశాలురు ఉన్నారు. భారతమాత ప్రతిభామూర్తులకు జన్మదాత్రి! ఆ ప్రతిభావంతులే మన దేశ సంపద! ఈ గడ్డమీద పుట్టిన ప్రతి చిన్నారిలోనూ ఏదో ఒక ప్రతిభ ఉన్నది. కానీ కొంతమందిలో ఆ ప్రతిభ వికసిస్తుంది. ఇంకొంతమందిలో వికసించదు. అంతే తేడా. ఒకప్రక్క ఒక చిన్నారిలోని ప్రతిభ వికసించటానికి తగినంత సహకారము, మార్గదర్శనం లభిస్తుంటే; మరోప్రక్క మరో చిన్నారిలోని ప్రతిభ పొటమరించక మునుపే మహత్వాకాంక్షల బరువు దానిని అణగద్రొక్కుతున్నది. ఈ ప్రతిభ కేవలము ఆటపాటలు, చదువుసంధ్యలకే పరిమితము అనేమీ లేదు. ప్రతిభ అనేక రూపాలలో ఉంటుంది. చిన్నపిల్లల్లో కళాత్మకమైన ప్రతిభ అనగా చిత్రలేఖనము, సంగీతము, నాట్యము వగైరాలుగా కూడా వెల్లివిరియవచ్చు. కావలసినదల్లా ఆ ప్రతిభను గుర్తించి దాని వికాసమునకు సహాయపడుట మాత్రమే. అలా చేసినచో మన దేశం భిన్నభిన్న రకములైన ప్రతిభలతో కళకళలాడుతూ భరతమాత విశ్వమునకే తలమాని కమౌతుంది. అది అట్లే అగుగాక!!

– *అనువాదం: శ్రీమతి లక్ష్మీరాజగోపాలు*

**జ్ఞాని, విద్వాంసుడు, సదాచారుడు, పరోపకారి, ఉదారుడు అయిన వ్యక్తియే మనుష్యునిలో ఉన్నత స్థానం పొందగలడు**

# జ్యోతిర్విజ్ఞానమునకు పునర్ వైభవం తీసుకురావల్సిన సమయం ఆసన్నమైనది

జ్యోతిష్యమును నమ్మినా లేక నమ్మకున్నా; దానిని సమర్థించినా లేక విమర్శించినా ఇదంతా తప్పకుండా వైజ్ఞానిక దృష్టికోణముతో సాగాలి. వైజ్ఞానికత అనగా **'వైజ్ఞానికమైన మానసిక స్థితిని కలిగి ఉంటూ, విజ్ఞాన సమ్మతమైన రీతిలో దానిని ఉపయోగించుకొనుట!'** భూమి మీద ఖగోళం యొక్క ప్రభావము ఉంటుందనీ; ఖగోళము-భూగోళము-ప్రకృతిల దృశ్యాదృశ్య కారకములన్నీ కలసి మానవ జీవితమును ప్రభావితము చేస్తాయన్నది లెక్కలేనన్ని ప్రయోగములు-పరీక్షల అనంతరము నిరూపితమైన ఒక గొప్ప తథ్యము! మానవ జీవితము మీద పడే దృశ్యాదృశ్య ప్రభావములన్నింటి సమ్యక్ అధ్యయనము కొరకు ఏ ప్రకాశము యొక్క ఆవశ్యకత ఉన్నదో- అదే **'జ్యోతిష్యము!' 'ద్యుతేరిసిన్నాదేశ్చజః'** నుండి **'జ్యోతిష్యము'** అన్న శబ్దోత్పత్తి జరిగినదని నిర్వచించబడినది. (అనగా **'ద్యుతి దీప్తౌ'** అన్న ధాతువులో 'ఇసిన్ ప్రత్యయము' మరియు 'దకారము'ను చేర్చి 'జకారాంతము' చేసి 'జ్యోతిష్ లేక 'జ్యోతిజం' శబ్దము కూర్చబడినది.)

ఇందులో **'అర్థ ఆదిభ్యో౽చ్'** నుండి 'అచ-ప్రత్యయము' తీసుకొనబడి జ్యోతిషము యొక్క అకారాంతశబ్దము రచించ బడినది. మరల **'తదధికృత్య కృతోగ్రన్థః'** అన్న పాణిని సూత్రము నుండి 'అణ-ప్రత్యయము' చేర్చుతూ 'జ్యోతిష్యము' అన్న పదము పూర్తిగా కూర్చబడినది. దీనికి అర్థము జ్యోతిష్య సంబంధమైన సిద్ధాంతము లేక జ్యోతిష్య గ్రంథము! శాస్త్రము అన్న శబ్దోత్పత్తి రెండు రకములుగా నిర్వచించబడినది. **1) శాసనాత్‌శాస్త్రమ్** అనగా కర్తవ్యాకర్తవ్యములు మరియు కరణీయము (చేయవలసినది) - అకరణీయము (చేయకూడనిది) లకు చెందిన విషయములను ఆదేశించేదే **'శాస్త్రము!' 2) శాస్త్రత్వం శంసనాదపి** - అనగా ఏదైనా ఒక విశేష ఉద్దేశ్య నిమిత్తము సంపూర్ణముగా అర్థమును నిర్వచించే జ్ఞానమును అందించే శాస్త్రము! రెండు ఉత్పత్తుల ఆధారముగా 'ఏదైనా ఒక వస్తు స్వరూపమును చాలా సరిగ్గా నిర్వచించగలిగే అనగా వస్తు సత్యమును బోధపరచే జ్ఞానమును అందించేదే శాస్త్రము అని చెప్పబడినది. అందుచేత 'జ్ఞానప్రకాశముతో జీవితము-కర్మ-కర్తవ్యము యొక్క మార్గమును దర్శింపజేయునది జ్యోతిష్య శాస్త్రము!! అని నిర్వచించబడినది. కనుక జ్యోతిష్యశాస్త్రము కర్మశాస్త్రము! కర్తవ్యశాస్త్రము! అని అర్థము. జ్యోతిష్యము చెప్పే కర్మవిశ్లేషణలో గతకాలం అనగా పూర్వజన్మ, వర్తమానము అనగా ప్రస్తుత జన్మ మరియు భవిష్యత్తు అనగా రాబోయే జన్మ అనగా భూత భవిష్య వర్తమానములు మూడు వస్తాయి.

జీవితమునకు చెందిన దృశ్యాదృశ్యముల యొక్క సమస్త ఆయామము (dimensions)లను గూర్చిన వ్యాఖ్య జ్యోతిష్యములో వివరించినంత సమ్యక్‌దృష్టితో మరెక్కడా వివరించబడలేదు. ప్రసిద్ధ విద్వాంసుడు పైరాసెల్సస్ 'వైద్య రంగములో (చికిత్సలో) జ్యోతిర్విజ్ఞానమును ఉపయోగించుట ఎంతో లాభప్రదం' అని అన్నాడు. మానవ శరీరము మీద మైక్రోకాస్మిక్ ప్రభావము ఉంటూ ఉంటుందని మైక్రోకాస్మిక్‌విద్య చెపుతుంది. వైద్యరంగముతో దీనికి చాలా గట్టి అనుబంధమున్నది అని కూడా అన్నాడు పైరాసెల్సస్. 'మానవ శరీరములోని అంగ-అవయవములు మరియు గ్రహనక్షత్రముల సంబంధమును విడమర్చి చెప్పే ఒక పట్టికను రూపొందించాడు. అతను చేసిన ఈ ప్రయత్నము వలన శరీరము మీద, ఔషధుల మీద ఖగోళ గ్రహీయ శక్తులు చూపించే ప్రభావములను గురించిన పలు ప్రయోగ ఫలితాల సంకలనము జ్యోతిర్విజ్ఞానము రూపములో ఆవిష్కృతమైనది. పైరాసెల్సస్ ఒకనాటి గొప్ప చికిత్సాశాస్త్ర నిపుణుడు. సుప్రసిద్ధ గ్రంథము **'ద ఫణ్డామెణ్టో సెపియెణ్టీ'**లో ఇలా వ్రాశాడు. 'ఆధునిక చికిత్సా పద్ధతి మానవుడి స్థూలశరీరము విషయమునే తెలియజెప్తుంది కానీ మానవుడి శరీరములో విరాజిల్లే చేతనామయశక్తిని గురించి అదెక్కడా వివరించదు. ఈ మానవ చేతనత్వము వ్యష్టిలో ఉంటూ కూడా సమిష్టి యొక్క చైతన్య ప్రవాహముతో అవిచ్ఛిన్న రూపములో జోడించబడి ఉంటుంది. అది మంచి చెడు ప్రభావముల చేత ప్రభావితమౌతూంటుంది.'

అతని అభిప్రాయము ఏమిటంటే అసాధ్యమైన శరీర వ్యాధులను దూరము చేయుట కొరకు శరీరములోని రోగ నిర్ధారణ, మనోవిశ్లేషణతో పాటు ఖగోళ గ్రహప్రభావ

**చద్దికూడు తిన్నమ్మ మొగుడి ఆకలి ఎరుగదు**

పరిజ్ఞానమును సముపార్జించుకొనుట ఆవశ్యకము. ఎందుకంటే భూమి సౌరమండలములోని ఇతర గ్రహములతో అనుసంధానించబడి ఉన్నది. కనుక భూమి, ప్రాణులు వాటన్నింటి గమనము లేక కదలికలతో ప్రభావితమౌతాయి. ఇందువలన మానవుడి ఆరోగ్యము కేవలము భూవాతావరణముతోనే కాక సౌరమండలములోని ఇతర గ్రహముల స్థితిగతుల మీద కూడా ఆధారపడి ఉంటుంది. ఈ విషయమును విస్తృతముగా వర్ణించే 'ఎస్ట్రోనామియా'లో అనేకానేక నిగూఢరహస్యములు వ్రాయబడి ఉన్నాయి. ఆ పుస్తకములో వ్రాయబడిన తథ్యములను అనుసరించి స్థూల–సూక్ష్మ శరీరములు, జడ–చేతనాలకు చెందిన విషయములన్నీ కూడా విభిన్న గ్రహములతో నిరంతరము ముడిపడి ఉంటాయి. సప్త గ్రహముల ప్రభావము ఈవిధముగా ఉంటుంది.

**1) సూర్యుడు –** సూర్యదేవుడు ప్రాణతత్త్వమునకు అధిష్ఠాత. సూర్యుడు మానవ జీవితములో క్రియాశక్తి, ప్రాణశక్తి రూపములో విరాజమానమై ఉంటాడు.

**2) చంద్రుడు –** చంద్రదేవుడు మనస్సుకు అధిష్ఠాత. చంద్రుడు మనిషి ఆలోచనాశైలి మీద తిరుగులేని ప్రభావమును చూపిస్తాడు.

**3) కుజుడు (మంగళగ్రహము)–** ఇచ్ఛ, వాసనలు, కర్మల మీద ఆధిపత్యము చూపిస్తాడు.

**4) బుధుడు –** వివిధ మనోశక్తులను లేక సామర్థ్యములను సూక్ష్మరూపములో నియంత్రిస్తుంటాడు.

**5) గురువు (బృహస్పతి) –** ఆధ్యాత్మికశక్తి, సంవేదన, భావన, శ్రద్ధలను ప్రభావితము గావిస్తాడు.

**6) శుక్రుడు –** అంతర్ముఖమైన ప్రకృతులను (ప్రవృత్తులను) ఉత్పన్నము చేస్తాడు.

**7) శని –** ప్రకృతి అధిష్ఠాత! పృథ్వీతత్త్వము ప్రధానముగా ఉన్న గ్రహము.

**8) రాహువు –** శనిగ్రహము యొక్క సూక్ష్మ ప్రభావము రాహువులో ఇమిడి ఉంటుంది.

**9) కేతువు –** కుజుని సూక్ష్మశక్తులు కేతువులో సమాహితమై ఉంటాయి.

పైరాసెల్సస్ అభిప్రాయము ప్రకారము జ్యోతిర్విజ్ఞానము కేవలము ఆకాశములోని గ్రహ–నక్షత్రముల స్థితిగతులను గురించిన సమాచారమును అందించేంతవరకే పరిమితమవ్వదు. **పృథ్వి యొక్క వాతావరణము మీద, ప్రాణుల మీద ఉండేటటువంటి ప్రభావమును అధ్యయనము చేస్తూ విశ్లేషణ గావించటము, పరస్పరము ఇచ్చిపుచ్చుకోవటము ద్వారా లాభములను పొందటము అన్నది జ్యోతిర్విజ్ఞానము యొక్క ముఖ్య ఉద్దేశ్యము!** ఇదంతా తెలుసుకుంటున్నప్పుడు తప్పకుండా ఒక జిజ్ఞాస తలెత్తడము సహజమే!

ఇతర గ్రహములు పృథ్వీమీదున్న మానవ జీవితమును ప్రభావితము గావించినచో మరి వాటి ప్రభావము అన్నిచోట్లా ఒకేలా ఎందుకు ఉండటము లేదు? ఈ ప్రశ్నకు జవాబిస్తూ పైరాసెల్సస్ ఇలా అంటాడు. 'భూమిలో ఒకేచోట నాటబడిన మామిడి, వేప, నిమ్మ మొదలైన మొక్కలు తమతమ ప్రకృతిని అనుసరించి గుణధర్మములను గ్రహిస్తాయి. బంగారు గని వైపు బంగారము; వెండిగని వైపు వెండి; ఇనుపగని వైపు ఇనుము ఆకర్షించబడుతుంది. అలాగే ఆకాశములో ఆవరించి ఉన్న ఈథర్‌తత్త్వములోకి ప్రసారము గావించబడిన వివిధ రకములైన కార్యక్రమములలో రేడియో కేవలము ఏ సూచిక మీద ముల్లు నిలబెట్టబడినదో ఆ ప్రాంతములో సంప్రేషణ చేయబడుతున్న వార్తలనే గ్రహిస్తుంది. సరిగ్గా అదే రీతిలో భూమిమీదున్న మానవులు విశ్వచైతన్యమనే విశాల సాగరములో జీవిస్తూ కూడా తమ తమ ప్రకృతికి అనురూపముగా అంతరిక్ష గ్రహాల అనుదానములను గ్రహిస్తారు. తత్కారణముగా మంచి–చెడు ప్రభావములతో ప్రభావితమౌతారు.'

నిండుపున్నమి వేళ చంద్రుడు మానసికస్థితి మీద అమిత ప్రభావమును చూపిస్తాడు. అయితే ఈ ప్రభావము అందరి మీదా ఒకేలాగ ఉండదు. బలహీన, అసంతులిత మనస్కుల మీద చంద్రుని ప్రభావము–ప్రతిక్రియ ఎక్కువగా కనిపిస్తుంది. దీనికి విరుద్ధముగా సంతులితమైన, దృఢమైన మానసికస్థితి గల వ్యక్తుల మీద చంద్రుని ప్రభావము అంతగా కనిపించదు. ప్రాచీన భారతీయ మహర్షులు, జ్యోతిర్వేత్తలు అద్భుతమైన ఈ జ్యోతిర్విజ్ఞానమును ఔపోసనపట్టారు. ఋషుల మాదిరే డాక్టర్ డేవిడ్ అనే జ్యోతిర్విజ్ఞానవేత్త 'మ్యాజిక్ ఆఫ్ హవర్స్' అనే పుస్తకములో మానవుడి శరీరము మీద, వివిధ

**మనస్సు పామని భావిస్తే శరీరం వణికిపోతుంది. దానిని తాడని భావిస్తే శరీరం దృఢతరమవుతుంది**

అవయవముల మీద గ్రహములు, రాశులు విభిన్నముగా చూపించే ప్రభావములను గురించి వ్రాశాడు.

**1) మేషరాశి –** కుజుడు ఈ రాశికి అధిపతి. కుజుని వలన శరీరములో పైభాగమున ఉండే మెదడుకు చెందిన కర్మలు ప్రభావితమౌతాయి.

**2) వృషభరాశి –** శుక్రుడు ఈ రాశికి అధిపతి. కంఠము, గొంతులను నియంత్రిస్తాడు.

**3) మిథునరాశి –** ఈ రాశికి అధిపతి బుధుడు. ఛాతి, పొట్టను బుధుడు నియంత్రిస్తాడు.

**4) కర్కాటకరాశి –** చంద్రుడు దీనికి అధిపతి. శరీర పృష్ఠభాగము చంద్రుని అధీనములో ఉంటుంది.

**5) సింహరాశి –** సూర్యుడు ఈ రాశికి అధిపతి. హృదయము, మేరుదండము, మోచేతులు సూర్యుని ఆదేశమును అనుసరించి స్పందిస్తుంటాయి.

**6) కన్యారాశి –** బుధుడు ఈ రాశికి అధిపతి. చేతులు, ప్రేవులు, విసర్జనావ్యవస్థను కట్టడిచేస్తాడు.

**7) తులారాశి –** శుక్రుడు ఈ రాశికి అధిపతి. శరీరము లోని వెనుక భాగము, మూత్రాశయ వ్యవస్థను అదుపులో ఉంచుతాడు.

**8) వృశ్చికరాశి –** కుజుడు ఈ రాశికి అధిపతి. కడుపు, జనాంగములను నియంత్రిస్తాడు.

**9) ధనురాశి –** గురువు ఈ రాశికి అధిపతి. తొడలు, పిరుదులు, కాలేయము గురువు అధీనములో ఉంటాయి.

**10) మకరరాశి –** శని దీనికి అధిపతి. మోకాళ్ళు, కండరాల వ్యవస్థను నియంత్రిస్తాడు.

**11) కుంభరాశి –** దీనికి అధిపతి శని. పాదములు, చీలమండలు శని అధీనములో పనిచేస్తాయి.

**12) మీనరాశి –** దీనికి అధిపతి గురువు. కాళ్ళు, నాడీ మండలవ్యవస్థను నియంత్రిస్తాడు. *(సశేషం)*

## అంధ విశ్వాసాలవీడి మంచి పనులు చేసి ఎదుగుటపై విశ్వాసముంచు

*ఒకరోజు వారి కూలీ పనివాడు తన ఆర్థిక స్థితిని తలచుకొని దుఃఖితుడై, దీని నుండి బయట పడుటకై మహాత్ముని ఆశీర్వాదం కోరివచ్చాడు. అతనిపై జాలి తలచి మహాత్ముడు తనవద్దనున్న గాడిదను దానం ఇచ్చాడు. కూలీవాడు గాడిదను చూసి మిగుల సంతుష్టుడై, ఇటుకలు మోయుటలో, సరుకులు మోయుటలో మిగుల సహాయకారిగా ఉండునని సంతోషపడ్డాడు. కావాలంటే దానిపై సవారీ కూడా చేయవచ్చును అని తలచాడు. ఇట్టి ఆలోచనలతో గాడిదతో ముందుకు సాగిపోతూ ఉండగా, దారిలో గాడిద కాలుజారి క్రిందపడి మరణించింది. దీనితో దుఃఖితుడై, ఆ గాడిదను ఒక గొయ్యి త్రవ్వి దానిలో పూడ్చిపెట్టి సమాధి చేసి తిరిగి ఏడ్వనారంభించాడు. ఆ గాడిద సమాధి చెంత ఏడుస్తున్న కూలివానిని చూసి బాటసారులలో ఒకబాటసారి ఇలా అన్నాడు – ఒక దివ్యాత్మ ఈ సమాధిలో తప్పక నివాసముంటుంది అంటూ, సమాధిపై శిరస్సునుంచి నమస్కరించి, దక్షిణ ఉంచి వెళ్ళాడు. తదుపరి ఒకరి వెంట ఒకరు దీనిపై విశ్వాసముంచి సమాధిని దర్శించే వారి సంఖ్య రోజు రోజుకు పెరుగసాగింది. దీనిని చూస్తున్న కూలీవాడు భయపడి, యావత్ వృత్తాంతాన్ని మహాత్మునికి వివరించగా "దీనిలో భయపడవలసింది ఏమి లేదు. నేను సహృదయంతో నీకు సహాయం చేశాను. బహుశ భగవంతుడు నీకు సహాయమందించుటకై ఈ మార్గాన్ని చూపి ఉండవచ్చు. ఆ గాడిద బ్రతికి నీకు చెయ్యలేని సహాయాన్ని చనిపోయి చేస్తున్నది. సమాధిపై ఈ వచ్చే ఆదాయాన్ని జాగ్రత్త పరచి మరో మంచి పనికి వినియోగించు. ఈ ప్రపంచము ఇట్టి అంధ విశ్వాసాలకు లోనై పయనించుచున్నదనే విషయాన్ని ఎల్లప్పుడు గుర్తుంచుకో. కావున ఇట్టి చమత్కారాలపై కాక, నీవు చేసే మంచి పనులపై విశ్వాసముంచి నీ జీవితాన్ని చక్కదిద్దుకో" అని సెలవిచ్చాడు మహాత్ముడు.*

*– హిందీమూలం: అఖండజ్యోతి, సెప్టెంబర్ 2015*

*తెలుగు అనువాదం: ఎ. శారద*

**రాజ్య శక్తి మనుష్యుల హృదయాలను శాసించలేదు**

దీపావళి ప్రత్యేకం

# వేర్పాటువాదం అనే చీకటిని తొలగించగల దీపాన్ని వెలిగిద్దాం రండి!

దీపావళి దీపాల పండగ. లెక్కలేనన్ని దీపాలు వాటి వెలుగులతో కార్తీక అమావాస్యపు కారు చీకట్లను పూర్తిగా చెదరగొడతాయి. దీపాలు వెలిగి రాత్రిని ప్రకాశింపచేస్తాయి. ఆరిపోయే లోపల ఆ దీపాలు వాటి కర్తవ్యాన్ని పూర్తిగా నిర్వహిస్తాయి. స్వయంగా కాలకపోతే తప్ప వెలుగులు నింపడం కుదరదుగా! ఈ దీపాలేంచేస్తాయో ఏమో కాని, వాటిని చూస్తే అంతస్సులో రంగుల హరివిల్లు వెలుస్తుంది. బైటికి ఎలాగు వెలుగులు వెదజల్లే దీపాలే, మేఘావృతమైన మనస్సులో ప్రకాశ కిరణాలను మెరిపిస్తే దీపోత్సవ మర్మం ప్రస్ఫుటిస్తుంది.

దీపావళికి సంబంధించి అనేక పౌరాణిక గాథలున్నాయి. ఉగ్రవాదానికి మారురూపమైన రావణాసురుడిని సంహరించి రాముడు తిరిగి వచ్చినప్పుడు స్వాగతం పలకడానికి ప్రతి ఇంటి వారు మట్టి ప్రమిదల్లో దీపాలు వెలిగించారు. ఈ విధమైన అనేక పౌరాణిక గాథలున్నాయి. వాటన్నింటి గురించి పాఠకులకు ఇదివరకే తెలిసే ఉంటుంది. తెలియందల్లా ఈ పండగకు సంబంధించిన మర్మం. ప్రతి సంవత్సరం లాగానే ఈసారి కూడా అట్టహాసంగా దీపావళి జరుగు



తుంది. దీపాలు వెలుగుతాయి, మిఠాయిలు పంచుకుంటారు, కొత్త బట్టలు, వస్తువులు, నగలు అన్నీ కొంటారు. అలంకరణ తారాస్థాయికి చేరుకుంటుంది. వెలుగులు, ఉత్సాహంతో కూడిన పండగ. ఇలా ఉంటేనే అది సమృద్ధికి ప్రతీక.

దీపావళి అంటేనే సమృద్ధి మరియు వైభవానికి పండగ. లక్ష్మీదేవిని పూజించే ఈ పండగరోజు ఆ మాత్రం వైభవం ఉట్టిపడడం స్వాభావికమే. గత కొన్ని దశాబ్దాలలో సమృద్ధికి, వికాసానికి కొత్తకొత్త అర్థాలు పుట్టుకొచ్చాయి. ఉన్నత స్థాయిలకి చేరుకున్నాయి. ఇప్పుడు మట్టి ప్రమిదల పక్కన బంగారు ప్రమిదలు వెలుగుతున్నాయి. సమాజానికి, మనుషులకీ సుఖ సౌఖ్యాలు, సమృద్ధి వైభవాలు బాగా అందుబాటులోకి వచ్చాయి. దీపావళి రోజు దీపంతోపాటు వైభవం కూడా వెలుగుతోంది. ఈ విధమైన సర్వతోముఖ వికాసవర్ణం ఎంతో సుఖప్రదమైనది.

వీటన్నింటి మధ్య ఏదైనా మనకు కనిపించట్లేదు అంటే అది మన ఆంతరిక మోహం – తమస్సు. ఈ దీపాలు బైటకి వెలుగుతున్నప్పటికి మన అంతస్సులోని చీకటిని ఏమీ చేయలేకపోతున్నాయి. ఆంతస్సులోని మోహాంధకారం అలానే ఉంది. బయట ఎన్ని సంపదలున్నా, ఎంత వైభవం ఉన్నా లోపల మాత్రం పేదరికమే, అంతా డొల్లే. సరోవరంలో గంటలు కొద్ది స్నానం చేసినా తృప్తి చెందని పరిస్థితి మనది.

దీపావళి అంటే చిమ్మ చీకటి రాత్రి కూడా అణువణువు వెలుగులతో నిండుతుంది. నలుదిక్కులా వెలుగులు మిరుమిట్లు గొలుపుతాయి. అందుకే దీనిని వెలుగుల పండుగ అన్నారు. దేవతలు కూడా ఈ పండగని చూడడానికి ఉవ్విళ్ళూరుతుంటారు. లక్ష్మీదేవి ఈ రోజు తన వైభవాన్నంతటినీ దర్శింప జేస్తుంది. చర్మచక్షువులకే కాదు అంతస్సును కూడా వెయ్యి రెట్లు వెలిగిస్తుంది. బైటకి ఎంత పులకించినా, అంతఃదృష్టి లేకపోవడం వల్ల అంతర్జగత్తులోని ఐశ్వర్యం మనల్ని అబ్బుర పరచలేదు.

ఆధ్యాత్మికంగా దీపావళినాడు రాత్రికి చాలా ప్రాముఖ్యత ఉంది. తాంత్రికులు, యోగులు వారి వారి పద్ధతుల్లో ఈ రాత్రంతా ఎన్నో ప్రయోగాలు, సాధనల్లో మునిగిపోతారు. వారిలో సాధనల దివ్యలోకం దేదీప్యమానంగా వెలుగు తుంటుంది. ఈ రాత్రిని కాళరాత్రి అంటారు. ప్రొద్దున చతుర్దశి ఘడియలు, రాత్రికి అమావాస్య ఘడియలుంటే దానిని అత్యుత్తమంగా భావిస్తారు. అదే దుర్లభమైన నిజమైన కాళరాత్రి. ఇలాంటి ఘడియలలో యక్షులు, గంధర్వులు, దేవతలు, ఋషులు శరీరాన్ని ధరించి మర్త్యలోకాన్ని అనేక రెట్లు శోభాయ మానంగా మారుస్తారు. ఋషుల తేజస్సు వేల సూర్యులకాంతితో సమానంగా ఉంటుంది. అటువంటి దివ్యాత్మలు శరీరాన్ని ధరించి ఈ లోకంలో అడుగుపెడితే ఈ జగత్తు యొక్క వెలుగును, తేజస్సును ఊహించలేము.

దీపావళినాడు గ్రహాల మధ్య ఒక ప్రత్యేకమైన దివ్యయోగం ఏర్పడుతుంది. అందువల్ల స్థూల మరియు సూక్ష్మజగత్తుల మధ్యనున్న గోడ పల్చబడతుంది. చాలాచోట్ల తలుపులు తెరుచుకుంటాయి. కాబట్టే దివ్యాత్మల రాక సులభమవుతుంది.

**స్నేహం నిద్రపోతే ద్వేషం పనిచేస్తుంది. ద్వేషాన్ని నిద్ర పుచ్చి స్నేహానికి అవకాశం ఇవ్వాలి**

అందుకే ఇటువంటి రాత్రి దుర్లభమైనది, అమూల్యమైనది అని నమ్ముతారు. కొన్ని ప్రత్యేకమైన ప్రయోగాలు ఈ దివ్య ముహుర్తంలో మాత్రమే చేయబడతాయి కాబట్టి ఈ మహా యోగం కోసం తాంత్రికులు, యోగులు సంవత్సరాల తరబడి వేచి ఉంటారు. గొప్ప సాధకులు ఈ ముహూర్తంలో చేసే సాధనవల్ల వారి నాడులను కప్పే పొరలు బలహీనమవుతాయి. ఆ నాడుల కొసలు ఎన్నో లోకాల్లోకి వెళ్ళి తెరుచుకుంటాయి.

యోగుల ప్రకారం హృదయలోకపు కొస దేవలోకంలో తెరచుకుంటుంది. సాధారణంగా హృదయలోకానికి, స్వర్గలోకానికి మధ్య ఆవరణ అభేదమై ఉంటుంది. కానీ ఈ ప్రత్యేక ముహూర్తంలో సిద్ధ సాధనను పూర్తి చేసుకున్న సాధకులకు సునాయాసంగా స్వర్గలోకంలోకి ప్రవేశం లభిస్తుంది. ఈ ముహూర్తంలో నాడులు జాగృతమవ్వడం వల్ల ఎన్నో లోకాల్లో విహరించవచ్చు. మచ్చుకు కొన్ని విశిష్టతలు ఇక్కడ చెప్పుకున్నా కాళరాత్రి గొప్పతనం ఇంకా ఎన్నో రెట్లు ఎక్కువ. కాబట్టి బాహ్య వైభవం మిరుమిట్లుగొలిపే పండగే కాదు, కాళరాత్రి ఆంతరిక ఐశ్వర్యం యొక్క దుర్లభ యోగం. జాగృతులైన సిద్ధ సాధకులు ఈ దివ్యజ్యోతి సాగరంలో తృప్తిగా మునకలేసి బుద్ధి-సిద్ధుల విభూతులను చేజిక్కించుకుంటారు. వీటి మాధ్యమంగానే వారు అనేకుల చీకటి అంతస్సులను వెలిగిస్తుంటారు.

సామాన్య సాధనలో అభిరుచి కలిగినవారు ఈ కాళరాత్రిని ఉపయోగించుకోవడం మరువకూడదు. సరదాగా గడిపేసే వారికి ఏమీ చిక్కదు, కానీ సమర్థులైన మార్గదర్శకుని సాన్నిధ్యంలో ఉండే సాధకుడి అంతస్సులో వేల జ్యోతుల కాంతి వెలుస్తుంది. కాబట్టి మన అభిరుచి, సామర్థ్యాలను బట్టి ఈ రాత్రిని ప్రార్థన, సాధన, జప, ధ్యానాదులతో ఉపయోగించుకోవాలి. దీపావళి నాడు ఈ కాళరాత్రి యొక్క విలువైన అనుభూతులను ఆస్వాదించండి. ఈ దీపావళినాడు అంతస్సులో ఒక దీపం ఖచ్చితంగా వెలిగించుకుంటామని సంకల్పించండి; దాని సద్గుణాల వెలుగు మనల్ని, మన చుట్టుపక్కలా కూడా ప్రకాశవంతం చేయాలి.

లోపలి దీపం ఆరిపోయింది. దీనిలో జన్మజన్మల కషాయ కల్మషాలు పేరుకుపోయాయి. ఈర్ష్య, ద్వేషం, లోభం, మోహం, అహంకారాల దట్టమైన నల్లటి పొర అంతస్సులోని ఆత్మదీపపు జ్యోతిని బైటికి రానివ్వటం లేదు. అంతస్సులోని ఈ గాఢాంధకారాన్ని సాధనల ప్రకాశంతోటే తొలగించవచ్చు. ఈ ఆంతరిక అంధకారానికి పరిణామమే సమాజంలో సమత్వం, సామరస్యం లేకపోవడం. మన లోపల ఇంతటి హాహాకారం చెలరేగుతుంటే బయటి ఉల్లాసంగా ఎలా ఉండగలం. మన లోపల ఉన్న దోషదుర్గుణాలే సామూహికంగా సమాజంలో ప్రతిబింబిస్తాయి. అందుకే నేడు సమాజంలో హింస, హత్యలు, ఉగ్రవాదాలతో దారుణమైన అల్లర్లు, అల్లకల్లోలాలు చెలరేగుతున్నాయి.

దీపాల వెలుగు మన అంతస్సును కూడా వెలిగించాలి అనేది దీపావళి మూలమర్మం. లోపల దీపం వెలిగించుకుంటే ఆ వెలుగుతో కల్మషం చెదిరిపోతుంది. కషాయ కల్మషాలు తొలిగిపోతూంటే మనోల్లాసంతో ప్రసన్నంగా ఉంటాం. అంతస్సులోని ఈ పులకింత సమాజంలో వెలిగితే సమాజంలోని ఒత్తిడి, బాధ, వైమనస్యత వల్ల ఏర్పడి భయానక వాతావరణం మారుతుంది. మళ్ళీ సమాజంలో ఐక్యత, సమానత్వం, ఔదార్యం, ఓర్పు, సేవవంటి దివ్యగుణాలు అభివృద్ధి చెందుతాయి. దీపాలతోపాటు సమాజంలో ఈ గుణాలు కూడా వెలుగుతుంటే అటువంటి దీపావళినాటి శోభాయమాన దృశ్యం ప్రత్యేకంగా ఉంటుంది.

త్రేతాయుగంలో పధ్నాలుగేళ్ళ వనవాసం తరువాత రాముడు తిరిగి వచ్చినప్పుడు అయోధ్యలో ఈ విధమైన దివ్య దీపావళి వెలిగింది. లోపల బయట వెలుగుతున్న ఈ దివ్య దీపాల వెలుగులో అందరూ సౌభాగ్యలక్ష్మి దివ్యదర్శనం చేసుకున్నారు. లక్ష్మీదేవి కృపవల్ల నలుదిక్కులా సుఖసమృద్ధులు నిండాయి. అన్ని వైపులా కాంతి విరజిమ్మింది. భూమి మీదే కాదు, మనుషుల మనస్సుల్లోను ఎక్కడా వెతికినా చీకటి కనిపించలేదు. దివ్యప్రకాశంలో అందరు ఓలలాడారు. ఇటువంటి దీపావళి జరుపుకోవడానికి స్వర్గం నుండి దేవతలు కూడా వచ్చేవారు. కానీ ఇప్పుడు ఉగ్రవాదులు ఎక్కువైయ్యారు.

నేడు దీపావళిని ఉగ్రవాదపు భయంతో జరుపుకుంటున్నాం. ఏ దీపంలోని నిప్పుతో ఏ బాంబు పేలుతుందో తెలీదు, ఎంత మంది ప్రాణాలు కోల్పోతారో తెలీదు. ఉల్లాసం, వెలుగులకు బదులు మూలుగులు, హృదయాన్ని చీల్చే ఏడుపులు మార్మోగుతాయేమోనని భయమేస్తుంది. మానవత్వం ప్రస్ఫుటించేటట్టుగా, ప్రేమ ఉప్పొంగేట్టుగా ఒక దీపం ఈ దీపావళి రోజున వెలిగించాలని సంకల్పిద్దాం. మనందరి దీపాల వెలుగులో ఎలాంటి ఉగ్రవాది కూడా మారువేషంలో కూడా దాక్కోలేడు. రండి, వేర్పాటువాదపు చీకటి అంతరించి, మానవీయ గుణాల వెలుగులు వెదజిమ్మే దీపాన్ని వెలిగిద్దాం. అప్పుడే దీపావళి సార్థకమవుతుంది.

*- అఖండజ్యోతి, నవంబర్ 2008*
*అనువాదం: శ్రీమతి జయలక్ష్మి*

**అజ్ఞానం శూద్రత్వం - సుజ్ఞానం బ్రాహ్మణత్వం**

పరమపూజ్య గురుదేవుల అమృత వచనాలు - 3

# విధేయతతో కూడిన ఆలోచనలు ప్రగతికి మూలం

ఈ ప్రపంచం చాలా అధర్మమార్గంలో చరించుచున్నది. అధమ స్థితికి చేరుతున్నది. కానీ ఒకింత మంచి కూడా దృగ్గోచర మగుచున్నది. భగవంతుని రూపము కూడా దర్శనమిచ్చు చున్నది. దీనితోపాటు దుష్టులు, ధూర్తులు కూడా ప్రపంచ మంతటా దర్శనమిచ్చుచున్నారు. అయితే మనం ఏమి చెయ్యాలి? ఈ దుష్టసంస్కృతిని, చెడును, చెడ్డవారిని ద్వేషించుట వెలివేయుట దీనికి పరిష్కారమా? ద్వేషించినచో మనము కూడా ద్వేషింపబడతాము! అట్లే ఈర్ష్యను ప్రదర్శించినవారు కాలిపోక తప్పదు. ప్రతీకారేచ్ఛకు పాల్పడిన వారు కూడా ప్రతీకారాగ్నిలో కాలిపోక తప్పదు. ఎదుటివారికి మనమెంత కీడు తలపెడతామో, ప్రతిగా అంతకు మించిన కీడును పొందుతాం! ఈ మార్గంలో పయనించినచో నూతన ఆపదలకు తెరలేపిన వారమవుతాం! ఇన్నింటి మధ్య మనమెట్లు జీవించ గలము? చెప్పండి! ఇట్టి సంకట సందిగ్ధ స్థితిలోనికి మనము వెళ్ళరాదు! వెళ్ళినచో జీవచ్ఛవంలా జీవించాల్సి ఉంటుంది.

మీరు ఏమి చేస్తారు? మీరు చెడును ఓర్మితో సహిస్తారా? లేదు! చెడును సహించమని! మేము చెప్పుట లేదు. మీరు చెడును తప్పక ఎదిరించండి! కానీ దీనిని ఎదిరించి పోరాడుటకు మరో పద్ధతి ఉన్నది. అది ఎట్టిది? ఆ పద్ధతి ఇది. రోగికి స్వస్థత చేకూర్చుటకై డాక్టరు రోగిపై హక్కును కలిగి ఉంటాడు. ఈ రోగి యొక్క రోగాలను తొలగించుటకై ప్రతిక్షణాన్ని ఉపయోగిస్తూ ఉంటాడు. రోగాన్ని ఎదగనీయరాదు. విషాణువులను ఎదగనీయరాదు. రక్తంలోని మలినాలను ఎదగ నీయరాదు. కాని ఈ ప్రయత్నంలో రోగికి ఎట్టి కష్టనష్టాలను కలుగనీయరాదు. కానీ మీరు రోగికి కష్టం నష్టం కలిగించుటకు మించి, అతనిలో చెడులను దూరం చేయుటకు తగిన స్థాయిలో తగిన రీతిగా చేయవలసినంత ప్రయత్నం చేయుట లేదు. మీరు విశేషరీతిలో హాని కలిగించిన వ్యక్తిని గురించి విచారించినచో, అతడు / ఆమె దోషిగాను, అతని దోషాలను దుర్గుణాలను లోటుపాట్లను తొలగించుట కొరకై మార్గాన్ని యోచించాలి. అప్పుడు ఎట్టి దుఃఖం ఎవ్వరికి కలుగదు. మీరు చేయవలసింది ఇది.

మీరు మరో పని కూడా చేయవలసి ఉంది. మీరు మనో నిబ్బరాన్ని కలిగి ఉండాలి. ఆత్మ విశ్వాసాన్ని కలిగి ఉండండి. మీ పై మీరు ఆధారపడండి. తరువాత ఇతరులపై అతిగా భరోసా ఉంచకండి. ఏ ఒక్కరిపైనా అతిగా విశ్వాసముంచక ఉండవలసిన మేరకు విశ్వాసముంచండి. దీనిని మనస్సున ఉంచుకొని ముందుకు నడవండి. అప్పుడు ఉన్నతిని సాధించుట సాధ్యపడుతుంది. ఈ రీతిగా ఎదుటివారితో చక్కని అవగాహన పెంచుకొని, వారి సహాయాన్ని పొందగలము. ఎదుటి వారిపై ఉంచవలసినంత నమ్మకాన్ని విశ్వాసాన్ని ఉంచుటకు ప్రయత్నించిననేగాని సఫలతను సాధించగలం.

పూర్తిగా ఇతరులపై ఆధారపడి జీవించుట, జీవచ్ఛవంతో సమానం. ఇది ఇతిహాసము యొక్క కథ! ఇప్పుడు సరిగ్గా ఉంది. మాటకారి అయినచో సహాయత లభించవచ్చు, లభించకపోనూవచ్చు. కావున మీరు మీ కాళ్ళపై నిలచి అడుగు ముందుకు వేయండి. మీ కాళ్ళ శక్తిపై భరోసా ఉంచి ఎత్తిన అడుగును కొనసాగించండి. భరోసాతో మా పనిని చేపట్టండి. మేము కూడా చేస్తాం. మీరు ఆత్మవిశ్వాసం, మనోనిగ్రహం పెంపొందించుకోండి. సూర్యుడు ఎవ్వరిపైనా ఆధారపడిలేడు. తనకు అర్ఘ్యం ఇచ్చినా ఇవ్వకపోయినా పట్టించుకోడు. అట్లే గాలి ఎవ్వరిపై ఆధారపడక తన కర్తవ్యాన్ని పూరించుచున్నది, ఎవ్వరిపైన ఆశలు కూడా పెట్టుకోలేదు. చంద్రుడు ఎవ్వరిపైనా ఆశలు పెట్టుకోలేదు. అట్లే భూమి ఎవ్వరిపైన ఆశలు పెట్టుకొన లేదు. పై రీతిలో మీరు కూడా ఎవ్వరిపై ఆశలు పెట్టుకొన వలదు. అనగా దీని అర్థము మీరు ఎవ్వరితో సహాయ సహకారాలనందిస్తూ జీవించవలదు అని కాదు! ఇతరులతో కలసిమెలసి ఉండవద్దని కాదు!

విధేయాత్మక ఆలోచనల ద్వారా మనిషి దేవతగా మారతాడు. చెడ్డవానిని మేము మంచివానిగా చేస్తాం, సజ్జనుని చేస్తాం. దీనిని మీరు ఎందుకు ఆలోచించుటలేదు? చెడ్డవాడు హత్య చేస్తాడు. ఇతనిని దండిస్తాం. ఈ రీతిన ఎందుకు ఆలోచిస్తారు? ఇలా ఆలోచించకండి. మీ దృష్టికోణాన్ని మార్చుకోండి. మీకు లభించింది, మీ వద్ద ఉన్నది తక్కువేమీ

**ప్రకృతి ఎక్కువగా మనుష్యునికి బుద్ధిని ప్రసాదించింది**

కాదు. చాలా లభించింది. మీరు గమనించుకొనుట లేదు. ఇతర జంతువులను చూడండి. పశుపక్ష్యాదులను చూడండి. క్రిమి కీటాదుల చూడండి.

భగవానుడు మిమ్ముల రాజకుమారులనుగా తయారు చేశాడు. మీకు బుద్ధిని ప్రసాదించాడు. మీకు వాణినిచ్చాడు. మీకు కాళ్ళు చేతులిచ్చాడు. మీకు నివాసానికై గృహాన్ని ఇచ్చాడు. మీలో ప్రాణశక్తి ఉంది. మొదటి తేదికే, జీతం అందుతుంది. అవునా కాదా! వేరే జంతువులను చూడండి. ఆ నిస్సహాయ జీవులకు ఎవ్వరైన జీతభత్యములిచ్చేవారున్నారా? ఎవ్వరైనా నౌకర్లు ఉన్నారా? ఏమైన బట్టలు ఉన్నాయా? ఏమైనా మాట్లాడగలవా? వీటన్నింటితో పోల్చిచూస్తే మీకు ఎన్నో ఎన్నో రకాలు వరదానాలుగా లభ్యమై ఉన్నాయి. వీటన్నింటి ఆధారంతో మీరు సుఖంగా ఆనందంగా జీవించవచ్చు గదా? కానీ మీరు ఆనందంగా ఉండజాలనుకున్నారు. అలానే సుఖంగా కూడా మనజాలకున్నారు. మీ మోముపై చిరునవ్వు కనిపించుట లేదు కదా? కాని మన వర్తమాన పరిస్థితులలో మనము ప్రసన్నంగా జీవించే హక్కు మనకున్నది.

మీరు ఎల్లవేళలా అభద్రతా భావాలలో ఉంటున్నారు. అనగా దీని అర్థము మీరు నరకంలో ఉన్నట్లు! అభద్రతా భావన అస్సలు మీ మనస్సులోనికి రానివ్వరాదు, అట్లే వానిని దూరంగాను ఉంచవలదు! అని నేను చెప్పుట లేదు సుమా! నేను చెప్పుచున్నదేమనగా ఎల్లప్పుడూ, **అభద్రతలో నున్నాం, అభద్రతలోనున్నాం, దరిద్రులుగా ఉన్నాం. నిర్ధనులుగా నున్నామని అని ఆలోచిస్తూ కూర్చున్నచో, మీరు దరిద్రులుగా, నిర్ధనులుగా మారిపోతారు సుమా!** కావున మీరు ఎట్టి స్థితిలో కూడా మిమ్ములను మీరు నిజంగా, అభద్రులుగా, దరిద్రులనుగా, నిర్ధనులుగా తలంచవలదు. దీనిని గుర్తించి, అర్థము చేసికొని తదనుగుణంగా నడచుకొన్నచో మీరు దేవతలే! మీరు దేవతగా ఉన్నచో, ఇచ్చే సమర్థతను కలిగి ఉంటారు. ఇవ్వటానికి మీ వద్ద చాలా ఉంటాయి. రూపాయిలు, పైసలు మా వద్ద కూడా చాలా తక్కువగా ఉన్నాయి. మీ నుండి పైసలు అడుగుతున్నారు? పైసలు ఇచ్చి మీరు, మనుష్యులను ఏ విధంగా బలవంతులగావించెదరు? మీరు ఇతరులకు ఇవ్వవలసింది ప్రేమ, సన్మానము చూడండి, ప్రపంచం సమ్మానం కొరకై ఎంతో దప్పికకొని ఉంది. జనులకు ప్రోత్సాహ మందించండి. చూడండి. మీ నుండి ప్రోత్సాహాన్ని అందుకున్న వారు చిన్న చిన్నవారు సైతం ఎంత ఎత్తుకు ఎదుగుతారోఎలా తయారవుతారో చూడండి! ఇవ్వటానికి కొరతలేదు సుమా! మీరు సహాయం అందించండి. ఇతరులకు సానుభూతిని అందించండి! ఇవ్వటానికి ఎంతమాత్రం కొరతలేదు. మీరు నాలుగు రొట్టెలు తినుటకు బదులు మూడు తినండి, నాలుగవదానిని పేదలికిచ్చి వారి క్షుద్బాధ తీర్చండి. అప్పుడు చూడండి మీకు ఎంతటి శాంతి లభిస్తుందో మరియు మీ మోము, హృదయం ప్రసన్నతతో నిండిపోతాయి.

భగవంతుని పేరే ప్రేమ, మీ లోపల ప్రేమను మొలకెత్తిం చండి. ప్రేమ, మీలో మొలకెత్తిన రోజు నుండి, మీ మనస్సు, ఒక సంతోషంతో నిండి, అచ్చట అల ఉత్పన్నమై తీరుతుంది. ఇతరులకు మేము ఎట్లు సహాయమందించగలం అనుకోకండి? ఇతరులకు సహాయమందించుటకై సంసిద్ధులైనచో మీకై మీరు కొన్నింటిని తగ్గించుకోవలసి ఉంటుంది. తదుపరి మీరు బ్రాహ్మణోచిత జీవనాన్ని జీవించవలసి ఉంటుంది. బ్రాహ్మణుని పొదుపుతో కూడిన జీవితాన్ని జీవించేవాడిగా భావిస్తాం, మిత వ్యయం చేసేవానిగా భావిస్తాం. అపరిగ్రహ గుణమున్నవానిగా, అల్పసంతోషిగా గుర్తిస్తాం.

మీరు బ్రాహ్మణుల్లా తయారు కండి. భూమిపై, పృథ్విపై మీ పేరును చిరస్థాయి చెయ్యండి. "సంత్" అని ఎవ్వరిని పిలుస్తారు? పరోపకారులను పిలుస్తారు. లోకహితంలో నిమగ్న మైన వారిని పిలుస్తాం! సత్ప్రవృత్తులలో తనను తాను సమర్పిత మైన వానిని సంత్ అని పిలుస్తాం. మీరు సంత్ మరియు బ్రాహ్మణరూపంలో, ఇరువురి జీవన విధానాన్ని అందిపుచ్చు కొని జీవించుచున్నచో, మీరు ఆనందమయజీవనం జీవిస్తారు. మీరు ఇలా జీవించెదరు గాక! ఇదే మా ఆశ. ఈరోజు ప్రసంగం సమాప్తం.

– *తెలుగుసేత:* ఎ. శారద


**యుగశక్తి గాయత్రి**
**మాసపత్రిక చదవండి !**
**చదివించండి !!**


**బలమే గొప్పతనానికి చిహ్నమైతే, పిశాచాలు, బేతాళుడు, చాలా గొప్పవారని భావించాలి**

కర్మకాండ ఎందుకు? ఎలా?-6

# గాయత్రీ సాధనా విధానము

మేము పూజ్యగురుదేవుల సమక్షములో మాయొక్క ఒక సందేహాన్ని వెలిబుచ్చాము. 'మీరు 24 సంవత్సరముల పాటు గాయత్రీమహామంత్ర 24 పురశ్చరణలు చేసి లాభాన్వితు లయ్యారు, కానీ చాలామంది చాలా పురశ్చరణలు చేసినప్పటికీ ఎటువంటి లాభమును పొందలేదు. దీనివెనుక గల కారణమును దయతో తెలియజేయండి.'

గురుదేవులు మా శంకానివృత్తి చేసేముందు ఒక కథను వినిపించారు. ఒకసారి రాజస్తాన్‌లో ఒక తిరునాళ్ళు జరిగింది. ఆ తిరునాళ్ళలో ఒక వ్యక్తి ఎలుగెత్తి అరుస్తూ ఒక రూపాయికి ఒక మంచమును విక్రయిస్తున్నాడు. ఒక రూపాయికి ఇంత చౌకగా మంచము లభిస్తున్నది కనుక దానిని కొనుగోలు చేయాలనుకున్నాము. మధ్యాహ్నము ఇక్కడే దానిమీద విశ్రాంతి తీసుకోవాలి అని అనుకున్నాము. మేము మంచము కొనటానికి వెళ్ళినప్పుడు ఆ వ్యక్తి ఇలా అనటము విన్నాము. 'రెండు కుడికాళ్ళు లేవు, రెండు ఎడమకాళ్ళు లేవు, మధ్యలో ఉండే చెక్క భాగము లేదు, మూడు మంచము కోళ్ళు లేవు. సోదరా! మంచమును కొనుక్కో.' అతను మంచమునకు ఉండే ఒక కోడును అమ్మకానికి పెట్టాడు. అతని ఈ హాస్యపు చేష్టలకు, వేళాకోళమునకు అందరు నవ్వుతున్నారు. నీకు కూడా ఈ కథను విన్న తరువాత నవ్వొస్తూ ఉండి ఉంటుంది. అయితే నీ అనుమానమునకు తగిన సమాధానము ఇందులో ఉన్నది. కేవలము జపము చేయుటచేత లాభాన్వితులవ్వాలని అందరు కోరుకుంటారు. వ్రాయుటకు కూడా మూడు వస్తువులు అవసరమవుతాయి. అవి-కాగితము, కలము, సిరా. పొలంలో పంట పండుటకు కూడా ఎరువు, నీరు, విత్తనము కావాలి. మన జీవితానికి కూడా అన్నము, గాలి, నీరు అనే మూడు ఆవశ్యకమే! **కేవలము జపముతో పని జరుగదు, రామనామమే సరిపోదు. నామజపముతోపాటు రామకార్యమును కూడా చేయవలసి ఉంటుంది.** హనుమంతుని వలె 'రామ కాజ కబిరె బినా మోహి కహాం విశ్రామ్' అనే భావనను జాగృతపరచు కోవాలి. బిల్వమంగళుడు తన జీవిత గమనమును మార్చుకుని-సూరదాసు అయ్యాడు. రత్నాకరుడు అనే గజదొంగ (వాల్మీకి) రామనామ జపమును తల్లక్రిందులుగా చేసినా ఆ జపము అతని జీవనవిధాన క్రమమును మార్చివేసింది. అలా మారిన తరువాత మాత్రమే అతను ఇంత గొప్ప ఋషి కాగలిగాడు.

గోస్వామి తులసీదాసు త్రివేణీసంగమస్నాన గొప్పతనమును ఇలా వర్ణించాడు.

త్రివేణిలో స్నానమాచరిస్తే కాకి-కోయిల అవుతుంది, కొంగ-హంస అవుతుంది, కానీ అలా జరుగుట సంభవమేనా? బాహ్యాకృతి ఈవిధముగా మారుతుందా? ఆకృతి కాక ప్రకృతి మారుతుంది అని దీని భావము. ఈ త్రివేణిలో స్నానమాచరిస్తే మనిషి యొక్క మనస్సు కూడా ఉత్కృష్టస్థితిని అందుకొంటుంది. ఆ త్రివేణియే-ఉపాసన, సాధన, ఆరాధన. **గాయత్రీమంత్ర జపముతోపాటు ఉపాసన, సాధన, ఆరాధన అనే మూడు జరిగినప్పుడే అవి తమ అద్భుతములను చూపుతాయి.**

## ఉపాసన

ఉప-ఆసన=ఉపాసన అనగా సమీపమున కూర్చొనుట. కట్టె అగ్నితో మమేకమైనప్పుడు అది అగ్నికణికగా మారుతుంది. భగవంతుని చెంత కూర్చున్నచో భగవంతునికి అనురూపమైన గుణ, కర్మ , స్వభావములు రూపుదాలుస్తాయి. భగవంతుని అనుశాసనమును అనుసరించి నడువవలసి ఉంటుంది. సమర్పణ చేసుకోవలసి ఉంటుంది. కీలుబొమ్మ గారడీవాని సంకేతానుసారము ఏవిధముగా నాట్యమాడుతుందో; అదే విధముగా మనిషి తననుతాను భగవంతునికి సమర్పణ చేసుకోవాలి. పత్ని-పతికి సమర్పణ చేసుకున్నప్పుడు ఆమెను అర్ధాంగి అని పిలుస్తారు. ఆమె ఇంటికి యజమానురాలు అవుతుంది. పతి యొక్క సంపూర్ణ సంపదకు హక్కుదారు అవుతుంది. ఇదే సమర్పణ యొక్క పరిణామము. నిజానికి భగవంతుడి సంకేతానువర్తులై మెలగవలసిన లోకులు నేడు దీనికి విరుద్ధముగా భగవంతుడు తమ సంకేతానుసారము ప్రవర్తించాలని ఆకాంక్షిస్తున్నారు. ఒక నీటిబిందువు తనను తాను సముద్రమునకు సమర్పణ చేసుకున్నప్పుడు అది సముద్రము అని పిలువబడుతుంది. భక్తునికి-భగవంతునికి మధ్య అటువంటి విచిత్రమైన బంధమే ఏర్పడుతుంది. మురికి నీరు గంగానదిలో కలిస్తే అది కూడా గంగతో సమానముగా

**ఆహారం తేలికగా తీసికొన్న నిద్ర తగ్గుతుంది, శాకాహారం తిన్నచో 4-5 గంటల నిద్ర సరిపోతుంది**

పవిత్రమౌతుంది. నిజమైన సమర్పణతో భక్తుడు-భగవంతునితో సమం అవుతాడు. భగవంతునికంటే అధికుడౌతాడు. భక్తుడు-భగవంతుని కంటే ఎలా అధికుడు అవుతాడు అన్నదానిని పూజ్యగురుదేవులు ఒక గొప్ప మార్మిక ఉదాహరణతో విశద పరిచారు.

ఒకసారి నారదమహర్షులవారు భూలోకమునకు విచ్చేశారు. మార్గమధ్యములో ఒక రైతు గుడిసెలో బసచేశారు. రైతు నారదులవారికి సేవ చేశాడు. ప్రాతఃకాలములో నారద మహర్షులవారు వీడ్కోలు తీసుకుంటునప్పుడు రైతు ఇలా ప్రశ్నించాడు. 'ఎక్కడికి వెళుతున్నారు స్వామి?' 'విష్ణుభగవానుని సన్నిధానమునకు వెళుతున్నాను' అని మహర్షినారదులవారు సమాధానమిచ్చారు. 'మాకు సంతానము లేదు, తమరు మాకొరకు విష్ణుభగవానుని ప్రార్థించండి' అని రైతు నారద మహర్షులవారిని వినయముగా వేడుకున్నాడు. మహర్షి నారదులవారు తిన్నగా విష్ణుభగవానుడి సన్నిధానమునకు చేరి ముమ్మందుగా రైతు ప్రార్థనను విన్నవించి అతనికి సంతానమును అనుగ్రహించమని అర్థించాడు. 'ఆ రైతు భాగ్యములో ఈ జన్మలోనేకాదు, రాబోయే ఏడు జన్మలలో కూడా సంతాన యోగము లేదు' అని అన్నాడు విష్ణువు.

కొన్ని రోజుల తరువాత ఆ రైతు గృహ పరిసర ప్రాంతమునకు ఒక సాధువు ఏతెంచి 'ఎవరైనా ఒక రొట్టెను ఇయ్యండి, వారికి సంతానమును అనుగ్రహించెదను' అని అన్నారు. 'మహాశయా! తమరు మా గృహమునకు వేంచేయండి. ఒకటికాదు, మీకెన్ని రొట్టెలు కావాలంటే అన్ని రొట్టెలు సమర్పిస్తాను' అని అన్నాడు రైతు. సాధువు ఇలా అన్నాడు. 'మేము కేవలము రెండు రొట్టెలను మాత్రమే భుజిస్తాము.' ఆ సాధువు రెండురొట్టెలనే భుజించి ఆ రైతు కుటుంబమును ఆశీర్వదించి వెళ్ళిపోయాడు. కాలాంతరములో ఆ రైతు ఇంట ఇద్దరు పిల్లలు జన్మించారు. 7, 8 సంవత్సరముల తరువాత నారదమహర్షులవారు తిరిగి ఆ రైతు ఉన్న గ్రామములోకి ప్రవేశించినప్పుడు అతని ఇంట ఇద్దరు పిల్లలు ఆటలాడుకుంటూ ఉండటమును చూశారు. వీరు ఎవరి పిల్లలు అని మహర్షి ప్రశ్నించారు. 'మునివరా! వీరిద్దరు మా బిడ్డలే!' అని రైతు చాలా వినమ్రభావనతో సమాధానమిచ్చాడు. 'భగవానుడు విష్ణువు ఆ రైతుకు ఏడు జన్మల వరకు కూడా సంతానయోగ్యము లేదని సెలవిచ్చారు. మరైతే ఇదెలా సంభవము? అనుకొని నారదమహర్షి వెను వెంటనే విష్ణులోకమును చేరుకున్నారు. భగవానుడు విష్ణువుని కలుసుకునేందుకు మహర్షికి ఏవిధమైన అడ్డంకులు లేవు. నారదులవారు నేరుగా విష్ణువు సమక్షమునకు చేరి క్రోధము-క్షోభము నిండిన వాక్కులతో ఇలా ప్రశ్నించాడు. 'భగవంతుడైన విష్ణుదేవా! తమరు నాతో అసత్యము పలికారు. రైతు జాతకములో ఏడు జన్మలవరకు సంతానభాగ్యము లేదని తమరు సెలవిచ్చారు. కానీ తమరు అతనికి ఇద్దరు బిడ్డలనెలా ప్రసాదించారు?' భగవంతుడు మందహాసము చేస్తూ నారద మహర్షిని శాంతింపజేసి 'రేపు ఉదయము దీనికి ప్రత్యుత్తర మిస్తాము' అని అన్నారు.

ప్రాతఃకాలమున మహర్షిని వెంటతీసుకుని విష్ణు భగవానుడు అడవిలో వాహ్యాళికి వెళ్ళాడు. అక్కడ నారదమహర్షి ఒక కుటీరము నుండి ఒక మహాత్ముడు వెలుపలికి రావడం చూశాడు. అతని కుటీరమునకు నలువైపులా అనేకరకములైన ఫలములతో నిండిన పలు వృక్షములున్నవి. అయితే ఆ మహాత్ముడు ఎండుటాకులను భుజించుటను చూసిన మహర్షి నారదుడు ఆశ్చర్యమునకు లోనైనాడు. మహాత్ముడిని సమీపించి ఈ ప్రశ్నను అడిగినప్పుడు ఆ సాధువు ఇలా జవాబిచ్చాడు. 'ఈ పండ్లు నా సోదరులు, ఈ చెట్ల సంతానము.' విష్ణు భగవానుడు ఇలా ప్రశ్నించాడు. 'తమరు కనీసము పచ్చి ఆకులను ఎందుకు భుజించుటలేదు?' 'ఆకుపచ్చనిఆకులు ఆవులు, గేదెలు, మేకలకు వదిలిపెట్టాను. నేను ఈ ఎండు టాకులతో నా క్షుద్బాధను శాంతింపజేసుకొనగలను' అని సాధువు ప్రత్యుత్తరమిచ్చాడు.

ఇదంతా విన్న మహర్షినారదులవారు ఆశ్చర్యమునకు లోనై విష్ణుభగవానుని ముఖమండలమును వీక్షిస్తూ ఉండిపోయారు. కొంత సమయము గడిచిన తరువాత ఆ సాధువు తన కుటీరము నుండి ఒక కత్తిని చేతితో పట్టుకుని బయటకు వచ్చి గాలిలో ఇటూ-అటూ తిప్పుతున్నాడు. విష్ణుభగవానుడు ఈ చర్యకు కారణము ఏమిటని ప్రశ్నించినప్పుడు సాధువిలా జవాబిచ్చాడు. 'నాకు మహర్షినారదులవారు ఎక్కడయినా తారసపడితే ఈ కత్తితో ఆయనను రెండు ముక్కలు చేస్తాను'. 'ఎందుకు నాయనా? అని విష్ణుభగవానుడు ప్రశ్నించిన మీదట ఆ సాధువు 'ఆయన నిరంతరము పుకార్లు పుట్టిస్తూ ఉంటారు' అని బదులిచ్చాడు. ఇది చూసిన నారదుడు తక్షణమే వెళ్ళిపోదామని విష్ణు భగవానునికి సంకేతమిచ్చాడు.

ఈ సాధువు ఆశీర్వాదము వలననే ఆ రైతు ఇంట ఇద్దరు బిడ్డలు జన్మించారు అని మార్గమధ్యములో నారదులవారికి

**ఆలోచనలు పెరిగిన కొలది ప్రశాంతత తగ్గుతుంది - చిత్తం ఊగిసలాటలో పడుతుంది**

విష్ణుభగవానుడు అసలు విషయమును తెలియజేశాడు. 'సాధువు యొక్క రోమ-రోమము ప్రతిక్షణము లోకమంగళకార్యములలో లగ్నమై ఉంటుంది. దానిముందర అతనికి తన అన్నపానాదుల గురించిన చింత కూడా లేదు. ఈ సాధువు నాకంటే శ్రేష్ఠుడని నీకు అనిపించటము లేదా? ఈ సాధువు ఆశీర్వాదము ఫలించాలా? లేక నా సృష్టివిధానమా? నువ్వే చెప్పు. ఇతని ఉపాసన ఉత్తమోత్తమమైనది. తత్ఫలితముగా ఈ సాధువు నాతో సమానమేకాదు, నాకంటే కూడా శ్రేష్ఠుడు, నా పదవికన్నా పైనున్న పదవికి అధికారి' అన్నాడు. కేవలము కీర్తించటమేకాక, లోకమంగళ కార్యములు కూడా చేసేటటువంటి భక్తులకు భగవంతుడు వశమై ఉంటాడు. ఎవరు ఎలా ఆచరిస్తే అటువంటి ఫలాన్నే అనుభవిస్తాడు. భగవంతునికి నిజమైన సమర్పణ చేసుకున్న భక్తుడిని భగవంతుడు మహోన్నతస్థాయిలో నిలబెడతాడు. అతని వాక్కును భగవంతుడు నిజము చేస్తాడు. నిజమైన ఉపాసన చేసే భక్తులను భగవంతుడు కూడా అన్నిరకాలుగాను గౌరవిస్తాడు. భగవంతుడు శబరి గుడిసెకు వెళ్ళి ఆమె ఇచ్చిన అడవిరేగుపండ్లను ఆరగించాడు, సుదాముని చరణోదకమును పానము చేశాడు, విదురుని గృహమున సాధారణ భోజనమును భుజించాడు మరియు బలిమహారాజు ఇంటి భిక్షను యాచించటానికి వెళ్ళాడు.'

గాయత్రీమంత్ర విషయములో కూడా ఇదే జరుగుతుంది. **శ్రద్ధ ఎంత ఉంటే మంత్రము అంతే స్థాయిలో ఫలిస్తుంది.** శ్రద్ధ కారణముగానే మీరాబాయితో పాటు గిరిధరుడు నృత్యము చేశాడు. రాతినుండి భగవానుడు ప్రత్యక్షమైనాడు. ఏకలవ్యుడు ద్రోణాచార్యుని మట్టిప్రతిమను శ్రద్ధాపూర్వకముగా ఉపాసించాడు. ఆ ప్రతిమద్వారా ధనుర్విద్యా పారంగతుడయినాడు. ఈ శ్రద్ధ కారణముగానే శ్రీరామకృష్ణపరమహంస పెట్టిన నైవేద్యమును స్వీకరించటానికి సాక్షాత్తు కాళీమాత వచ్చేది. 'ఈ శ్రీరామకృష్ణ పూజారి స్వయముగా నైవేద్యము భుజిస్తాడు' అని ఒకరు రాణీరాసమణితో ఫిర్యాదు చేసినప్పుడు నిజానిజములు తెలుసుకోవటానికి రాసమణి రహస్యముగా దాక్కుని విషయమును చూడాలనుకుంది. నైవేద్యమును సమర్పించి రామకృష్ణులవారు కాళీమాతను పిలిచినప్పుడు కాళీమాత సాక్షాత్కరించలేదు. అందుకు రామకృష్ణులవారు 'మాతా! ఎందుకు భుజించలేదంటే ఆమె సంతానము తినలేదు కనుక. బిడ్డ తినకుండా మాత ముందుగా ఎందుకు భుజిస్తుంది?' అని ఈవిధముగా మనస్సులో భావించి ఒక ముక్కను తీసికొని భుజించాడు. వెంటనే కాళీమాత ప్రత్యక్షమై నైవేద్యమును స్వీకరించుట ఆరంభించినది.

**శ్రద్ధాభక్తులు లేని కర్మకాండ నిరర్థకము.** పూజ్యవరులు తిరిగి మరో దృష్టాంతమును వినిపించారు. కేవలము జలమునే ఔషధ రూపములో ఇచ్చి ఆది-వ్యాధులన్నింటిని నివారించే ఒక అద్భుతమైన ప్రక్రియ అది.

ఒక శిష్యుడు ఉండేవాడు. తనవద్దకు వచ్చే వారికి కేవలము జలమును మాత్రమే ఔషధముగా ఇచ్చి వారి ఆది వ్యాధులను నివారించేవాడు. శిష్యుని ఖ్యాతి అతని గురువును చేరగానే గురువు స్వయముగా శిష్యుని వద్దకు వెళ్ళి, 'నీకు తెలిసిన ఏ మంత్రముతో అభిమంత్రించిన జలమును ఇచ్చుట చేత రోగములన్నీ నివారించబడుతున్నాయి?' అని ప్రశ్నించాడు. శిష్యుడిలా బదులిచ్చాడు. 'గురుదేవా! నావద్ద అటువంటి మంత్రమేదీ లేదు. ఇదంతా మీ చరణముల అద్భుతము, చమత్కారమే! గురువరా! గురుపూర్ణిమనాడు నేను మీ చరణములను అభిషేకించి తీసికొచ్చిన పాదోదకమునే అందరకు ఔషధముగా ఇస్తున్నాను. అదంతా ఆ చరణామృత చమత్కారమే!' 'నా చరణోదకములో ఇంత చమత్కారమున్నప్పుడు నేనే స్వయముగా జనులందరికి నా పాద ప్రక్షాళిత అభిషేక జలమును ఇస్తాను' అనుకున్నాడు గురువు. గృహమునకు తిరిగివచ్చి 'ఎవరికి ఎలాంటి వ్యాధులున్నా ఔషధమును తీసుకు వెళ్ళండి' అని ప్రచారము చేశాడు. జనులు రావటము ఆరంభించారు. శిష్యుడు ఒక చెంచా నీరు మాత్రమే ఔషధముగా ఇచ్చేవాడు. అతని గురువు ఒకొక్క గ్లాసు నీటిని త్రాగించుట ఆరంభించాడు. ఐతే ఎవ్వరికీ ఏవిధమైన లాభము చేకూరలేదు. గురువు తిరిగి తన శిష్యుని వద్దకు వెళ్ళి దీనికి గల కారణమును ప్రశ్నించగా శిష్యుడు ఇలా సమాధానమిచ్చాడు. 'గురుదేవా! నేనిచ్చే జలములో శ్రద్ధాభావనలు నిండి ఉన్నాయి. మీ వద్ద కేవలము కర్మకాండ మాత్రమే ఉంది. నావద్ద నాది అనేది ఏమీ లేదు. నన్ను నేను ఖాళీచేసుకున్నాను. ఇప్పుడు ఇందులో ఉన్నదంతా తమరిదే.'

పూజ్యవరులు ఈ ప్రసంగమును వినిపించి 'పుత్రా! శ్రద్ధ, సమర్పణలతో చేసినప్పుడే అది ఫలితాన్నిస్తుంది. ఉపాసనతో పాటు సాధనకు కూడా అంతే మహత్త్వమున్నది. భగవంతుడిని ఉపాసిస్తాము. సాధన ద్వారా స్వయముగా మనలను మనము వికసింపచేసుకుంటాము' అని అన్నారు. *(సశేషం)*

*- అనువాదం: శ్రీమతి లక్ష్మీరాజగోపాలు*

**కలయికలోనున్న స్వారస్యం విరహంలో కూడా ఉంది**

అతీంద్రియ విజ్ఞానం-6

# శ్రవణ-దర్శనములకు సంబంధించిన దివ్యశక్తులు - 2

*(సెప్టెంబర్ 2015 సంచిక తరువాయి...)*

ఈ జూలియా అనే మహిళ అమెరికా ప్రెసిడెంట్ టేలర్ యొక్క సతీమణి అయ్యింది. ఆ సమయంలోనే ఆమెకు కొన్ని శక్తులు లభించాయి. తన భర్త వందమైళ్ళ దూరంలో ఉన్నప్పటికీ ఆయనకు సంబంధించిన అన్ని విషయములు ఆమెకు తెలుస్తుండేవి. వారిద్దరి మనస్సులు ఒకరి అనుభూతి మరొకరికి చాలా సహజముగానే తెలిసేవిధముగా జోడించబడి ఉండేవి. క్రీ.శ 1862 జనవరి నెలలో ప్రెసిడెంట్ టేలర్ ఒక ప్రభుత్వ ఉత్సవానికి హాజరవటానికి రిచ్‌మాండ్ అనే ఊరికి వెళ్ళినప్పుడు ఒకనాటి రాత్రి జూలియాకు ఒక కల వచ్చింది. అందులో ప్రెసిడెంట్ ముఖం శవంవలె పాలిపోయి ఉన్నది. ఆయన చేతిలో కమీజు, టై రెండూ ఉన్నాయి. 'నా తల మీద చెయ్యి వేసి నిమురు!' అని ఆయన అంటున్నట్లు వినిపించినది. తెల్లవారుతూనే జూలియా ప్రయాణమై రిచ్‌మండ్‌కు చేరి అక్కడ ప్రెసిడెంట్ సురక్షితముగా ఉండటము చూసి సంతోషించినది. కానీ రెండవరోజు ఉదయం అల్పాహారము సేవిస్తూనే ఆయన ఆరోగ్యము ఉన్నట్టుండి పాడయిపోవటము జరిగింది. ఆమె కలలో చూసినవిధముగా ఆయన ముఖం మృత్యువాతపడిన విధముగా అయిపోయింది. ఆ స్థితిలో ఆమె గదిలోకి వచ్చారాయన. ఆమె కలలో చూసినవిధముగా ఆయన చేతిలో కమీజు, టై ఉన్నాయి. ఆయన ఆమెతో ఏదో చెప్పబోతున్నారు. కానీ స్పష్టముగా వినపడలేదు. కొద్ది గంటలలోనే ఆయన జీవనలీల సమాప్తమైపోయింది.

విజ్ఞానవేత్తలైన విమర్శకులు ఇలాంటి సంఘటనలకు కారణాలేమీ చెప్పలేకపోతున్నారు. ఇప్పటివరకు ఇంకా జరగని సంఘటన యొక్క ప్రభావము ఎవరిమీదనైనా ఎలా పడుతుంది? అని మాత్రము వారు వాదిస్తారు. కానీ ఆధ్యాత్మికవేత్త అయిన వ్యక్తికి **'మానవ జీవితమును నిర్ణయించే ముఖ్యమైన సంఘటనలన్నీ సూక్ష్మజగత్తులో ముందుగానే జరిగిపోతాయి, తరువాతనే అవి స్థూలజగత్తులో ప్రకటీకృతమౌతాయి'** అన్న జ్ఞానము ఉంటుంది. అందుచేత కొంతమంది వ్యక్తులకు దైవవశాత్తు భవిష్యత్తును తెలుసుకొనగలిగిన శక్తి తాత్కాలికముగా లేక కొద్దిక్షణములు మాత్రమే లభిస్తుంది. వారు ఆయా సంఘటనలను సుప్తచేతనావస్థలోనో లేదా స్వప్నములోనో చూడగలరు. ఇంతే కాదు యోగులు, సాధకులు కూడా తమతమ ఆంతరికశక్తితో అంతరిక్షములో ఉన్న భవిష్యత్తు చిహ్నాలను చూసి అర్థము చేసుకొనగలరు. ఇదే భవిష్యత్తు దర్శనమును గురించిన వాస్తవిక రహస్యము!

గొప్ప పండితుడు, రచయిత అయిన మార్టిన్‌ఇవాన్ భవిష్యత్తును ముందుగానే తెలుసుకొనడమును గురించి 'ట్రూ ఎక్స్‌పీరియెన్స్ ఇన్ ప్రొఫెసీ' అనే పుస్తకములో ఇలాంటి వందల సంఘటనలను గురించి వర్ణించారు. వాటిలో సాధారణ వ్యక్తులకు కూడా ఇలాంటి ప్రత్యేకమైన అనుభవములు సాధారణ స్థితిలోనో లేదా స్వప్నములోనో లభించినట్లు వివరించబడినది. ఇద్దరు వ్యక్తుల ప్రాణములు కాపాడబడిన ఒక సంఘటన గురించి హెర్లాండ్‌గ్లూక్ ఈ క్రింది విధముగా వివరించారు.

క్రీ.శ.1950వ సంవత్సరము-నవంబరు నెలలో ఒక శనివారము నాడు మా ఇంట్లో ఏదో ఒక వేడుక జరుగుతున్నది. ఆ ముందురోజు అంటే శుక్రవారంనాడు నా భార్య 'ఈరోజు మీరు బయటకు వెళ్ళవద్దు. ఇంట్లో చాలా పని ఉన్నది. మీరు కూడా సహాయం చెయ్యాల్సి ఉంటుంది' అని చెప్పింది. కానీ ఆరోజు నా లోపల ఏదో ఒక ప్రబలమైన ప్రేరణ ద్వారా 'ఏమైనా సరే ఈరోజు నేను సముద్రము మీద షికారుకు వెళ్ళవల్సిందే' అని అనిపించసాగింది. నేను నా శ్రీమతి చెప్పిన మాటలను ఎప్పుడూ వ్యతిరేకించలేదు కానీ ఆరోజు ఏదో ఒక అజ్ఞాత శక్తి నన్ను ఎందుకు ప్రేరేపిస్తున్నదో నాకు అర్థము కాలేదు. అందుచేత తెలిసి తెలిసీ నా మిత్రుడైన జాక్‌ను కారు తీసుకుని నాతోపాటు రావటానికి ఒప్పించాను. ఆరోజు సముద్రములో తుఫాను వచ్చే సూచనలున్నట్లు వాతావరణశాఖ తెలియజేసింది. కాబట్టి సముద్రము మీదకు వెళ్ళవద్దంటూ నా శ్రీమతి గట్టిగా చెప్పింది. కానీ నా మనస్సులోకి ఒక్క

**సిద్ధి కొరకు ఆతురత చెందుట బుద్ధిమంతుల లక్షణం కాదు**

మాట చేరటంలేదు. నాకు వెళ్ళాలని లేదు, కానీ లోపలనుండి ఏదో ఒక ప్రేరణ సముద్రము మీదకు నువ్వు వెళ్ళవలసిందే' అని వినిపిస్తున్నది.

చెప్పిన సమయమునకు కారు తీసుకుని నా స్నేహితుడైన జాక్ వచ్చాడు. జాక్‌తో సహా నేను సముద్రము వైపు బయలు దేరాను. మేము అక్కడికి చేరకముందే సముద్రము భీకరముగా గర్జిస్తూ ముందుకు వస్తున్నది. ఒడ్డునున్న పడవవాళ్ళు వెనుకకు వచ్చేస్తున్నారు. నేను 'అరేబాబూ! సముద్రములో షికారుకు వెళ్ళాలి. ఒక పడవ ఇవ్వండి' అని అడిగాను.

సముద్రము ఎలా అల్లకల్లోలముగా ఉందో కనిపించడము లేదా తమరికి. పడవతోపాటు మీరూ మునిగిపోతారు' అని పడవ వారు గట్టిగా అరచి చెప్పారు. జాక్‌కూడా అదే మాట అంటున్నాడు కానీ నా లోలోపల నుండి ఏదో ఒక అజ్ఞాతశక్తి సముద్రములోకి వెళ్ళమనే ప్రేరేపిస్తున్నది. 'ఒక పడవ వెల మొత్తము ఇస్తున్నాను. తీసుకొని ఒక పడవ నాకు ఇచ్చేయండి' అని పడవవాళ్ళకి డబ్బులిచ్చి పడవను తీసుకున్నాను. నా పట్టుదల ముందు పడవవాళ్ళు ఏమీ అనలేకపోయారు. నేను, జాక్ పడవ ఎక్కి సముద్రములోకి వెళ్ళామో లేదో అలల ఇరుక్కుపోయాము. నాకు 200 గజాల దూరములో ఫుట్‌బాల్ వంటి వస్తువేదో కనపడుతుంటే జాక్‌కి దానిని చూపించాను. 'ఈరోజు మీకు ఏమైంది? ఒక మామూలు ఫుట్‌బాల్ కోసము ప్రాణాలమీదకు తెచ్చుకుంటారా?' అని జాక్ నన్ను మందలించాడు.

అతని మాటలు నన్ను ఏమాత్రము ప్రభావితము చెయ్య లేకపోయాయి. పడవను ముందుకు పోనిచ్చాను. దగ్గరకు వెళ్ళి చూస్తే ఇద్దరు నావికులు తుఫానులో చిక్కుకుపోయి సముద్రములోకి మునిగిపోబోతూ ఉన్నారు. ఏదోవిధముగా వాళ్ళిద్దరినీ మా పడవలోపలికి ఎక్కించి క్రిందా మీదా అవుతూ ఎలాగో ఒడ్డుకు చేరుకున్నాము.

నా ఈ సహృదయత, సాహసమును విన్నవారందరు నన్ను పొగడ్తలతో ముంచెత్తారు. నా శ్రీమతి నన్ను ప్రేమతో హత్తుకుంది. 'నన్ను ఇంతగా ప్రేరేపించి అక్కడకు తీసుకువెళ్ళిన ఆ శక్తి ఏమిటి?' అని అప్పటినుండి ఆలోచిస్తూనే ఉన్నాను' అని తన సంకల్పముతో ఈ' విశ్వములో దేనినైనా నిర్మించ గలిగిన, నియంత్రించగలిగిన శక్తి ఏదైనా ఉన్నదా? మానవుడు దానిని స్పష్టమైన రీతిలో అనుభూతి చెందగలడా?' అని కూడా యోచిస్తున్నాను.

– పూజ్యగురుదేవుల వాఙ్మయం *17 (11.12)* నుండి
*అనువాదం: శ్రీమతి కృష్ణకుమారి*

## పరిసరాలే పాఠాలు నేర్పుతాయి

*అంతిమ ఘడియలు సమీపించిన తల్లి తన కొడుకుని పిలిచి వాత్సల్యం నిండిన గొంతుతో "నాయనా, నిన్ను చదివించలేక పోయాననే దుఃఖం నన్ను కలచివేస్తున్నది. ఇక ఇప్పుడు అందుకు సమయం కూడా లేదు. ఈ ప్రపంచమే నీకు పాఠశాల. ఎక్కడ ఏది లభించితే దానిని నేర్చుకో. అదే నీకు ఉపయోగపడుతుంది" – అని చెప్తూ, తుది శ్వాస విడిచింది.*

*తల్లి చెప్పిన మాటను కొడుకు హృదయంలో పదిలం చేసుకున్నాడు. తాతగారు చేసే రాళ్ళు కొట్టే పనినే తాను చెయ్యసాగాడు. ఇందులో తగినంత జ్ఞానం సంపాదించాక, అతడు గజ ఈతగాడి పని చెయ్యడం మొదలుపెట్టాడు. సముద్రంలో ఉండే పెద్ద పెద్ద మైదానాల్లాంటి రాళ్ళ యొక్క ఉనికి, స్థితిగతులను గురించి క్షుణ్ణమైన జ్ఞానాన్ని సంపాదించాడు. ఆ తరువాత రాళ్ళను చెక్కి బొమ్మలుగా తీర్చిదిద్దే వ్యక్తి వద్ద పనికి కుదిరాడు. రాళ్ళ యొక్క గుణగణాలను గురించి బాగా తెలుసుకున్నాడు. నెమ్మదినెమ్మదిగా ఎరుపురంగు రాళ్ళ విషయంలో అతడు అత్యున్నత స్థాయి జ్ఞానాన్ని ఆర్జించాడు. అప్పుడు తన అనుభవాలన్నింటినీ లిపిబద్ధం చేయసాగాడు. అనుభవాలు నేర్పిన జ్ఞానంతో అతడు బాగా చదువుకున్న వ్యక్తుల మధ్యకు వెళ్ళి మాట్లాడుతుంటే వారు ఆశ్చర్యపోయారు. ఇప్పుడు అతని ఖ్యాతి ఇంగ్లాండు దేశంలో మాత్రమే కాక, యావత్ ప్రపంచంలోను వ్యాపించసాగింది. ఆ బాలకుడు ఎవరో కాదు. తల్లి చెప్పిన మాట ప్రకారం జ్ఞానాన్ని ఆర్జించి ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన భూగర్భ శాస్త్రవేత్త "హ్యూమిల్ట్"*

*– అనువాదం: శ్రీమతి కృష్ణకుమారి*

**లోభం, భయం, నిరాశ, ఆవేశాలు నుండి ధైర్యము మాత్రమే మనల రక్షించగలదు**

# వాక్‌శక్తిని ఉపయోగించుకుని శ్రేయస్సు పొందండి

**'ఏకోఽహం బహుశ్యామా'** అనగా **'నేను ఒక్కటి నుంచి అనేకమౌదుముగాక!'** అని భగవంతుడు సంకల్పించాడు, తత్కారణముగా ఈ చరాచరవిశ్వము ఆవిర్భవించినది అని వేదములలో వర్ణించబడినది. వివరముగా చెప్పాలంటే సృష్ట్యాదిలో బ్రహ్మ దేవుడు **'నేను అనేకమౌదుముగాక' అని వాచా-సంకల్పించాడని, ఆ వాక్-సంకల్పము నుండి ఈ అఖిల విశ్వము పుట్టినదని** వేదములు ఘోషిస్తున్నాయి. ఈ మాటలకు అర్థమేమిటంటే 'ఈ సమస్త విశ్వము శబ్దము నుండే పుట్టినది. ఇప్పుడు జరుగుతున్నదేదైతే ఉన్నదో దానికి కూడా కారణము శబ్దమే!' ఏ పనినైనా తీస్కోండి. దానికి కారణము శబ్దమే! మాటల కారణముగానే ప్రపంచములో మహాయుద్ధములెన్నో చెలరేగాయి. అలాగే సంధి ఒడంబడికలకు కూడా మంచి మాటలే కారణముగా నిలిచాయి. ప్రేమ మరియు వైరమునకు కారణము మాటలే. వాంఛించకుండా ఏదీ జరుగదు. ఆ ఇచ్ఛ స్వయముగా శబ్దముల ద్వారానే ప్రకటితమౌతుంది. 'ఇచ్ఛ'కు ప్రత్యక్షరూపము శబ్దము! 'శబ్దము' ఇచ్ఛను వ్యక్తీకరించి తన తరంగాల కదలికలతో విశ్వమంతటినీ కుదిపివేసి సంకల్పము నెరవేరునట్లు చేస్తుంది. ఒక వ్యక్తికి దప్పికవేసి నీటిని త్రాగాలనే కోరిక కలిగింది అని అనుకుందాము. ఆ కోరిక 'మంచినీళ్ళు కావాలి' అన్న మాటగా నోటినుండి వెలువడినది. నోటినుండి మాట బయటకు వచ్చిన మరుక్షణము నౌకరు నీటిని తీసుకొచ్చి యజమానికి అందించాడు. ముందుగా నీరు కావాలి అన్న మాట నోటినుండి వచ్చింది. అలా రాగానే భౌతికముగా నీరు చేతికి ఇవ్వబడింది.

ఇచ్ఛ స్వయముగా అర్థస్వరూపము అన్నది ముమ్మాటికీ సత్యము! మీరు ఆకాంక్షించినదేదైనాసరే మీకు దక్కితీరుతుంది అనుటలో ఎట్టి సందేహము లేదు. మీరు దేనినైతే కోరుకుంటు న్నారో ఆ కోరికయే స్వయముగా ఆ వస్తువు! ఇచ్ఛ అన్నది సాఫల్యమునకు మెట్టు వంటిది. ఆ మెట్టు ఎక్కిన తరువాత ఖచ్చితముగా సఫలత స్వయముగా చేతికందుతుంది. కోరుకున్న వస్తువును పొందుటలో ఇసుమంతైనా ఆలస్యమవ్వజాలదు. అనేకసార్లు లభించకపోవటానికి కారణము ఏమిటంటే - ఫలానా వస్తువు కావాలన్న ఏ ఆకాంక్షా తరంగములు మన మనస్సులో తలెత్తుతాయో వాటిని మనమే స్వయముగా విశ్వసించము. మనలోనే రవ్వంతైనా నమ్మకము ఉండదు. మనమే శంకిస్తాము. ఒకప్రక్క 'మేము ఆకాంక్షిస్తున్నాము' అని చెప్తూ; మరోప్రక్క 'ఆ కోరుకున్నది దక్కుట ఎంతో కష్ట సాధ్యము, అదంత సులభము కాదు' అని అంటుంటాము. అపనమ్మకముతో నిండిన మన మాటలే ఇచ్ఛ అనే శబ్ద తరంగములను చంపివేస్తాయి. లేకుంటే మానవుడి మాటలలో బ్రహ్మదేవుని వాక్కుకున్నంత శక్తి దాగి ఉన్నది. కనుక మనో వాంఛితము తప్పక జరిగి తీరుతుంది.

మన గుండె లోతుల్లోంచి దృఢముగా ఎగసిన శబ్దములు, విశ్వసనీయతతో పలికిన పలుకులలో సృష్టికర్తకున్నంత శక్తి ఉంటుంది. 'మేము ఆరోగ్యవంతులము' అని గట్టి నమ్మకముతో పలకండి! మీరు రోగముక్తులవుతారు. 'మేము అమరులము' అని మనసా అనండి. అప్పుడు మృత్యువు మీ వశములోకి వస్తుంది. 'ఆ వస్తువు మాకు ఖచ్చితముగా దక్కుతుంది. అది లభించుటలో ఏమాత్రమూ ఆలస్యమవ్వదు' అని గట్టి నమ్మకముతో పలకండి. ఏవో కొన్ని కారణముల చేత కాస్త ఆలస్యమైన ప్పటికినీ ఆ వస్తువు ముమ్మాటికీ మీ చేజిక్కుతుంది. మీ నుదుటి వ్రాతను, మీ కర్మను, మీ ప్రపంచమును, మీ కుటుంబమును, మీ పరిస్థితులను, మీ ప్రాపంచికజగత్తుకు ఆవశ్యకమైన సామానంతటినీ మీరు పలికే మాటల ద్వారా, మీ ఆజ్ఞల ద్వారా ఆకర్షించి పొందవచ్చును లేదా సృష్టించు కోవచ్చును. మీకు మీ మాటలకున్న శక్తి అర్థమైన మరుక్షణం మీరు ఆ భగవంతుడు ప్రసాదించిన వాక్ శక్తిని నిర్లక్ష్యము చెయ్యరు.

మీలోపల భగవంతుడు విరాజిల్లుతున్నాడు. ఇంకా చెప్పాలంటే స్వయముగా మీరే భగవత్స్వరూపులు! మీ ఆజ్ఞ- ఈశ్వరుని ఆజ్ఞ! మీ మాట - దైవవాక్కు! దృఢవిశ్వాసముతో మీరు ఏది ఆజ్ఞాపిస్తే అది తప్పక పూర్తవుతుంది. మాట్లాడిన

**భౌతిక సదుపాయాలు సర్వస్వం అనుకునేవారికి గాయత్రీ ఉపాసన సిద్ధించదు**

మాటల వలన ఈ విశ్వములోని పరమాణువులలో అలజడి సృష్టించబడుతుంది. తత్కారణముగా ఉత్పన్నమైన అలలు రూపుగట్టి చిట్టచివరకు సాకారమై(స-ఆకారమై) నిలిచేంత వరకు ఆ అలజడి శాంతించదు. అయితే మనలోని అవిశ్వాసమే దీనికి పెద్ద అడ్డంకిగా నిలుస్తుంది. మన వాక్-సంకల్పమును నెరవేరకుండా చేస్తుంది. మనము పలికిన పలుకుల వలన ఉత్పన్నమైన తరంగాలు విరాట్స్వరూపుడైన ఆ భగవంతుని యొక్క ఆత్మను కంపింపజేస్తాయి(కదిలిస్తాయి). మాట్లాడిన మాటలు ఎన్నడూ నిరర్థకమవ్వవు. భారతావనికి ఉత్తరమున ఋషుల స్థావరములుగా విరాజిల్లే హిమవత్పర్వతముల శోభ వర్ణనాతీతము! హిమాలయపర్వతారోహకులకు అక్కడ కనుచూపుమేర మంచుకొండలు, విశాలమైన మేఘ మాలికలు దర్శనమిస్తుంటాయి. ఆ మంచుశిఖరముల మీద నిలిచి ఒక్క మాటను గట్టిగా మాట్లాడినా చాలు పర్వతారోహకులకు పెద్ద ఆపద ఎదురౌతుంది. మాట్లాడినప్పుడు ఒక్కొక్క ఫర్లాంగ్ దూరములోని మంచుచరియలు పైనుండి క్రిందకు జారిపడతాయి. అప్పుడు అటుగుండా సాగుతున్న వారిపై ఆ పెద్ద పెద్ద మంచుముక్కలు దొర్లిపడి వారు మృత్యువాత పడతారు. ఆ పర్వతాగ్రముల మీద మాట్లాడినచో శిఖరాలను తాకుతూ పయనించే మేలిమబ్బులు అలజడికి లోనై తక్షణమే వర్షిస్తాయి. మాట్లాడినప్పుడు వినీలాకాశములో తరంగాలు పుడతాయి. తత్కారణముగానే పైన చెప్పినట్లుగా జరుగుతుంది. వాంఛించిన పదార్థమును నిర్మించగలిగే శక్తి స్వయముగా ఆ శబ్దాణువులలోనే నిహితమై ఉంటుంది. మనం ఏ వస్తువునైతే కాంక్షిస్తున్నామో, కావాలని కల్పన చేస్తున్నామో స్వయముగా ఆ ఇచ్ఛయే ఆ వస్తు-స్వరూపము! మనోవాంఛ మరియు వస్తువు మన ఊహాజగత్తుకు ఆవల లేదు. కల్పనా మాత్రము చేత స్వప్నములో ఈ సమస్త ప్రపంచం రచించబడుతుంది. కలలో సాధారణముగా కంకరు, రాళ్ళు వెయ్యకుండానే రహదారి నిర్మించబడుతుంది. అలాగే వేలాది ఇళ్ళు సంకల్ప మాత్రముగా సృష్టించబడతాయి. అంతేకాదు స్వప్నములో మొక్కలు నాటకుండానే చెట్లతోపు ప్రత్యక్షమవుతుంది. మనస్సు స్వయముగా వస్తుస్వరూపమైనట్టిది. ప్రాపంచిక రూపు కలిగి ఉన్నట్టిది. అది ఈ విశ్వములోని సమస్త వస్తువులను మాటల తోటే రచిస్తుంది. సమాధిస్థితిలో ఇచ్ఛ యొక్క అద్భుతమైన చమత్కారము రెప్పపాటులో కంటికి కనిపిస్తుంది. యోగి యొక్క ఇచ్ఛ లేకుండా ఏదీ రచించబడదు లేక సృష్టించబడదు. సమాధిస్థితిలో యోగి ఏ వస్తువు కావాలని సంకల్పిస్తాడో ఆ వస్తువు తక్షణమే రూపుగట్టి అతని కట్టెదుట సాక్షాత్కరిస్తుంది.

స్థూలప్రపంచము కూడా స్వాప్నికజగత్తు వలె మనోమయమైనది, కల్పనామయమైనది. స్వప్నలోకములోని సృష్టికి-జాగృదవస్థలోనున్న సృష్టికి రవ్వంత భేదము తప్పకుండా ఉన్నది. అయితే రెండింటిలోను మనస్సు-కల్పనల యొక్క ప్రభావం ఉంటుంది. ఉదాః ప్లేగువ్యాధి వచ్చిందని కల్పన చేసినచో ఆ వ్యాధి వచ్చిందన్న భావన చేత భయము ఆవరించి జ్వరం వస్తుంది. ప్లేగుబొబ్బలు కూడా కనిపిస్తాయి. ఒకవేళ కల్పనా మాత్రం చేత జ్వరం వస్తే; మరి అదే కల్పనాబలం చేత జ్వరం తగ్గిపోదా? మన ఆలోచనలు, మన భయము కారణముగా మనకు ప్లేగుబొబ్బలు పుట్టుకొచ్చినప్పుడు; మరి మన నిర్భయత్వము, మన ఆలోచనాధోరణి వల్ల అవే ప్లేగు బొబ్బలు మటుమాయమై మనకు మేలు జరుగకుండా ఉండగలదా? మన ఇచ్ఛకు, కల్పనకు లేక మన మాటకు దేనినైనాసరే సృష్టించగలిగే శక్తి ఉన్నది, నాశనము చేయగలిగే శక్తి. రెండూ ఉన్నాయి.

'యథా మనసా మనుతే తథా వాచా వదిత్' - మనస్సులో ఏది సంకల్పించబడుతుందో అదే మాటల ద్వారా వ్యక్తీకరించబడుతుంది. మానవుడు ఎక్కువసేపు ఏదో ఒకటి మననం చేస్తూనే ఉంటాడు. దాని అర్థమేమిటంటే మనిషి లోలోపల తన మనస్సుతో తానే మాట్లాడుతూ ఉంటాడు. ఏదో ఒకటి ముచ్చటిస్తూ ఉంటాడు. ఈ అవ్యక్త శబ్దముల ప్రభావము శరీరము మీద పడుతుంది అన్నది కనిపెట్టారు మేధో సంపన్నులైన మన పూర్వీకులు. మనిషి తనలో తాను మాట్లాడు కుంటున్నప్పుడు అతని మోహములో ఎన్నెన్నో హావభావములు తారట్లాడుతుంటాయి. మోహం రంగులు మారుతూ ఉంటుంది. వీటన్నింటినీ గమనించి, ఆకళింపుజేసుకుని యోగిజనులు, వైజ్ఞానికులు మోహంలోని భావాలను బట్టి ఆ వ్యక్తి తన మనస్సులో ఏ ప్రత్యేకమైన విషయమును గురించి ఆలోచిస్తున్నాడు అన్నది సులభముగా చెప్పివేస్తారు (ఫేస్ రీడింగ్). మనో భావములను అనుసరించి ముఖాకృతి మారుతుంది. మోహంలో ఎన్నెన్నో రంగులు మారుతూ ఉంటాయి. మనిషి

**కోరికలు తీర్చుకొనుటకై మాత్రమే పూజ ఉపాసన చేసేవారు తమ ప్రారబ్ధానికి దాసులు**

ఆలోచనలలో కూరుకుపోయినప్పుడు ఒక్కొక్కప్పుడు అతని మొహం పాలిపోతుంది. కొన్నిసార్లు ప్రసన్నతతో నిండి ఉంటుంది. ఇంకొన్నిసార్లు భృకుటి ముడిపడి ఉంటుంది. మరోసారి నుదురు ముడతలు పడుతుంది. ఒక్కొక్కసారైతే చెంపలు కెంపులౌతాయి. ఇట్టి భావాలే కాదు మనిషి ఆలోచనలలో మునిగిపోయినప్పుడు అతని ముఖమండలము మీద ఎన్నెన్నో భావములు తారట్లాడతాయి. అది ఇంకెన్నో మార్పులకు లోనవుతుంది. ముఖంలో ప్రస్ఫుటించబడే ఈ భావాలను వీక్షించినచో ఆ వ్యక్తి మనస్సు పొరలలోని భావాలను లేదా అతను మనస్సులో ఏమి ఆలోచనలు చేస్తున్నాడు అన్నది ఆకళింపుజేసుకొనుట ఏమంత కష్టము కాదు.

పైన చెప్పబడిన విషయములను గమనించినచో మనం మాట్లాడిన ప్రతి మాట, చేసిన ప్రతి ఆలోచనా మన శరీరము మీద అద్భుతమైన ప్రభావమును చూపిస్తుంది అన్న విషయము తేటతెల్లమౌతుంది. అందుచేత మీకు మీ శరీరములోని ఏ భాగము లేక అంగము ఏవిధంగా రూపుదాల్చాలి అన్నది మీరు ఆ ప్రత్యేక భాగమునకు ఆజ్ఞాపిస్తూ ఆ రీతిలో పునర్-నిర్మించుకోవచ్చు. మీరు ప్రతిరోజు నిద్రలేచిన వెంటనే 'నా శరీరము లోని ఈ ప్రత్యేకమైన భాగము ఆరోగ్యప్రదముగా ఉండుగాక!' అని మీ శరీరమును ఆజ్ఞాపించండి. ఈ ఆజ్ఞ మరియు మీ మాటలు, మీ నోటినుండి వెలువడిన శబ్దతరంగాల ప్రభావము కొద్దిరోజులలోనే ప్రత్యక్షముగా కనిపిస్తుంది. మీరు ఏ అంగమును ఉద్దేశించి ఏ ఆదేశము ఇస్తారో అది తప్పక పూర్తవుతుంది. మానవుడి మాటలకు సృష్టించే శక్తి ఉన్నది. అంతేకాదు విధాత వలె వాక్పటిమను కలిగియుండే పూర్తి సత్తా ఉన్నది.

ఒక పేదవాడు ఉన్నాడు అనుకుందాము. అతను కనుక నిద్ర మేల్కొనిన వెంటనే 'మా దారిద్ర్యము తొలగిపోగాక! మేము ధనవంతులమగుదుముగాక!' అని పైకి ఉచ్చరించాలి. దానితోపాటే 'మేము సంపన్నులమైపోయాము. మాకు నలువైపులా డబ్బులు, వెండి, బంగారము పడి ఉన్నాయి. ఇనప్పెట్టెలన్నీ నోట్లకట్టలతో నిండిపోయాయి' అని సుస్పష్టముగా కల్పన చెయ్యాలి. ఇలా చేసినచో తప్పకుండా లేమి దూరమవుతుంది. ఎవరైనా ఒక మనిషి యొక్క బుద్ధి సక్రమముగా లేనిచో అతని పొట్టమీద చేతినుంచి చుట్టూరా నిమురుతూ ప్రతిరోజు పొట్టకు 'పొట్ట! బాగుపడు!' అనే ఆజ్ఞను ఇవ్వాలి. ఇలా చేసినచో తప్పకుండా ఫలితము కనిపిస్తుంది. మీ జీవితములో మీకు ఏదైనా వస్తులేమి ఉన్నచో 'నాకు ఆ ఫలానా వస్తువు కావాలి. నేను దానిని తప్పకుండా పొంది తీరుతాను' అని గట్టి సంకల్పముతో పైకి ఉచ్చరించాలి. సంకల్పపూరితముగా మీరన్న ఆ మాటలు మీ తలరాతకు సవాలు విసురుతూ మీరు ఆకాంక్షించిన వస్తువును మీ ఎదుట నిలుపుతాయి.

మీ శరీర నిర్మాత స్వయముగా మీరే! మరెవ్వరో కాదు! మీ భాగ్యనిర్మాతలు మీరే! వేరెవ్వరో కాదు! స్వయముగా మీరే మీ భాగ్యమునకు నిర్మాతలు! ఆ విధాత వాక్కుకు ఉన్న శక్తి మీ వాక్కుకు కూడా ఉన్నది. సంపూర్ణవిశ్వాసముతో అన్న మాటలు తప్పకుండా ఫలిస్తాయి. కనుక వాక్ శక్తిని చక్కగా ఉపయోగించుకుని శ్రేయస్సును పొందండి!

– *పూజ్యగురుదేవుల వాఙ్మయం 19 (1.23) నుండి*

*అనువాదం: శ్రీమతి లక్ష్మీరాజగోపాలు*

## ప్రపంచ అరాచకత్వానికి మూలకారణం

*సుప్రసిద్ధ దార్శనికుడైన "జాన్‌జె" ను అతని మిత్రుడు ఈ రీతిగా ప్రశ్నించాడు. "మిత్రమా! ప్రపంచంలో అరాచకత్వం ఇంతలా ప్రబలిపోయింది. నిజంగా ఈ ప్రపంచాన్ని భగవంతుడే సృష్టిచేసి ఉంటే, ఈ ప్రపంచంలోని చెడు వ్యవస్థను ఎందుకు చక్కదిద్దుటలేదు?"*

*జాన్‌జె బదులిస్తూ ఇలా అన్నాడు. "మిత్రమా! మన పనిని, నిజాయితీతో పూర్తిచేయుట మన కర్తవ్యం! అట్లే భగవంతుని పని ప్రపంచవ్యవస్థను పాలించుట కావున మనం మన పని చేస్తూ ఉండాలి. మరియు భగవంతుని పనిని భగవంతునికి వదలివేయాలి!" ప్రతి వ్యక్తి నిజాయితీగా తనకు అప్పగించిన బాధ్యతలను సరియైన దీక్షాదక్షతలతో పూర్తిగావించినచో, ప్రపంచంలో సువ్యవస్థ దానంతటదే స్వతహాగా ఏర్పడుతుంది. "ప్రపంచంలోని అవ్యవస్థకు మూలకారణం, ప్రజలలో నిజాయితీ లేకుండుట మరియు బాధ్యతల పట్ల నిర్లక్ష్యము వహించుట.*

– *అఖండజ్యోతి, మే 2015*

*అనువాదం: ఎ. శారద*

**సౌందర్యాన్ని, స్వార్థాన్ని బేరీజు వేసుకుంటే సత్యం తెలుస్తుంది**

జీవించేకళ

# ఆర్ట్ ఆఫ్ లివింగ్

'ఆర్ట్ ఆఫ్ లివింగ్ లేదా జీవించేకళ' అనండి– ఈ అంశము ప్రస్తుతకాలములో బహుళ ప్రచారములో ఉన్న విషయము! దీనిని నిర్వచించటానికి ప్రపంచమంతటా ప్రతినిత్యము, ఎంతో మంది పుంఖానుపుంఖాలుగా వ్యాఖ్యానాలను రచిస్తున్నారు. విశ్వవ్యాప్తంగా రచయితలు దీనిగురించి నెలానెలా పెద్ద సంఖ్యలో పుస్తకాలను వ్రాస్తుంటే ప్రచురణకర్తలు వాటిని ముద్రిస్తున్నారు. సామాన్యప్రజలలో కూడా ఈ విషయమును వినటానికి, చదవటానికి కుతూహలము పెరిగింది. ఇవన్నీ జీవితము పట్ల మానవునికి పెరుగుతున్న 'జిజ్ఞాస, అవగాహన'లకు శుభ సంకేతాలు. ఆర్ట్ ఆఫ్ లివింగ్ అనే అంశమును గురించి ఇప్పటివరకూ జరిపిన సత్ప్రయాసల ఫలితంగా నిర్ణయించ బడినదేమిటంటే 'జీవితమును సంస్కారహీనంగాను, వ్యర్థం గానూ గడపకుండా, కళాత్మకమైన రీతిలో జీవించడము చాలా అవసరము' అని.

ఈ అఖిల విశ్వబ్రహ్మాండమునంతటినీ సృజించే సాటిలేని మేటికళాకారుడైన భగవంతుని యొక్క సర్వశ్రేష్ఠమైన సృష్టి మానవుడు. స్వయంగా ఆ మానవజీవితమే ఈ తత్త్వదర్శనము నకు ఆధారభూతమైన సత్యము. పరమేశ్వరుడు తన కళలోని ప్రతి ఒక్క సూక్ష్మతనూ, సౌందర్యమునంతటినీ కలబోసి ఈ మానవ దేహమును సృజించాడు. అందుచేతనే ప్రపంచము లోని విద్వాంసులందరు ముక్తకంఠంతో 'సర్వ శ్రేష్ఠమైనది, సుందరమైనది, ప్రత్యేకమైన అవకాశములతో కూడుకున్నదీ అయిన సంపూర్ణమైన సృష్టి మానవజీవితము తప్ప మరొకటేదీ లేదు' అన్న వ్యాసభగవానుని వాక్కులను ప్రపంచములోని వివిధదేశాలు వివిధ భాషలలో గానం చేస్తున్నాయి. ఇంతేకాదు ప్రపంచములోని ప్రతి మారుమూలలో కూడా జీవితము యొక్క ఔన్నత్యం, సౌందర్యం, అపూర్వమైన అవకాశాలను వ్యక్తము చేయటానికి పరిశోధనలు జరుపబడుతున్నవి.

ధర్మము, సంస్కృతి ఈ పరిశోధనల, అన్వేషణల యొక్క సారాంశమే! జీవితాన్ని కళాత్మకంగా జీవించవలసిన ప్రయత్నా లకు ఇవి సాక్షీభూతాలు! హిమాలయ గుహాంతర్భాగాల నుండి నినదించే వేదమంత్రములు, ఖురానులోని పదభాగాలు, బైబిలు వాక్యాలు... ఇవన్నీ కూడా 'జీవితము యొక్క ఔన్నత్యము, సుందరమైన తత్త్వములతో పాటు అపురూపమైన అవకాశముల గురించి కూడా మానవులకు వెల్లడిచేస్తున్నవి.' ప్రతి ఒక్క మతం, దానికి చెందిన సంస్కృతి యొక్క లక్ష్యమేమిటంటే, పరిస్థితులకు అనుగుణంగా జీవితమును జీవించే శిక్షణను ఇవ్వడము. ప్రతి ఒక్క మతప్రవక్త, దాని సంస్కృతిని మెరుగు పరచిన మహాపురుషులు తమ జీవితాలను ఈ మహత్వ పూర్ణమైన లక్ష్యమును నెరవేర్చటము కోసము సమర్పించారు. కళాత్మకంగా జీవించే విధానమును నేర్పటానికి ప్రతి మతము లోను ఆయా పరిస్థితులు, వాతావరణములకు అనుగుణంగా పలురకాలైన ప్రయోగాలను, సాంకేతిక విధానాలను వృద్ధి చేయటము జరిగింది. కానీ కాలక్రమేణా ఈ పద్ధతి రూపు మాసిపోయింది. శాస్త్రీయమైన దృక్పథము లేకపోవడముచేత ధర్మము అనే శబ్దము కేవలము సంప్రదాయములను, ఆచారాలను పోషించేదిగా మాత్రమే మిగిలిపోయింది. ఇదే విధంగా 'సంస్కృతి' అనేది మంచి సంస్కారములను సంపూర్ణమైన రీతిలో మెరుగుపరచి అమలుచేయటానికి బదులుగా ఏవో కొన్ని లలితకళలకు మాత్రమే పరిమితమైపోయింది.

ఇలాంటి పరిస్థితులలో ప్రాచీనవిధానమైన క్రొత్తతనమును అన్వేషించడము ఈనాటి అవసరంగా మనముందు నిలిచింది. ఆర్ట్ ఆఫ్ లివింగ్ అనేది ఈ అవసరమును పూర్తిచేయగలదు. దీనిని 'ధర్మముయొక్క సనాతన తత్త్వమునకు క్రొత్త జన్మ' అని కూడ చెప్పవచ్చు. విశ్వవ్యాప్తంగా దీనికి అనేక విధాలైన నిర్వచనములు ఉన్నాయి. ఎఫ్.బీ.బేకార్ 'జీవితంలో లభించే పలురకాలైన అవకాశములను ఇది జాగృతము చేయగలదు' అని అన్నాడు. 'ఇది మానసిక పరిస్థితిమీద విజయమును సాధించగలదు' అని ఎమ్ ఆర్ బారోని ప్రతిపాదించారు. సాఫల్యమునకు రాజమార్గముగా దీనిని సీ. మారకుస్‌కూపర్ నిర్వచించాడు. ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన 'ద సెవెన్ హైబిట్యూస్ ఆఫ్ హైలీ ఎఫెక్టివ్ పీపుల్' అనే గ్రంథ రచయిత స్టీఫెన్ ఆర్. కోవీ 'జీవితమును మార్చివేయగల శక్తివంతమైన విద్య'గా దీనిని నిరూపించాడు. ఇలా వైవిధ్యభరితమైన పలురకాల

**ఆత్మ వికాసం తీవ్రతను బట్టి ప్రతికూలత-అనుకూలతగా పరివర్తన చెందుతుంది**

ప్రతిపాదనలెన్నో ఉన్నప్పటికీ వానిలో దాగి ఉన్న సత్యము ఒక్కటే! అదే జీవితము యొక్క ఔన్నత్యము, సౌందర్యం, జీవన గమనములో మనకు లభించగలిగే ఉన్నతస్థాయి అవకాశము లను ప్రకటీకృతము చేయగలగటము! వేదమంత్రాలు, ఉపనిషత్తులలోని శృతులు, షడ్దర్శనాలకు చెందిన అనేక సూత్రాలు, పైన చెప్పబడిన మూడు అంశాలను పొంద గలగటానికి పలు ఉపాయాలను సూచిస్తున్నవి. ఆ ఉపాయాల న్నింటినీ కొన్ని బిందువులుగా క్రోడీకరించగలిగితే 'జీవితము యొక్క వర్తమాన స్థితి' అందులో సాక్షాత్కరిస్తుంది. సాధారణంగా జనులు 'ఆత్మతత్త్వము యొక్క సాక్షాత్కారాన్ని' గురించి మాట్లాడేటప్పుడు, వినేటప్పుడు భ్రాంతిపూర్వకమైన ఊహలలో కొట్టుకుపోతుంటారు. ఇలాంటివారిలో బహు సంఖ్యాకులు తమ జీవితములోని ప్రస్తుతస్థితిని గురించిన సత్యం వీలైనంతవరకు విముఖంగా ఉండటమో లేదా తెలియనట్లుగా ఉండటమో చేస్తుంటారు.

'మీ జీవితములోని వర్తమాన స్థితియొక్క సాక్షాత్కారము' ఇది జీవించేకళ యొక్క ప్రారంభ బిందువు అనగా 'మనము ఎవరమో, ఎలా ఉన్నామో దానిని అదే రూపంలో స్వీకరించి అనుభూతి చెందటము' అని అర్థము చేసుకోండి. మీలోని లోటుపాట్లను తెలుసుకొనటంతోపాటు ఉన్న అర్హతలను, అవకాశములను కూడా గుర్తించండి. ఇది చూడటానికి తేలికగా ఉన్నా అంత తేలికైన పనికాదు. దీనికి నిత్యం నియమిత రూపంలో అభ్యాసము కావాలి. సాధారణంగా మనలో అందరం ఒక దృఢమైన ఆత్మవంచనలో బ్రతకటానికి అలవాటు పడి ఉంటాము. ఇతరుల దృష్టిలో మన గురించిన అభిప్రాయమునకే సహజంగా మనము ప్రాముఖ్యతనిస్తూ ఉంటాము. కానీ అది సరియైనది కాదు. నిన్ను నువ్వుగా తెలుసుకొనటము చాలా అవసరమైన పని. దాని తరువాతనే 'జీవన సాధన' గురించి ఏదైనా వాస్తవికమైన దిశలో అడుగు వేయటము మంచిది.

ఈక్రమములో రెండవ ముఖ్యమైన అంశము సంకల్ప పూర్వకమైన జీవనయానము. సంకల్పవంతుల జీవితమును గురించి ప్రజలలో ఒక అపోహ ఉన్నది. సాధారణ ప్రజలు 'సంకల్పమును' పట్టుదల లేదా మొండితనముగా భావిస్తుంటారు. 'నిజానికి సంకల్పమనేది వివేకపూర్ణమైన నిర్ణయమును అమలు చేయగలిగే దృఢవ్యక్తిత్వమునకు సంబంధించినది' అని జెడీఫిషర్ అభిప్రాయము. మనలోని తప్పులను తొలగించుకొనటానికి, సద్గుణములను అభివృద్ధి పరచుకొనటానికి సంకల్పమును ఉపయోగించుకోవాలని ఫిషర్ అభిప్రాయము. జీవించేకళను సాధన చేసేవారు సుదీర్ఘ ప్రయత్నాల తరువాత తనను తాను తెలుసుకొని, తనలోని లోటుపాట్లను, బలహీనతలను, అలాగే తనలోని అర్హతలను, శక్తిసామర్థ్యములను గుర్తించి వాటిని రెండు ప్రత్యేక పట్టీలుగా తయారు చేసుకోవాలి. ఈ పట్టిని అనుసరించి ప్రతి వారం ఒక బలహీనత లేదా దోషమును వదలివేస్తూ ఒక మంచి గుణమును లేదా అవకాశమును జాగృతపరచుకొనేవిధంగా సంకల్పాన్ని తీసుకోవాలి.

సంకల్పపూర్ణమైన జీవితానికి క్రమశిక్షణను చాలా ముఖ్య మైన అంశంగా ఫిషర్ భావిస్తున్నారు. సత్యమనే నాణెమునకు సంకల్పము, క్రమశిక్షణ 'బొమ్మ-బొరుసు' వంటివని ఫిషర్ అభిప్రాయము. **క్రమశిక్షణాపరుడు కానిదే, సంకల్పవంతుడు కాలేడు. అదేవిధంగా సంకల్పమనేదే లేనప్పుడు క్రమశిక్షణను ఖచ్చితంగా పాటించడము కూడా సాధ్యము కాదు. సంకల్పము, క్రమశిక్షణ – ఈ రెంటినీ ఖచ్చితమైన సరియైన రీతిలో అమలు పరచడము వలన జీవితములో అంతర్లీనంగా దాగి ఉన్న శక్తులు జాగృతము కావడము ప్రారంభతుంది.** తత్ఫలితముగా ఎన్నో ఉన్నతస్థాయి సంభావనలు అంకురించి, పల్లవించడము జరుగుతుంది!

ఈ స్థితిలో 'జీవనకళ' యొక్క తరువాతి చరణము ఆరంభ మవుతుంది. తనలోకి శక్తులను స్వార్థరహితంగా ఉన్నతమైన ప్రయోజనాలకు ఉపయోగించడమనేదే ఆ చరణము. దీనిని కూడ సరిగ్గా అమలుచేస్తూ ఉంటే జీవితము రూపాంతరణ చెందుతుంది. అల్పమైన అంశాలు వాటంతట అవే ప్రక్కకు తప్పుకుంటాయి. తనలోనే 'విరాట్‌విశ్వము' యొక్క అనుభూతి కలుగుతుంది. శ్రేష్ఠమైన సకలజనహితమైన పనుల కోసము తన శక్తులను ఉపయోగించేకొద్దీ శాంతి, సంతోషములు ఇనుమడిస్తాయి. కళాత్మకమైన ఈ జీవనశైలిలో జీవితము యొక్క శ్రేష్ఠత్వం, సౌందర్యం వెల్లడవుతాయి. అంతర్లీనంగా ఉన్న శక్తులు, అవకాశాలు తమ సంపూర్ణ సౌందర్యముతోపాటు ప్రకటీకృతమౌతాయి. పరమేశ్వరుని యొక్క అత్యంత శ్రేష్ఠమైన సృష్టి యొక్క ఈ మానవ జీవితములో సర్వోత్తమమైన 'కళాత్మకత' వెల్లడౌతుంది.

*– అఖండజ్యోతి, నవంబరు 2002*

*అనువాదం: శ్రీమతి కృష్ణకుమారి*

**గొప్పవాడిననిపించుకోవాలన్న లోభం, మోహం, భళీ అనిపించుకోవాలన్న తృష్ణ లేనిచో భవబంధాల నుండి విముక్తి కలుగుతుంది**

# భారతీయ సంస్కృతి తిరిగి జాగృతమౌతుంది

నిరంతరము, నిండుగా ప్రవహించే నది వంటిది మన భారతీయ సంస్కృతి! అందులో అసంఖ్యాకమైన నదీ-నదములు వేలాది సంవత్సరములుగా సంగమిస్తూనే ఉన్నాయి. అనాది కాలము నుండీ అందరినీ (అన్నింటినీ) తనలో ఇముడ్చుకోగల గుణ-ధర్మ స్వభావము కల సంస్కృతుల ఒకానొక ధార ఉన్నదీ అంటే అది మన మహోన్నతమైన భారతీయ సంస్కృతియే అని సగర్వముగా లోకానికి చాటిచెప్పవచ్చును. భారతీయ సంస్కృతి పురాతనకాలమునుండి ఒక విశిష్టమైన గుర్తింపును కలిగి ఉన్నది. ఏ సంస్కృతైనాసరే మన సంస్కృతి యొక్క సంపర్కములోకి వస్తే; వాటన్నింటినీ తనలో కలిపేసుకున్నది భవ్యమైన మన భారతీయ సంస్కృతి. అంతేకాదు అన్నింటి మీదా తనదైన గట్టి ముద్రనువేసింది. పరస్పరము ఎంతో విరుద్ధముగా ఉండే తత్త్వములను సైతము ఏకత్రాటిపైకి తెచ్చి తన మూలములో ఒక్కటిగా ఇముడ్చుకున్నది. మన భారతీయ సంస్కృతి తన యొక్క మూలమైన గుర్తింపును నిలుపుకుంటూనే నవనిర్మాణ సూత్రాలను ఒడిసిపట్టుకుని ముమ్మందుకు సాగిపోగల సామర్థ్యమును తనలో నిలుపుకుని ఉన్నది.

భారతీయ సంస్కృతి యొక్క మూలమైన ఆధారము 'త్రయీ' పేరున ప్రసిద్ధిగాంచినది. ఋగ్వేదము, యజుర్వేదము, సామవేదముల జ్ఞానగుచ్ఛము ఈ త్రయీవిద్య! తరువాతి కాలములో అథర్వణవేదము వికాసమునందినది. త్రయీ విద్యయే 'సమస్త జ్ఞాన-విజ్ఞానము, విద్యలకు' ముఖ్యమైన స్రోతము. కేవలము ఆధునిక మానవ సమాజమునకు మాత్రమే కాదు; మానవజాతి భవితకు కూడా వ్యావహారికముగా ఆవశ్యకమైనదిగా వేదములలో ఉన్న శాశ్వత సత్యము, కనుక దానిని అవశ్యం ఆవిష్కరింపజేసుకోవాలి. ఏరోజునైతే వైదిక జ్ఞానము యొక్క రహస్యములు భౌతికజగత్తులో ఆవిష్కరించబడతాయో ఆనాడు మానవజాతికి, ప్రపంచమునకు గల అన్ని సమస్యలకు సమాధానము లభించి, అవి పరిష్కరించబడతాయి. ఒక మహోన్నతమైన ఉజ్జ్వల భవిష్యత్తు యొక్క అవకాశం తప్పకుండా సాకారమై తీరుతుంది. అందువలన వేదజ్ఞానమే మన సాంస్కృతిక-సంపద! మన సమస్యలన్నింటికీ మూల కారణము ఉత్కృష్టమైన ఆ వైదికజ్ఞానము లేకపోవడమే!

భారతీయ సంస్కృతిని 'ఆర్యసంస్కృతి' అని కూడా పిలుస్తారు. 'ఆర్య అనగా శ్రేష్ఠమానవుడు!' అని 'ద సీక్రెట్ ఆఫ్ వేదా' అనే పుస్తకములో అరవిందులు సెలవిచ్చారు. వేదములలో 'ఆర్యులు' ఆదర్శవాదులుగా, వ్యావహారికవాదులుగా, తమ జీవితమును సమగ్రముగా అనుభూతి చెందినవారుగా వర్ణించబడ్డారు. ఆర్యులు పరిపాలించిన కారణముగా మన సంస్కృతి 'ఆర్యసంస్కృతి' అని పిలువబడినది.

ఆర్యసంస్కృతి సామాజికముగానేకాదు; పలురంగములలో చెప్పుకోతగిన, అభూతిపూర్వమైన ముద్రను వేసి భరతజాతిని చరమోత్కృష్టస్థితిలో కూర్చోబెట్టినది. కర్మ ఆధారముగా విభజించబడిన వర్ణ-వ్యవస్థ సమాజమును వికాసము యొక్క సర్వోన్నత శిఖరమునకు చేర్చింది. కానీ ఎప్పుడైతే వర్ణవ్యవస్థ అన్నది వంశపారంపర్యమైనదిగా మారిందో అప్పటినుండి పరిస్థితి తారుమారు అయింది. కానీ ఈ విరుద్ధమైన పరిస్థితి భారతీయ సంస్కృతి యొక్క మూలతత్త్వములను నాశనము చేయలేకపోయింది. ఆర్యసంస్కృతి వికసించిన కాలములో భరతమాత జగద్గురుపీఠము మీద ఆసీనమై ప్రపంచమునకు దివ్యసంస్కృతి, సంస్కారములను వెదజల్లినది.

కాలాంతరములో సికిందర్ అనే ఆక్రమణదారుడు పంజాబ్-సింధు ప్రాంతములలో తన ఆధిపత్యమును ప్రదర్శించాడు. సికిందర్ పాలన ముగిసిన వెంటనే యూరోపీయన్ సంస్కృతి విస్తరిస్తున్న వేళ భారతీయ సంస్కృతి ఒక క్రొత్త రూపును సంతరించుకుంది. అప్పుడు కూడా భారతీయ సంస్కృతిలోని దార్శనికత, సాహిత్యము, రాజనీతి, సామాజిక క్షేత్రముల మీద నూతన ప్రయోగములు జరిగినాయి. యూరప్ సంస్కృతిలోని కొన్ని ప్రత్యేక అంశములు మన సంస్కృతిలో కలిసినాయి. అవి ఎంతగానో ప్రభావమును చూపించినాయి.

యూరప్‌వారి తర్వాత శకులు ఈ దేశములో కాలు పెట్టారు. ప్రాచీనమధ్య ఆసియాలో నివసించే స్కిథీ అనే ఒక జాతికి చెందిన జనసమూహమే శకులు. శకులు ప్రారంభము నుండే భరతభూమిని తమ సొంతగడ్డగా భావించారు. వారు భారతీయ సంస్కృతిని హృదయపూర్వకంగా అనుసరించారు.

**ప్రకాశం ఎల్లప్పుడూ అంతరంగంలోనే దొరుకుతుంది**

శకులు భారతదేశములోని హిందువులతో మమేకమైపోయారు. బ్రాహ్మణులలోని ఒక శాఖ అయిన శాకద్వీపబ్రాహ్మణులు ఈ శకు వంశస్థులే! క్రీస్తుశకం మొదటి శతాబ్దములో మన దేశ సరిహద్దులలో గల చైనాలోని కబీలాకి చెందిన కుషానులు మన భారతభూమిమీద కాలుమోపారు. ధర్మము-దార్శనిక భావాల మీదనే కాక; వివిధ కళలు, నాణెముల ముద్రణ, వంటింటి వస్తువులు తయారుచేసే పద్ధతుల మీద కుషానుల ముద్ర కనిపిస్తుంది. భారతీయులు ధరించే కుర్తా, పైజమా, శేర్వాణీ, పొడుగుచొక్కా, పొడుగుకోటు, కాగితము కుషానులు అందించినవే. కుషానులు చివరకు హిందువులై పోయారు. గుప్తుల చేతిలో ఓడిపోయాక కుషానులు కాబూల్‌కు వెళ్ళి స్థిరపడినా అక్కడకూడా తాము ఇష్టముగా అనుసరించే హైందవధర్మమును పరిరక్షించుకుంటూనే ఉన్నారు.

క్రీ.శ.712లో ఇస్లామ్ మతస్థుడైన ముహ్మద్‌బీన్‌కాసిమ్ మన దేశము మీద దాడిచేశాడు. 1526లో టర్కీకి చెందిన మంగోలు జాతీయులు ఈ దేశపు రాజనీతి-పరిపాలన రంగములమీద ఆధిపత్యము సాధించారు. అయితే వీరు భారతీయ సంస్కృతితో పెద్దగా విబేధించలేదు. ముసల్మాన్ అయిన అక్బర్‌ను భారతీయులు మొదటిసారిగా తమ రాజుగా అంగీకరించారు. అనేక అంశాలలో అతని ముద్ర కనిపిస్తుంది.

దేశములో మొగలాయిల పాలన కొనసాగుతున్న కాలములోనే పంజాబ్‌లో సిక్కుమతము, మహారాష్ట్రలో మరాఠీ సంస్కృతి పురుడు పోసుకున్నాయి. మరాఠీలు భారతీయ సంస్కృతి పునర్జాగరణకు ఎనలేని కృషిచేశారు. సిక్కులు అటు రాజకీయ శక్తికి, ఇటు సాంస్కృతిక క్రాంతికి వెన్నుదన్నుగా నిలిచారు. వారు సమాజములో తిరిగి నైతికవిలువలను స్థాపించారు. అంతేకాకుండా దేశములో మహోన్నతసంస్కృతి వికాసమునకు సాటిలేని సేవచేశారు. కబీర్ జ్ఞానజ్యోతిని వెలిగించిన తరుణములో; తులసీదాసు హిందువులు చేజార్చుకున్న గౌరవమును తిరిగి కైవశము చేసుకునేందుకు ప్రయత్నిస్తున్న వేళలో ఈ పెనుమార్పులు చోటుచేసుకున్నాయి. భక్తిరసములో మునక లేస్తున్న మీరా, సూరదాసులు జీవించిన కాలమిదే. సాహితీ భాషలో దీనిని 'భక్తికాలము' అని చెపుతారు. సమాజము భక్తిమార్గములో పయనిస్తూ చీకటిలోనుండి వెలుగుపథమును అన్వేషిస్తున్న సమయమిదే.

1725 నుండి మొగలుల పరిపాలన అంతరించసాగింది. అప్పటికే పోర్చుగల్, డచ్, ఫ్రెంచ్, ఆంగ్ల జాతీయులు భారత దేశమునకు రాసాగారు. ఈ సుదీర్ఘకాల చరిత్రలో ఎన్నెన్నో చెడు సంప్రదాయములు భారతీయ సమాజములోకి చొరబడ్డాయి. సమాజము పతనము వైపుకు జారిపోయింది. మరోప్రక్క యూరప్‌లో పారిశ్రామికవిప్లవము మలిదశకు చేరుకుంది. ఆ సమయములో యూరప్‌జాతీయులు ఆఫ్రికా-ఆసియాల లోని అపార ప్రాకృతికసంపదల మీద తాము పట్టు సాధించాల్సిన ఆవశ్యకత ఉన్నదని గుర్తించారు. ఈ క్రమము లోనే ఆంగ్లేయులు వ్యాపారబుద్ధితో ఈ దేశములోకి అడుగుపెట్టి నెమ్మదిగా పట్టుబిగించారు. అడుగుపెట్టు-రాజ్యమేలు అన్న నీతిననుసరించి దేశమంతటినీ తమ చెప్పుచేతల్లోకి తెచ్చుకున్నారు.

ఆంగ్లేయుల పాలనా కాలమును భారతీయసంస్కృతికి అత్యంత చీకటి అధ్యాయముగా చెప్పకతప్పదు. అది ఎటువంటి హీనమైన పరిస్థితి (కాలము) అంటే ఆంగ్లేయుల బానిసత్వములో మొదలైన సంస్కృతి పతనదశను నేడుకూడా ఈ భారతదేశము తన భుజస్కంధాలమీద మోస్తున్నది. వీరి పాలనా కాలములో ఒక్క పాలనా సంబంధమైన బానిసత్వమేకాదు; సాంస్కృతిక బానిసత్వము కూడా చోటుచేసుకున్నది. ఇప్పటికీ ఆ అవశేషములు మనందరి అంతశ్చేతనలో వేళ్ళూనుకుని ఉన్నాయి. ఆధ్యాత్మికతయే భారతీయ సంస్కృతికి ఆత్మ!! ఆధ్యాత్మికశక్తి కేవలము భవిష్యత్తును సృజించడమేకాదు; భావి కాలములో మనకు ఆవశ్యకమైన అన్ని ఏర్పాట్లను సిద్ధంచేసి పెడుతుంది. ఈనాడు పరిస్థితులు ఎంత విషమముగాను, ఆపదలతో నిండినవిగాను గోచరిస్తున్నప్పటికీ; సమస్యలు ఎంత అసాధ్యమైనవిగా కనపడుతున్నప్పటికీ... అవన్నీ కూడా ఆధ్యాత్మికత అనే మాధ్యమము ద్వారా చికిత్స చేయబడితే పునర్జాగరణ చెందుతాయి. భారతదేశము ప్రపంచపు అత్యున్నత శిఖరాలమీద నిలిచి తన జగద్గురుస్థానమును చేజిక్కించుకుని తీరుతుంది. ఆ ప్రసవవేదనే ఈనాటికాలమును కకావికలము చేస్తూ మథిస్తున్నది. భారతీయ సంస్కృతి తప్పకుండా తిరిగి తన దివ్యమైన స్వరూపమును పొందుతుంది.

వర్తమానకాలములో కనిపిస్తున్న అన్ని అసంబద్ధతలు, విషమపరిస్థితులు క్రమముగా 21వ శతాబ్ది యొక్క ఉజ్జ్వల భవిష్యత్తు అవకాశాలలో సమసిపోతాయి. మన నరనరాలలో

**ఆత్మలోనే సాహసం ఉంటుంది**

పుట్టుకతోనే ఉండే సాత్వికత అనే అతి సహజ వాతావరణము మన దేశములో తిరిగి తలెత్తుతూ ఉన్నది. సుస్పష్టముగా, ఖచ్చితముగా ఇదంతా జరిగితీరుతుంది. 2019 తరువాత అదంతా మన కళ్ళకు కట్టినట్లు కనిపిస్తుంది, గుర్తించ బడుతుంది. బహుశః 2017 నుండి ఆ మార్పు ఆరంభమవు తుంది. ప్రకృతి లోని సూక్ష్మలోకములలో జరిగే అలజడులను గుర్తించగలిగే దివ్యదృష్టి ఉన్నవారందరు 2017 నుండి 2036 మధ్యగల కాలము మన దేశమునకు, అలాగే ప్రపంచమునకు అభూత పూర్వమైనదిగా, ఆశ్చర్యజనకమైనదిగా నిలవటమును చూడగలుగుతారు.

ఈ నియతి భగవత్సంకల్పము! అది తప్పక జరిగి తీరుతుంది. భారతీయ సంస్కృతి పునర్జన్మ-పునఃస్థాపన సునిశ్చితము! తామసికమైన, విధ్వంసకరమైన శక్తులు దీనికి విరుద్ధముగా ఎంత సమర్థవంతముగా పనిచేసినప్పటికీ జరిగే దానిని అవి అడ్డుకొనలేవు. సదాలోచనలు-సద్భావనలు-సదాచరణ గల శ్రేష్ఠమానవులు దీనికి ధ్వజారోహణము చేస్తారు. అందువలన ఎవరి హృదయములోనైతే దేశభక్తి నిండుగా ఉన్నదో; ఆలోచన లలో సమగ్ర వికాసపు తపన వెల్లువెత్తుతూ ఉన్నదో వారందరికీ ఇదే మా సాదర ఆహ్వానము! రండి! ఈ యుగధర్మము కోసము నడుంబిగించి మున్ముందుకు సాగిపోవటానికి కదలిరండి!

*– అఖండజ్యోతి, జనవరి 2015*

*అనువాదం: శ్రీమతి లక్ష్మీరాజగోపాలు*

---

## 41వ అశ్వమేధ గాయత్రీ మహాయజ్ఞము - కన్యాకుమారి, తమిళనాడు

*2016 జనవరి 28 నుండి 31 తేదీలలో తమిళనాడు రాష్ట్రంలోని కన్యాకుమారి వద్ద జరుగనున్న అశ్వమేధ మహాయజ్ఞంలో పాల్గొనేవారు ఈ క్రింది విషయాలను గమనించగోరుచున్నాము.*

1. *కన్యాకుమారి అశ్వమేధ యజ్ఞంలో సమయదానం ఇచ్చేవారికి మాత్రమే ప్రవేశము.*
2. *తమ పేరును ముందుగనే గాయత్రీతీర్థ్, శాంతికుంజ్, దక్షిణ భారత జోన్ విభాగంలో నమోదు చేయించుకొని అనుమతి పత్రాన్ని పొందినవారికి మాత్రమే కన్యాకుమారి అశ్వమేధములో పాల్గొనుటకు అర్హులు.*
3. *అశ్వమేధ యజ్ఞం సఫలత పరిజనులు చేసే సాధనతో ముడివడి ఉన్నది. ఇట్టి సాధనా పరిజనులు వెంటనే తమ పేర్లను దక్షిణ జోన్‌లో నమోదు చేయించుకొనవలసిందిగా కోరడమైనది.*
4. *యజ్ఞములో పాల్గొనేవారు 27 జనవరి 2016కు మాత్రమే చేరుకోవాలి. అంతకు ముందు రాకూడదు.*
5. *పరిజనుల నివాసము టెంట్లలో ఏర్పాటు చేయడమైనది. కావున పరిజనులు గదుల కొరకై అభ్యర్థన చేయవలదు.*
6. *యజ్ఞంలో పాల్గొనేవారు తమ వెంట పరచుకొనుటకు, కప్పుకొనుటకై కావలసిన దుప్పట్లను వారే తెచ్చుకొనవలయును.*
7. *తమ వెంట ఖరీదైన వస్తువులను తేరాదు.*
8. *వృద్ధులకు, జబ్బుపడినవారికి ప్రవేశం లేదు.*
9. *31 జనవరి 2016 తదుపరి యజ్ఞస్థలంలో నివాసము లభించదు.*
10. *కన్యాకుమారి యజ్ఞానికై అంశదానమిచ్చే వారు ఈ క్రింది బ్యాంక్ ఖాతాలో జమచేయ ప్రార్థన.*

| **Bank** | | **IFSC Code** |
|---|---|---|
| Axis A/c No - 1560 101 000 13846 | (15 DIGIT) | UTIB0000156 |
| BOB A/C NO - 0926 010 000 4639 | (14 DIGIT) | BARBOHARDWA |
| CBI A/C No - 1577 841 575 | (10 DIGIT) | CBINO280274 |
| SBI A/C No- 1087 685 8311 | (11 DIGIT) | SBIN0002350 |
| PNB A/C No - 3129 010 100 000018 | (16 DIGIT) | PUNBO469400 |

11. *అంశదాన రశీదు పుస్తకాలు కావలసిన వారు శాంతికుంజ్ దక్షిణ జోన్‌లోని విభాగంలో సంప్రదించగలరు.*

**ఆధ్యాత్మికత జీవనం కన్నా వాసనలతో తృష్ణలతో కూడిన జీవితమే నిజానికి కష్టతరమైనది**

బోధ కథ

# ఐక్యమత్యంతో ఉంటే ఎన్ని కష్టాలనైనా ఎదిరించవచ్చు

గ్రామ పంచాయతి చావిడిలో గ్రామస్థులంతా గుంపుగా చేరారు. అందరి చూపులు వచ్చిన వ్యక్తిమీద నిలచాయి! ఈ జనసముదాయం మధ్యలో ఉన్న వ్యక్తి ముఖం మీద దృఢ విశ్వాసమనే వెలుగు ప్రకాశిస్తున్నట్లు; ఏదో తెలియని గాంభీర్యంతోపాటు ఒక అసాధారణ దృఢత్వంతో ఆయన వ్యక్తిత్వం సాక్ష్యమిస్తున్నట్లు ఉన్నది.

"ఎందుకు మీరంతా ఇంతగా భయపడుతున్నారు? విషయ మేమిటి?" అని ఆయన అడిగాడు! అప్పుడు వారంతా ముక్త కంఠంతో ఇలా చెప్పారు – "మేమందరం దొంగలతో బాధలు పడుతున్నాము, మేమేకాదు. మొత్తం 'బారడోలీ' ప్రాంతమంతా దొంగల భయం పట్టుకొంది! నిజం చెప్పాలంటే మేము రెండు తిరగలి రాళ్ళ మధ్య నలిగిపోతున్నాము. ఒక రాయి దొంగలైతే; మరొక రాయి పోలీసులు! దొంగలు లూటీ చేస్తూ ఉంటే పోలీసులేమో వారిని పట్టుకోలేకపోగా. వారికయ్యే ఖర్చులు కూడా మేమే భరించవలసి వస్తుంది. ఈ విధంగా వీరివురి బాధలతో మేమెంతో భయభీతులమై పోతున్నాము..!"

ఆ రోజుల్లో ఆ ప్రాంతంలో దొంగల భయం కొంత ఎక్కువగా ఉండేది! చీకటిపడగానే ప్రజలంతా వారి వారి ఇండ్లల్లో తలుపులు బిగించుకొని, దొంగల భయంతో బైటకు ఎవరూ వచ్చేవారు కాదు! బయట కనీసం ఒక పిల్లవాడు కూడా కంటికి కనిపించేవాడు కాదు! దొంగలు కొద్దిమందైనా కూడా; దొంగల భయంతో... చుట్టు ప్రక్కలున్న యాభై గ్రామాల ప్రజలు గుండెలను గుప్పెట్లో పెట్టుకొని జీవితాలను గడుపుకొంటున్నారు. అప్పుడున్న ఇంగ్లీషు ప్రభుత్వం వారు గ్రామాల రక్షణ కొరకు పోలీసు దళాలను నియమించారు. వారి ఖర్చులను గ్రామప్రజలే భరించవలసి ఉంటుంది. అయితే ఈ పోలీసు దళాలు దొంగలను పట్టుకొనుటలో అసమర్థులు. వారికి కేవలం కావలసింది తమ సౌఖ్యం మాత్రమే...! దొంగలను ఎదుర్కొనే సాహసం చేయలేక ఏదో కాపలా ఉన్నామనే నామమాత్రంగా కాలం గడిపేవారు...! పాపం ! గ్రామస్థులంతా ఈ రెండు దెబ్బలను తట్టుకోలేక 'ఆయనను' స్మరించుకోవడంతో... ఆయన వచ్చి అన్ని విషయాలను తెలుసు కోవడం జరిగింది? ఆయన మదిలో దొంగల భయం కాని; లేక పోలీసుల నుండి ఎదురయ్యే కోపంతోగాని సంబంధం లేని విధంగా తొణకని ధైర్యంతో ప్రజల స్థితిగతులను తెలుసు కోవడంలో నిమగ్నుడయ్యాడు! ఈనాడు పంచాయతి సావిడిలో కూర్చుని గ్రామస్థుల కష్టాలకు ఒక పరిష్కారం చేయు నిమిత్తం ఇక్కడకు రావటం జరిగింది... అన్ని విషయాలు విని గ్రహించిన పిదప; ఆయన తల పంకించి అందరిని చూస్తూ ఈ విధంగా చెప్పసాగాడు! గ్రామస్తులంతా ఎంతో ఆశతో ఆయనవైపు చూడసాగారు! అందరి వంక చూస్తూ– "చూడండి – చెడుపనులు కూడా మంచితనం ఆధారం మీదనే నిలుస్తాయి! వీటి నుండే తన బ్రతుకు సాగిస్తూ ఉంటాయి! జలగలు జీవి వంట్లోని రక్తాన్ని పీల్చుకొని దాన్ని చంపేందుకు ప్రయత్నిస్తాయి! కాని జరగవలసింది ముందుగా రోగి మారాల్సి ఉన్నది. ముందుగా మనం తెలుసుకోవలసిన విషయం చెడు పని చేయు దొంగలకు ఆ పనులు చేయటానికి శక్తి ఎక్కడ నుండి లభిస్తుంది? "అయితే దుర్మార్గులైన దొంగల్లో కూడా మంచితనం కూడా దాగి ఉంటుందా..?" అంటూ అందరు ఆశ్చర్యపోతూ అడిగారు...?

"అవును... నిజంగానే... వారందరిలో ఐక్యమత్యం; సాహసం; జాగరూకత ఇంకా మనోబలం ఉన్నది! ఇదే వారిలోని శక్తి...!" అందరిలో తెలుసుకోవలసిన కోరిక తీరింది..! "అయితే ఇప్పుడు మేమంతా ఏం చెయ్యాలి?" "మీరందరూ ఈ గుణాలనే పెంచుకోండి మీలో...! అప్పుడే మీలో ఆ శక్తి పెంపొంది; దానితో ఈ దొంగలను ఓడించగలరు!

"ఏ విధంగా చేయాలి..?" దీనికి జవాబుగా ఆయన ఆ గ్రామ ముఖ్యుణ్ణి పిలచి – "ఈ గ్రామంలో ఎంతమంది ఉన్నారో చెప్పండి..! అని అడిగితే – "700 మంది" అని సమాధానం వచ్చింది! మీరిలో ఎంతమంది బలంగా, పుష్టిగా యువకులున్నారు" "దాదాపు 200 మంది!"

**ఇతరుల సుఖం కొరకు తాను కష్టపడేవాడే మహాత్ముడు, జ్ఞాని పరమార్థి**

"మరి దొంగలు ఎంతమంది దోచుకోవటానికి వస్తూ ఉంటారు?" పది నుండి పదిహేను.. అధికంగా ఉంటే ఒక పాతికమంది వరకు ఉండవచ్చు..! ప్రతి ఇంట్లో తప్పకుండా ఒక లాఠీ వంటి కర్ర ఉంటుంది కదా! అది ఏవో కొన్ని ఆయుధాలు కూడా ఉంటాయి గదా! కొంతమందైనా ఆయుధాలను ఉపయోగించుట తెలిసే ఉంటుంది.. కాబట్టి ఈ లెక్కన చూసుకొంటే గ్రామయువకుల శక్తి దొంగలకన్నా అయిదు రెట్లు ఎక్కువ..! ఇంకా మీ గ్రామం లోని దారులెక్కడెక్కడ ఎలా ఉంటాయో కూడా మీకందరికి బాగా తెలుసు... దొంగలకు ఈ దారుల గురించి కూడా అంతగా తెలియకపోవచ్చు! ఇకపోతే మనలో లేనిది వారిలో ఉన్న తేడా ఏమంటే వారిలో ఐక్యమత్యం, జాగరూకత; సాహసం గుణం ఎక్కువ. అది మనలో లేకపోవటమే ముఖ్యమైన కారణం! అందుచేతనే వారిని ఎదురించలేకపోతున్నాము! మనలో ఈ గుణాలను పెంచుకుంటే గనుక వారిని తప్పక ఎదుర్కోగలం.. ! అందరికి విషయం పూర్తిగా అర్థమైంది! ఈ గ్రామం; ప్రక్క గ్రామం; ఇంకా మిగిలిన అన్ని గ్రామాలలోని ఆరోగ్యంగా ఉన్నా; సమర్థులైన యువక సమూహాలతో వ్యూహరచన సిద్ధమైంది! మహిళలంతా ఇంటి బాధ్యతలను తీసుకొన్నారు! చూస్తూ-చూస్తూ ఉండగానే దొంగల దాడులు అంతమయ్యాయి!

దాడులు అంతమైన పిదప ఆయన మరొకసారి ఆ గ్రామానికి విచ్చేసి; "ఏ గుణాల బలం మీద చెడును ఓడించామో, వాటిని జీవితాంతం నిలుపుకొందాం. వాటి శక్తితో నిరంతరం పోరాటమును కొనసాగిద్దాం...!" ఆయనిచ్చిన సలహాతో గ్రామస్థులు తమ గ్రామం మంచి కొరకు పరిసరాల శుభ్రతతోపాటు, ఆరోగ్యప్రదమైన వ్యాయామాల వంటి అనేక పనులను చేయసాగారు! ఆ రోజుల్లోనే మహాత్మాగాంధీజీ సత్యాగ్రహాన్ని ప్రారంభించారు! ఐక్యసాధనతో, చెడుకు ఎదురు వ్యూహరచనలో 'బారదోలీ' క్షేత్రప్రజలు తమశక్తిని అనేక చమత్కారాల రూపంలో చూపించగలిగారు, చూచినవారికి కళ్ళు తిరగసాగాయి. విలేకర్లు పత్రికలలో 'గాంధీగారి శిష్యు డొకరు అద్భుతంగా పనిచేస్తున్నాడని, ఆయనను ఓడించగల శక్తి అంటూ ఏదీ లేదని... చాలారకాలుగా వ్యాసాలు వ్రాయుట జరిగింది! ఆయనే గాంధీజి శిష్యుడైన శ్రీ వల్లభభాయి పటేల్! ఆయనను ఇక్కడి ప్రజలు ప్రేమగా సర్దారని పిలుచుకొనేవారు! బారదోలీ' ప్రజల పిలుపు దేశం మొత్తం పిలుపుగా మారింది!

చెడు విరుగుడికి వ్యూహపురచన ఐకమత్యపు చికిత్సయే నేడు సరైన అవసరం! ధార్మిక క్రియల పేరుమీద మూఢ నమ్మకాలు, అనువంశిక పేరుమీద నడిచే చెడు ఆచారాలను మనం ఇప్పటివరకు హారాలుగా మన కంఠాలకు తలిగించు కున్నాము! ఏ క్షణంలో వాటి నిజస్వరూపం గుర్తించబడిందో ఆ క్షణాన్నే వాటిని విషసర్పాలుగా భావించి, మెడ నుండి తీసి దూరంగా విసిరివేసిననాడు మన సమాజమంతా ఆరోగ్యంగా ఉంటుంది. అయితే ఈ యుగ పరివర్తన సమయంలో 'శక్తిధార కేవలం ఐకమత్యం, సాహసం; జాగరూకత ఇంకా మనోబలం మీద ఆధారపడి ఉంటుంది! ఈ మహాశక్తుల ఆధారం మీదనే నవయుగ సృజన తయారవగలదు.

– *అనువాదం: జి. చెన్నకేశవరావు*

## పూజ్య డా॥ శ్రీరామకృష్ణ మాష్టారుగారి దివ్య వచనాలు


1. *పటిష్టమైన భవన నిర్మాణానికై తగినంత పునాదిని త్రవ్వుట తప్పనిసరి. అట్లే పటిష్టమైన వ్యక్తిత్వనిర్మాణానికై తగిన రీతిలో సమస్యల అధిగమించుట తప్పనిసరి.*
2. *మన సాధనతో మన వ్యక్తిత్వం వికసిస్తే పూజ్య గురుదేవులు దానిని శక్తివంతం గావిస్తారు.*
3. *మనమంతా కలిసి పరమపూజ్య గురుదేవుల వ్యక్తిత్వాన్ని ప్రపంచానికి పరిచేయం చేద్దాం. తరువాత పనిని గురుదేవులు పూర్తిచేస్తారు.*
4. *స్పష్టమైన ఆలోచన స్పష్టమైన ఫలితాన్ని ఇస్తుంది.*
5. *ప్రకృతికి అనుగుణంగా జీవించుటే భారతీయ ఆధ్యాత్మికత.*

– *సేకరణ: పూజ్య డా॥ శ్రీరామకృష్ణ మాష్టారుగారి ఉపన్యాసాల నుండి*

**ఆదర్శంతమైన జీవితం ప్రకాశం, సంతోషం, ఉల్లాసంతో కూడి చాలా సరళంగా ఉంటుంది**

# ఆధ్యాత్మిక ఔన్నత్యమునకు సోపానాలు యోగము మరియు తపస్సు - 3

***పరమపూజ్య గురుదేవులు గాయత్రీపరివార్ కార్యకర్తలకు గత సంచికలో ఇచ్చిన ప్రవచనము 'యోగము-తపస్సు అనే రెండు అంశములు మానవుడి ఆధ్యాత్మిక ఉన్నతికి అతి ముఖ్య సోపానములు' అని చెప్పినట్లు మీరు చదివియున్నారు. 'ఆధ్యాత్మిక సాధన అంటే భౌతికమైన కర్మకాండ మాత్రమే కాక; ఆత్మోత్కర్ష భావనతో శ్రద్ధాపూర్వకముగా చెయ్యబడే ఉపాసన' అని అర్థము చేసుకోవాలి. కోరికలను నెరవేర్చుకొనటానికి భగవంతుడిని పూజించడము ఆస్తికత కాదు. ఆస్తికతయే ఆధ్యాత్మికతకు ఆధారము. ఆధ్యాత్మికతకు యోగము-తపస్సు అనే రెండు క్రియలు సహాయసహకారములను అందించే సాధనములు. గాయత్రీ మహామంత్రము యొక్క లక్ష్యము కూడా ఇదే! 'గాయత్రీమంత్రం వల్ల కలిగే ప్రేరణలు, దిశానిర్దేశములు, శిక్షణ మొదలైనవి మానవుడిలో ఆస్తికదృష్టికోణమును, ఆధ్యాత్మికపరమైన ఆలోచనలను ఉత్పన్నము చెయ్యగలవు' అని కూడా గురుదేవులు ప్రవచిస్తున్నారు. రండి! వారి అమృతవాణిని మరింతగా హృదయంగమము చేసుకుందాము!'నేను' అనేదే మనిషికి భగవంతునికి మధ్య ఉండే అడ్డుగోడ.***



స్వార్థపరుడైన వ్యక్తికి క్షణం కూడా తీరిక దొరకదు. అతడికి తన కుటుంబము పట్ల ప్రేమకానీ, సమాజం పట్ల సహకారం కానీ ఉండవు. ఎంతసేపటికీ 'నేను-నాది' అన్నదానిపైననే దృష్టి కేంద్రీకరిస్తాడు. ఆఖరుకు దైవమును, సత్పురుషులను కూడా స్వప్రయోజనాల కోసమే ఉపయోగించుకుంటాడు. అతడిలో అహంకారం, తృష్ణ, స్వార్థము ఎంతగా పెరిగి పోతాయంటే అతడికి 'నేను-నాది' తప్ప మరొక ఆలోచనే ఉండదు. ఇదే మానవుడికి-భగవంతుడికి మధ్యనున్న గోడ. మనం కనుక మన కషాయ కల్మషములను దూరం చేసుకొని, నేను అన్న భావమును వదిలి 'మనం' అనే ఆలోచన చెయ్యగలిగితే మనిషి భగవంతుడితో సమానుడౌతాడు, భగవంతుడే మీలో ప్రవేశిస్తాడు.

పూజ-పారాయణలు అన్నవి కషాయకల్మషములనే గోడలను పడగొట్టటానికి ఉపయోగపడే కత్తి, గొడ్డలి వంటివి. వాటినే యోగము-తపస్సు అంటారు. నిప్పుమీద బూడిద కప్పబడి ఉన్నప్పుడు నిప్పుకణికలు నల్లగా ఉండి; వేడిమిని పోగొట్టు కుంటాయి. ఆ బూడిదపొరను తొలగించితే నిప్పు కణకణలాడు తుంటుంది. సెగలు విరజిమ్ముతుంది. అదే విధంగా మనం మనపైన ఆవరించియున్న 'అహం' అంటే 'నేను' అనబడే బూడిదపొరను తొలగించుకొన గలిగితే భగవంతుని ప్రకాశమును చూడగలము. మనిషిలో స్వార్థము, ధనము, భౌతిక మహత్త్వా కాంక్షలు ఎంత అధికముగా ఉంటే, అంత ఎక్కువగా అతడు భగవంతుడికి దూరమవుతాడు. తీవ్రమైన తృష్ణ, లాలస ఉన్న వ్యక్తి తన కోర్కెలను నెరవేర్చుకునే ప్రయత్నములు చెయ్యటము, ఇతరులను హీనపరచటము... ఇంతకన్నా వేరే పనులకు అతడికి తీరిక ఏది? తన కోర్కెలను నెరవేర్చుకొనటానికే జీవితకాల మంతా వెచ్చిస్తాడు.

## యోగమంటే భగవంతునికి సమర్పణ చేసుకొనటమే

మనిషి వ్యక్తిగతమైన ఆశలను వదిలివేసి భగవంతుడా నీ ఆశయాలను నెరవేర్చడమే నా జీవితలక్ష్యము. అందులోనే నాకు ఆనందముంది. నీ ఆజ్ఞలను నేను పాలిస్తాను, సుర దుర్లభమైన ఈ మానవజీవితమును ఎందుకోసమైతే నాకు అందించావో ఆ పనిని చేయమని ఆజ్ఞాపించు' అని భగవంతునితో చెప్ప గలిగితే దానిని 'యోగము' అంటారు. మీకు తిండి-తిప్పలు, కూడు-గుడ్డా లభిస్తున్నాయి. చాలు. ఇంకా మీవద్ద సమయము, జ్ఞానము, తెలివి ఉన్నాయి. వాటిని భగవంతుడి

**మృత్యువుకు అతి చేరువలోనున్న వారి మనస్సు ఆలోచనల నుండి విముక్తి నొందుతుంది**

కోసము వెచ్చించండి. ఇక్కడినుండే 'యోగము' ప్రారంభమవుతుంది.

యోగమనేది జీవితములో ఒక మెట్టు పైకి ఎదిగేందుకు ఒక పద్ధతి. ఆసనాలు వెయ్యటము, ముక్కుతో నీరు త్రాగటము మొదలైనవన్నీ శరీరమునకు, ఇంద్రియములకు సంబంధించిన వ్యాయామములు. వ్యాయామము వల్ల శరీరము దృఢమవుతుందే కానీ ఆత్మపైన దాని ప్రభావమేమీ ఉండదు. ఆత్మను ప్రభావితము చెయ్యాలంటే మనం మనస్సు యొక్క ఆలోచనా విధానమును మార్చుకోవాలి. మనకోసం మనం ఏదో ఒకటి కోరుకునే అలవాటును విడిచిపెట్టి ఇతరులకు వీలైనంతగా ఏదో ఒకటి ఇచ్చే పద్ధతిని జీవితములో అమలుచేసుకోవాలి. అప్పుడు మీరు దేవతగా మారతారు. వరాలిచ్చేవారిని దేవతలు అంటారు. భగవంతుడు మీకు ఊహించలేనంత సంపదల నిచ్చాడు. దాని విలువ మీకు తెలియదు. ఆయన మనకు ప్రసాదించిన దానిని మనం ఇతరులకు పంచడము అలవరచుకోవాలి.

## హజారీ అనే వ్యక్తి యొక్క హజారీబాగ్

బీహార్‌లో హజారీ అనే ఒక రైతు ఉండేవాడు. అతడు మామిడితోట వేశాడు. అప్పటివరకు ఆ గ్రామములో మామిడి తోట లేదు. చెట్లు చిన్నచిన్న కాయలు కాయగానే గ్రామములోని వారంతా ఒక్కొక్కరే వచ్చి మామిడికాయలు అడిగి కోసుకుని ఊరగాయ వేసుకుని తిని ఆనందించారు. ఆరకముగా ఊరు ఊరంతా ఆనందపడింది. 'ఊరంతా నా దగ్గరికి వచ్చి అడిగిన వస్తువేదైతే ఉందో అది నా సంపద కాదు. కేవలం నా శ్రమతో వచ్చిన ఫలములు మాత్రమే! నేను చెమటోడ్చి వేసిన చెట్లతో ప్రజలకు మేలు కలిగింది. డబ్బు ఒక్కటే సంపద కాదు. శ్రమకూడా విలువైన సంపదే! అనుకుని ఈ రైతు సంతోషించాడు.

ఏమాత్రమూ చదువురాని, ఆస్తిపాస్తులు లేని ఒక రైతు తాను స్వయముగా మామిడితోట వెయ్యటమే కాక; ఊరిలోని వారందరినీ మామిడితోట వెయ్యమని ప్రోత్సహించాడు. జీవితాంతము అతడు తోటలు వేస్తూనే ఉన్నాడు. ఇతరులను ప్రోత్సహించి వారిచేత వేయిస్తూనే ఉన్నాడు. అతడి కొడుకులు కూడా పెరిగి పెద్దవారై తండ్రి మార్గమునే అనుసరించారు. ఆవిధముగా అతడు బీహార్ చుట్టుప్రక్కల వెయ్యి మామిడితోటలు తయారుచేశాడు. అందుకనే ఆ జిల్లాకు వెయ్యితోటల జిల్లా (హజారీబాగ్) అనే పేరువచ్చింది. హజారీ అనే రైతు స్వయం కృషితో తన శ్రమశక్తిని దానం చేసి 1000 మామిడితోటలను పెంచినందువల్ల కూడా అతని పేరునే ఆ జిల్లాకు పెట్టడము జరిగింది అని కూడా చెప్పుకుంటారు. ఆ 1000 మామిడి తోటల గొప్పతనం ఎంత ఘనమైనదంటే దానివలన ప్రజలు, పిల్లలు, పక్షులు, పశువులు అందరూ లాభపడ్డారు. ఆ చెట్ల ఉనికి కారణముగా మేఘములు ఉఱిమి, మబ్బులు వర్షించి నేల సారవంతమైనది. జిల్లా ధన్యమైనది.

మనకు ఉన్నదానిని భగవంతునికోసము, ప్రజాహితము కోసము ఎట్లా వెచ్చించాలి అని ఆలోచించేవారిని దేవతలు అని చెప్పవచ్చు. దీనికి మీరు వ్యతిరేకమైన పద్ధతిలో ఉంటే కనుక భగవంతుడు మీనుండి దూరంగా వెళ్ళిపోతాడు. అడుక్కునేవాడికి అవమానం తప్పదు. భగవంతుని వద్దకు వెళ్ళినా, సాధుసత్పురుషుల దగ్గరకు వెళ్ళినా మీరు దేనినో అడగటానికి మాత్రము వెళ్ళవద్దు. ఏదైనా ఇవ్వటానికి వెళ్ళండి. గుడికి, సాధుసత్పురుషుల వద్దకు ఉత్తచేతులతో ఎప్పుడూ వెళ్ళకండి.

## యాచకులు కాకండి - దేవతలుగా మారండి

ఎప్పుడూ ఇతరులకు ఇవ్వటానికే తత్పరులయ్యేవారిని, జీవితములో ఏదో ఒకటి సమాజమునకు ఇచ్చితీరాలి అనే ఉత్సాహము పెల్లుబుకుతుండే వ్యక్తులని దేవీదేవతలంటారు. మీ దగ్గర డబ్బు లేదు, తెలివితేటలు లేవు, అయినా పర్వాలేదు. భగవంతుడిచ్చిన శరీరము ఉందిగా! దానితో మీరు ఇతరులకు ఎంత సహాయమైనా చెయ్యవచ్చు., కబీరు, సమర్థరామదాసు, రామకృష్ణపరమహంస, సుభాన్‌చంద్రబోస్ మొదలైన మహనీయుల వద్ద డబ్బు ఉన్నదా? డబ్బు అనేది దోపిడీదారుల దగ్గర, నాయకుల వద్దా కుప్పలుతెప్పలుగా ఉంటుంది. వాళ్ళు తమ విలాసాలకోసము, రకరకాలైన కోర్కెలు తీర్చుకోవడము కోసము పిచ్చివాళ్ళలాగా కొట్టుకుపోతుంటారు. ఈ డబ్బున్న వాళ్ళందరు ఏమి చేశారు కనుక? డబ్బుతో పనిలేని సేవ చేసేందుకు ఆలోచించండి.

## మథురలోని పిండివిసిరే ఆమె కథ

మథురా నగరములో పిండి విసిరిన ఆమె కట్టించిన బావిని చూసిరండి. సేవ ఎలా ఉంటుందో అర్థమౌతుంది.

దుర్గుణాలు కలిగి ఉండుట తప్పు - వాటిని దాచుకోవటం మరింత తప్పు

మథరలో పిండి విసిరే ఒక స్త్రీ ఉన్నది. ఆమె పిండి విసరగా వచ్చిన ధనముతో జీవనం సాగిస్తూ, వచ్చిన డబ్బులో రోజు ఒకటి లేదా రెండు పైసలు దాస్తుండేది. అలా దాచగా దాచగా ఆమె వద్ద రెండు మట్టికుండల నిండా డబ్బు నిండింది. వృద్ధాప్యం పైబడగా ఆమె ఒకరోజు గ్రామస్థులను పిలిచి ఆ డబ్బునంతటినీ వారికిచ్చి 'ఎంతో కష్టపడి, చెమటోడ్చి పైసాపైసా కూడబెట్టగా ప్రోగైన ధనమిది. ఈ మొత్తమును ఏదైనా మంచి పనికి వినియోగించండి' అని చెప్పింది. 'ఈ ఊరిలో బావి లేదు కాబట్టి రహదారికి సమీపములో బావి త్రవ్విస్తాము' అని చెప్పి గ్రామస్థులు బావి త్రవ్వించారు. బావిలో అత్యంత మధురమైన తియ్యటినీళ్ళు పడ్డాయి. ఆ చుట్టుప్రక్కల అంతటా ఉప్పు నీరే. ఒక్క ఈ బావిలోనే మంచినీరు. జనం ఎక్కడెక్కడి నుండో బండ్లు కట్టుకొనివచ్చి ఆ నీళ్ళను బిందెలతో తీసుకు పోతుంటారు. ఆ నీటిని త్రాగి రోగిష్టి వాళ్ళెందరో ఆరోగ్య వంతులైనారు. టీ.బీ, టైఫాయిడ్ వంటి మొండివ్యాధులు కూడా చక్కగా నయమయ్యేవి. అక్కడి రైతులు ఆ చుట్టుప్రక్కల ప్రదేశ మంతటా మామిడిచెట్లు నాటారు. ప్రజలంతా అక్కడికి విహార యాత్రలకు వస్తుంటారు. గుడారాలు వేసుకుని కాలక్షేపం చేస్తారు. పెండ్లి ఊరేగింపులు అక్కడ ఆగుతాయి. రోగులు స్వచ్ఛమైన మంచిగాలి కోసం అక్కడికి వచ్చి ఆ బావి నీటిని త్రాగి సేదతీరుతుంటారు. కాబట్టి రకరకములైన వస్తువులను కొని ప్రోగేసుకోవటము మానేసి, మన దగ్గరున్నదేదో దానిని ప్రజాహితం కోసం, సమాజం కోసం, దేశం కోసం, ఉన్నతమైన పనుల కోసం ఖర్చుపెడదాం. అప్పుడు మీరు దేవతలనిపించు కుంటారు.

### మా వీలునామా ఏమిటి?

మాకు మా పల్లెటూరులో 80 సెంట్ల వ్యవసాయ భూమి ఉండేది. అప్పట్లో ఒక సెంటు భూమి 500 రూపాయలు పలుకుతుండేది. మాగాణీనేల కావటంతో మంచి పంటలు పండేవి. ఊరు సస్యశ్యామలముగా ఉండేది. మేము ఈ ఊరిని వదిలి ఇక్కడికి వచ్చేముందు అక్కడ ఒక పాఠశాల కట్టించాము. అంతకు ముందు ఆ ఊరిలో చదువుకున్న వ్యక్తులం ముగ్గురమే ఉండేవారం. ఇప్పుడు అక్కడ చాకలివాళ్ళ పిల్లలు, సాలెవాళ్ళ పిల్లలు, చెప్పులు కుట్టేవారి పిల్లలు, ఇంకా ఎన్నో ఇతర వృత్తులవారి బిడ్డలందరు, అలాగే ఎంతోమంది ఆడపిల్లలు ఆ బడిలో చదువుకుని మెట్రిక్, హయ్యర్ సెకండరీ కూడా ఉత్తీర్ణులైనారు. ఇప్పుడది కళాశాలగా మారింది. ప్రస్తుతం అక్కడ మూడు, నాలుగువేలమంది పిల్లలు ఆ పరిసర ప్రాంతములనుండి వచ్చి చదువుకుంటున్నారు. ఆ ఊరిలోని మా దాయాదులు, బంధువులు ఆ భూమిని తమకు ఇవ్వమని అడిగారు. 'మీరు కుంటివాళ్ళో, గుడ్డివాళ్ళో, కుష్ఠువాళ్ళో అయితే ఇచ్చేవారము. మీకు కాళ్ళుచేతులు సక్రమముగానే ఉన్నాయి కాబట్టి మీరు పనిచేసుకు బ్రతకవచ్చు' అని వారికి చెప్పాము. మా తండ్రిగారు సంపాదించి ఇచ్చిన భూమి అది, దానిని మేము భగవంతునికి, మా గురుదేవులకు సమర్పించుకుంటు న్నాము. ఆ స్థలములో మేము కళాశాల ఏర్పాటు చేశాము. మా దగ్గర తెలివి ఉన్నది. దొంగతనం, నయవంచన మాకు చేతకావు. ఇప్పటివరకు మేము వ్రాసిన పుస్తకాల మీద సంపాదించదలచుకుంటే మాకు ఏడుతరాలవరకు తినగలిగే టంత లక్షల రూపాయల రాయల్టీ వచ్చేది. కానీ మేము మా బుద్ధిని, సంపదను, శరీరమును గురువుగారికి సమర్పించాము. కాబట్టి మేము ధనమునకు ఆశపడము. *(సశేషం)*

*– అఖండజ్యోతి, మార్చి 2015*
*అనువాదం: శ్రీమతి కృష్ణకుమారి*

## మానవ మనుగడను ప్రశ్నార్థకం కానివ్వకండి

*నేటి సమాజ ఆవశ్యకత సత్పురుషులు మరియు సజ్జనులు ముందుకు రావలసి ఉన్నది. దుష్ప్రవృత్తులతో, దుష్టత్వంలో, వికృతులతో నిండి పతనోన్ముఖులైన వారిని రక్షించాలి. నేడు మంచి-చెడుల మధ్య పోరు సమాజంలో ప్రారంభం కావాలి. దేవ పురుష సజ్జనులు తమ తమ రంగాల్లో, క్షేత్రాల్లో తమ శక్త్యానుసారం తమ కర్తవ్యాన్ని పూరించాలి. వీరంతా తమ సత్కార్యాలు, సదాచరణ, సద్ప్రవృత్తులతో నిండిన దివిటీల చేబూని, ముందుకు నడుస్తూ ఎదురైన చీకట్లను తొలగిస్తూ పోవాలి. సమాజం లోని వికృతులు పరాకాష్ఠకు చేరుకున్నాయి. వీనిని నిలువరించకముందుకు పోనిచ్చిన, మానవ జీవనం, మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుంది.*

*– హిందీమూలం: అఖండజ్యోతి, సెప్టెంబర్ 2015*
*అనువాదం: ఎ. శారద*

**సమాజసేవలో తన పురుషార్థాన్ని వినియోగించిన వానికి కీర్తి ప్రతిష్టలు లభిస్తాయి**

నావారితో నా మాట

# దృష్టిని, దిశను మార్చే నవరాత్రులు



### గాయత్రీ పరివారం జరుపుకునే సామూహిక తపోసాధన ఉత్సవాలు

శరన్నవరాత్రుల్లో నవయుగ నిర్మాణం కోసం గాయత్రీ పరివార్ సభ్యులందరూ కలిసి తపో సాధన మహోత్సవాలు జరుపుకుంటాం. నవ యుగ నిర్మాణాని కోసం గత అర్థ శబాద్ది కాలం నుంచే గాయత్రీ పరివారం శంఖాన్ని పూరిస్తోంది అన్న విషయం జగమెరిగిన చారిత్రాత్మక సత్యం. ఆ నాదంతో సంపూర్ణ వాతావరణం ప్రతిధ్వనిస్తోంది. ఈ చర్మ చక్షువులతోనూ, చెవులతోనే దీన్ని మనం చూడగలుగు తున్నాం, వినగలుగుతున్నాం. మనిషి మనిషిగా మెలగాలి; పాశవిక జీవితాన్ని వదిలేసి దైవత్వాన్ని పొందడం అనే ఏ మహత్కారణ కోసం అవతరించాడో దాని కోసం కృషి చేయాలి.

ఇంత కాలం ఈ సందేశాన్నే ప్రజల్లోకి తీసుకువెళ్ళి వారి అంతరాళాలలో ముద్రించడం జరిగింది. ఈ ప్రేరణ నిష్ఫలం కాలేదని అందరికీ తెలుసు. కోట్లమంది ఆత్మ నిరీక్షణ చేసుకుని బాగుపడ్డారు. ఆత్మవికాసానికి ప్రయత్నిస్తూ నరుడి ముసుగును తీసేసి నారాయణుని కొలువులోకి చేరారు. ఎందరో పురుషులు పురుషోత్తములైయ్యారు. ఈ లెక్కలన్నీ చూస్తే, గాయత్రీ పరివారం చేసిన మహా తపస్సు, గాయత్రీ సాధన యొక్క దేదీప్యమానమైన వెలుగులు చీకటిని తొలగించడంలో చాలా వరకు సఫలత పొందింది అనచ్చు. ఈ సుదీర్ఘ ప్రయత్నం నిరర్థకం కాలేదు.

శరన్నవరాత్రుల్లో ఈ తపోసాధన చేయడం సభ్యులందరూ గౌరవప్రదంగా భావిస్తారు. మేమంతా కలిసి మెలిసి సరైన దిశలో పయనించామని సంతోషిస్తారు. దానికి తగ్గ ఫలితం కూడా దక్కింది. ఎప్పటిలాగానే ఈసారి కూడా ఈ ఉత్సవాలు జరుపుకుంటాం.

మానవ సమాజంలో ఉత్సవాలు జరుపుకోవడం ఆనవాయితి. ఇది సరైన పరంపర, పైగా అవసరమైనది కూడా. నిద్రాణమైన చైతన్యానికి కొత్త ప్రేరణ కలిగే అవకాశం లభిస్తుంది. గాయత్రీ పరివారం ఈ పండగకి తపో సాధ నోత్సవాల రూపాన్ని ఇచ్చింది. ప్రతి నవరాత్రుల్లో ఉత్సాహంతో ఆత్మకళ్యాణానికి, లోకకళ్యాణానికి పాటుపడుతూంటారు. వ్యక్తిగత జీవితాల్లో, కుటుంబాలలో, సమాజంలో వాటి అద్భుత ఫలితాలను చూస్తూనే ఉన్నారు.

### సాధనా క్రమం ఈ విధంగా ఉండాలి

చాలా ఇబ్బందుల్లో ఉన్నవారు, వృద్ధావస్థలోని వారిని మినహాయిస్తే 99.9% మంది వారి వారి స్థలాల్లో ఉపవాసాలు, వ్రతనియమాలను పాటిస్తూ తొమ్మిది రోజుల్లో గాయత్రీ తపో సాధనా ఉత్సవాలు ఏర్పర్చుకోవాలి. సామూహికంగా వీలైన చోట్లల్లో పొద్దున్నే నగర సంకీర్తన, సామూహిక జపము, హవనము, కీర్తనలు, భజనలు, ఉపన్యాసాలు, దీపయజ్ఞాలు మొదలైనవి ఏర్పాటు చేసుకోవాలి.

యుగ సాహిత్యం విస్తరించాల్సిన ఈ సంవత్సరంలో అఖండజ్యోతి (యుగశక్తి గాయత్రి) మొదలైన పత్రికలకు చందాదారులను చేర్చడం, యుగసాహిత్యాన్ని పంచడం, గురువు గారి ఆలోచనలను వీలైనంత ఎక్కువ మందికి పంచడం మొదలైనవన్నీ ప్రతి సాధకుడి పవిత్ర కర్తవ్యం. నవరాత్రులలో చేసిన సాధనకు ఇవి పూర్ణాహుతిగా పరిగణించవచ్చు. ప్రతి నవరాత్రులలో సాధకులు పోటీపడి, ఒకరికన్నా మరొకరు ఎక్కువ పుస్తకాలు పంచాలి.

గాయత్రీ పరివార్ సభ్యుల్లో ఇటువంటి ఆరోగ్యకరమైన పోటీ అన్ని విధాలా మెచ్చుకోదగ్గది. 'ఒకటికి పది' అన్న నానుడి పాతదే అయినా సాహిత్య విస్తరణకి చాలా ముఖ్యమైనది. మాసపత్రికలైనా, పుస్తకాలైనా ఊరికే పేజీలు తిప్పి మూలన పడేయడం కాకుండా వాటిని కనీసం పదిమంది చదివి తీరాలి. తెప్పించుకున్నవారు మాత్రమే చదివారంటే అర్థం ఒక చెట్టుకి ఒకే పండు కాసినట్టు. పదిలక్షల మంది అఖండజ్యోతి సభ్యత్వం

**జీవిత సమస్యల పరిష్కరించడానికి పెద్ద పెద్ద సాధనాలు, ఉపకరణాలు అవసరం లేదు**

కడితే కోటిమంది పాఠకులుండాలి. ఒక టి.వి. లేదా రేడియోలో వచ్చే సమాచారం చాలామంది వినగలిగినప్పుడు, ఒక పుస్తకానికి చాలామంది పాఠకులు ఎందుకు ఉండకూడదు. ఇంటి బైట అన్నిచోట్లా ఈ ఆలోచనా సరళి ప్రసరించాలి, జ్ఞానగంగ ప్రవహించాలి.

## శరన్నవరాత్రుల సాధన సందేశం

ఏ లక్ష్యంతో గురువుగారు యుగసాహిత్యాన్ని రచించారో, దాన్ని సరిగ్గా అర్థం చేసుకోవడం ముఖ్యం. వారి ఆలోచనలు సరైనవనిపిస్తే ఊరికే వదిలేయకుండా వాటిని వ్యవహారంలోకి తీసుకొచ్చే సాహసం చేయాలి.

ఈ మధ్య తత్త్వజ్ఞానమంటే ఏదో చర్చల కోసం, ప్రవచనాల కోసం, వినటం కోసం మాత్రమే ఉపయోగిస్తున్నారు. కానీ నిష్ఠతో దాన్ని జీవితాలలో అవలంభించుకుంటేనే ఆ జ్ఞానం సార్థకమైనట్టు. గురువుగారు ఉపదేశించిన ఆధ్యాత్మికతను వ్యవహారంలోకి తీసుకురాగలిగే ధైర్యం చేయగలిగితే ఈ నవరాత్రుల సాధన సఫలమైనట్టే.

గురువుగారు మొదటి నుండి తుదిశ్వాస వరకు ఒకే విషయాన్ని నొక్కి వక్కాణించారు, మనిషి సుఖసంతోషాలకు ఆధారం అతని సంపదలు కాదు, విభూతులు. గుణ, కర్మ, స్వభావాలను మెరుగుపరచుకోకుండా, దృష్టికోణంలో ఉత్కృష్టత రానివ్వకుండా, ఆదర్శవంతమైన కర్తృత్వం రాకుండా ఆత్మిక ఉత్కర్ష సాధించలేం సరికదా, కొండంత సంపద ఉన్నా ప్రశాంతంగా ఉండడం కుదరదు.

కాబట్టి మనం ప్రతిక్షణం ఆత్మనిరీక్షణ, ఆత్మనిర్మాణం కోసం కృషి చేస్తూనే ఉండాలి. ముందు చూపంటే ఇదే. జీవితంలోని లెక్కలేనన్ని సమస్యలన్నిటికీ పరిష్కారం ఇందులోనే ఉంది. ఇటువంటి వారికే సర్వతోముఖ అభివృద్ధికి ఆధారం లభిస్తుంది. లోపలి చైతన్యం నికృష్టంగా ఉంటే కుబేరుడంత ధనవంతుడైనా, ఇంద్రుడంతటి సమర్థుడైనా సరే మధనపడుతూ ఉండాల్సిందే.

అఖండజ్యోతి (యుగశక్తి గాయత్రి)లో యుగసాహిత్యం లోని సారం ఇదే. ఇది అర్థం చేసుకోవడం కోసమే ఆధ్యాత్మికం మరియు ధర్మం యొక్క సృష్టి జరిగింది. ఆస్తికత, ఆధ్యాత్మికత, ధార్మికత అనే త్రివేణీ సంగమంలో మునిగితేనే మనిషి చైతన్య వంతుడై మరెందరినో ఉద్ధరించగలదు.

## అధ్యాత్మ సాధనలో రెండు చరణాలు

1) యోగం 2) తపస్సు. యోగం అంటే మన కోరికలను, ఆలోచనలు, బాధలు, వాసనలు అన్నిటినీ ఈశ్వరరూప సమిష్టిలో, ఉత్కృష్ట ఆదర్శవాదంలో ఇమిడ్చేయాలి. వ్యక్తివాదాన్ని సామూహికవాదంగా మార్చాలి. తృష్ణ అనే కఠినమైన లోహాన్ని సంయమనం, అపరిగ్రహం అనే నిప్పుపై కాల్చి అమూల్యమైన లోహభస్మంగా మార్చాలి. కోరికలను తీర్చుకోవడానికి ఆధ్యాత్మికాన్ని ఉపయోగిస్తుంటారు. కోరికలకు అంతులేదు. దేవతలందరూ కరుణించినా, ప్రపంచంలోని సామానంతటినీ ఉపయోగించినా కోరికలు తీరవు. ఒక్కటి తీరితే వెయ్యి తలెత్తుతాయి. వాటిని పొందినా, భద్రపరుచుకోవడం ఇంకా కష్టం.

కోరికల జంఝాటంలో, చిక్కు ముడిలో చిక్కుకున్నవారు లక్ష్యంవైపు వెళ్ళలేరు సరికదా దాని గురించి ఆలోచించే తీరిక కూడా ఉండదు. కాబట్టి ఆత్మకళ్యాణాన్ని కోరుకునే వారి మొదటి అడుగు – వీలైనంత తక్కువ సామాగ్రితో తృప్తి పడడం, తరువాత మిగిలిన సామర్థ్యాన్ని సద్భావనలు మరియు సత్ప్రవృత్తుల అభివర్ధనకు ఉపయోగించాలి.

ఆధ్యాత్మికతను కోరికలు తీర్చుకోవడానికి కాదు, ఆ జంఝాటాన్ని వేళ్ళతో సహా మనస్సు నుండి త్రుంచి వేయడానికి వాడాలి. అటువంటి వారినే ఆప్తకాములంటారు. అటువంటి వారికే తమ దివ్యత్వం వికసింపజేసుకోవడానికి, అంతరాత్మను శాంతపరచుకోడానికి అవకాశం దొరుకుతుంది. అలాంటి వారికే అంతస్సులో ఈశ్వరుని సాక్షాత్కారం కలుగుతుంది. అటువంటి వారే తమతోపాటు ఇతరులను ఉద్ధరించగలరు. మురికి నీరు కూడా గంగానదిలో కలిసి పుణ్యప్రదమైపోతుంది. భక్తుడు తన కోరికలను ఈశ్వరుని ఆదేశాలలో మేళవిస్తే భగవంతుడై పోతాడు. భక్తుడు తనకు కావలసినట్టు కాక, తాను దేవుడికి కావలసినట్టు నడుచుకుంటాడు.

ఆధ్యాత్మికతలోని రెండవ ధార తపస్సు. తపస్సు అంటే తపించడం, కష్టానికి ఓర్చుకోవడం. చాలా మంది ఎండకి ఎండడం, చలిలో స్నానం చేయడం, చెప్పుల్లేకుండా నడవడం,

**వ్యక్తి పరిమితమైన పరిధిలో జీవన వికాసానికి ఉపక్రమిస్తే శాంతిపూర్వకంగా ఉండవచ్చు**

కఠోర ఉపవాసాలు మొదలైన శారీరిక కష్టాలని మాత్రమే తపస్సుగా భావించి, అలా చేయడం వల్ల దేవుడు కరిగిపోయి వారికి కావలసింది ఇచ్చేస్తాడు అనుకుంటారు. ఇలా ఆలోచించడం ఈశ్వరుడు వంటి గొప్ప నియామక సత్తాను చిన్నచూపు చూడడమే. ఏ కారణం లేకుండా శారీరిక, మానసిక కష్టాలను అనుభవించే వారిపై ఎందుకు సానుభూతి కలుగుతుంది? తపస్సు పేరుతో నవరాత్రుల్లో ఇలాంటి గ్రుడ్డి నమ్మకాలు ప్రబలంగా ఉంటాయి.

నిజానికి తపస్సు యొక్క నిజమైన అర్థం – ప్రపంచంలో ఉన్న బాధలను, పతనాలను తొలగించడానికి మన దగ్గరున్న సుఖసంపదల్లోని పెద్ద భాగాన్ని వెచ్చించడం. పక్కవారి కష్టాలను మన భుజాలపై మోయడం. మన సౌఖ్యాలన్నీ బాధలలో ఉన్నవారికి పంచేయడం. బాధలను తగ్గించి, సుఖాల్ని పంచే వారు సాధారణంగా బీదవారి స్థాయిలోనే జీవిస్తారు. పక్కవారి కష్టాల పట్ల ఎలాంటి సానుభూతి లేని పాషాణ హృదయం కలిగిన వారు మాత్రమే ఐశ్వర్యాన్ని అనుభవించగలరు. మానవ జాతి మొత్తం ఒక కుటుంబం అయినప్పుడు, ప్రజలంతా మన తోటివారు, అన్నదమ్ములే అవుతారు. పేదరికం వల్ల ఆరోగ్యమూ చెడదు, పరువు పోదు.

ఋషిమయ జీవితం అంటే ఈ ఆలోచనా విధానానికి ప్రమాణం. ఒకప్పుడు బ్రాహ్మణులు, సాధువులు తమ జీవితాలను కనీస స్థాయిలోనే గడిపేవారు, అలా మిగిలిన వనరులను సమాజం కోసం, సత్ప్రవృత్తులను సంవర్ధన కోసం ఖర్చు పెట్టేవారు. ఇటువంటి దృష్టికోణంతో కార్యకలాపాలను నిర్ధారించుకునే వారిని తాపసులు అంటారు. యోగం, తపస్సుల వల్ల అవతరించే దివ్యశక్తులన్నీ అటువంటివారినే వరిస్తాయి.

## ఈ నవరాత్రులు ఆత్మసమీక్షలో గడవాలి

శరన్నవరాత్రుల్లోని తొమ్మిది రోజులు, తొమ్మిది రాత్రులు ఆత్మసమీక్షకే ముమ్మరంగా పనిచేయాలి. ప్రస్తుతం ఉన్న ఆధ్యాత్మికత, ధర్మాలు ఎంతగా కుళ్ళిపోయాయంటే, వాటి నుండి నాస్తికత వంటి మహమ్మారులు పుట్టుకొస్తున్నాయి. నేటి పరిస్థితుల్లో చూస్తే ధర్మం అంటే ఏమిటి? ఫలానా వంశం వారు, ఫలానా వేషభాషలు కలిగినవారు ఇతరుల్ని దోచు కోవచ్చు అనే అనుమతిపత్రం. చూడబోతే ధర్మమనేది దురాచారాలు, మూఢనమ్మకాలు, భ్రాంతులకు మూలం. ఆధ్యాత్మికత ఏమిటి? ఏదో పూజాపునస్కారాలు చేసేసి దేవతలను, మన వశంలోకి తెచ్చేసుకుని, పనికొచ్చి, పనికిరానీ కోరికలన్నిటినీ తీర్చే కోతులాట.

ఏవో మాయ మంత్రాలు చేసి, వింత పదాలను ఉచ్చరించి, వస్తువులు పైకి కిందకీ చేసేయడం ఆధ్యాత్మికత అయిపోయింది. ఈ బొమ్మలాటకు అలవాటు పడి, ఊహాలోకాల్లో విహరించి, ఏవో సిద్ధులు చేజిక్కినట్టు ఊహించేసుకుంటారు. ఈ పిచ్చి సముదాయానికేమైనా చేజిక్కిందా, అంటే అదీ లేదు. ఏమీ దొరక్క ఒకరి పరువు ఒకరు తీసుకుంటూ తమ తప్పులను కప్పి పుచ్చుకుంటారు.

ఈ వాస్తవాన్ని చూసి సిగ్గుతో తల ఒంగిపోతుంది, ఏడుపొస్తుంది. వీళ్ళే గనుక వారి కష్టాన్ని, ధనాన్ని, సమయాన్ని, మనస్సును నిజమైన ఆధ్యాత్మికతకు వెచ్చించి ఉంటే ధన్యులయ్యే వారు, పైగా ప్రపంచాన్ని వెలుగులతో నింపేవారు. మనిషి జీవితంలో అతి మూల్యమైన సంపద, నిజమైన విజయం – ఆధ్యాత్మికత. దానికి నిర్వచనం ఆత్మవికాసం, ఆత్మిక ఉత్కర్ష. దీనివల్ల మనిషి పెద్దవాడు కాకపోయినా, గొప్పవాడు తప్పక అవుతాడు.

ఈ మహత్తు వారిని పరలోకంలోనే కాదు ఈ లోకంలో కూడా దైవసమాన స్థాయికి చేరుస్తుంది. భౌతిక సాధనలు కొన్నే ఉన్నప్పటికీ, తన దగ్గరున్న ఆత్మప్రకాశం, కూడగట్టుకున్న తపోశక్తి వల్ల ఈ క్షణభంగురమైన సంపదల కన్నా కొన్ని కోట్ల రెట్లు ఎక్కువ ఆనందం, ఉల్లాసం, గౌరవం, వర్చస్సు లభిస్తాయి.

## మనిషిలో దైవత్వం ఉదయించిన వెంటనే వాతావరణం మారుతుంది

ఇటువంటి వ్యక్తి ఎక్కడుంటే అక్కడ స్వర్గంగా మారుతుంది. అతనిలోని సుగంధం చందనం చెట్టులాగా చాలా దూరం వ్యాపిస్తుంది. మనిషిలో దైవత్వం అనేది ఊహ కాదు. స్వయం ప్రకాశమానమైన మనిషి, తానున్న చోట చుట్టుప్రక్కలంతా ప్రకాశవంతంగా ఉంచే మనిషి నిజమైన దేవత. అతనికి ప్రత్యేకించి ఏ స్వర్గమూ అవసరం లేదు.

**రాక్షసుల వలె యంత్రాలు మనుష్యుల ఆరోగ్యాన్ని స్నేహ సంబంధాలను సదాచారాన్ని అణగద్రొక్కుతున్నాయి**

ఆధ్యాత్మికత ఏ మనిషినీ స్వర్గానికి పంపించదు. తానెక్కడుంటే అక్కడ స్వర్గంగా మార్చగల సామర్థ్యాన్నిస్తుంది. కాబట్టి అటువంటి ఆధ్యాత్మికత విలువ తెలుసుకుని డబ్బు, ఆరోగ్యం, చదువు, పరపతి మొదలైనవి సంపాదించడం కన్నా ఎక్కువ ప్రాధాన్యతను ఇవ్వాలి. శారీరిక వాసనలు, మానసిక తృష్ణలు ఎప్పటికప్పుడు తృప్తిపరచమంటాయి. వాటికోసం మన సమయం, శ్రమ అన్నింటినీ హరిస్తుంటాయి. వీటన్నిటినీ పట్టించుకుంటూ ఆత్మ ఆకలిని, పిలుపునూ ఉపేక్షిస్తూంటారు.

ఈ నవరాత్రుల్లో మనం మన ఈ దిశాధారను మార్చుకోవాలి. ఆధ్యాత్మికత ఉపాసనతో మొదలవుతుందే కానీ దానొక్క దానితోనే లక్ష్యం దొరకదని గురువుగారు మొదటి నుంచి మనకు చెప్తూనే ఉన్నారు. అందుకు జీవన సాధన కావాలి. ఆదర్శవంతమైనవి అనదగ్గ స్థాయి నమ్మకాలు, ఆలోచనలు, క్రియాకలాపాలు ఉండాలి. అంతరంగ మరియు బాహ్య వ్యక్తిత్వ స్వరూపానికి సాధన కాయకల్పాన్ని చేస్తుంది. ఈ శరన్నవరాత్రులలో ఈ సత్యాన్ని మనం అనుభవించగలగాలి.

ఆధ్యాత్మిక సాధకుల జీవనదిశ మిగిలినవారిలా ఉండదు. ఈ వ్యత్యాసాన్ని తెలియజెప్పడానికి గీతాకారుడు యోగి మరియు భోగి మధ్య రాత్రి పగలంతటి తేడా ఉంటుందని చెప్పాడు. ప్రపంచమంతా నిద్రిస్తున్నప్పుడు యోగి మేల్కొంటాడని, ప్రపంచమంతా మేల్కొన్నప్పుడు యోగి నిద్రిస్తాడని గీతలో చెప్పబడింది. ఈ అలంకారిక వర్ణన దృష్టి భేదాన్ని సూచిస్తుంది.

నా వారితో నా మాట అంటూ ఈ పంక్తుల్లో అసలు చెప్పదల్చుకున్నదేమిటంటే, నేటి లోకప్రవాహం పతనం వైపు, నరకం వైపు ప్రవహిస్తోంది. మనలో ఎవరము దీనితోపాటు ప్రవహించకూడదు. దీనికి వ్యతిరేకంగా ప్రవహించి ఒక ఆదర్శాన్ని నిలపాలి. ఒక ప్రకాశస్తంభంగా స్థిరంగా నిలవాలి. ఈ నవరాత్రుల్లో గాయత్రీమంత్ర జపసంఖ్యతో తృప్తిపడకుండా మన ఆలోచనలను, ప్రవృత్తులను, క్రియాకలాపాలను సమీక్షించుకోవాలి. వాటి దశను, దిశను సవరించుకోవాలి. గురువుగారు మనకు తెలిపిన తత్త్వచింతన, తత్త్వదర్శనలపై గంభీరమైన మనన, చింతన చేయాలి. తొమ్మిది రోజుల్లో, తొమ్మిది రాత్రుల్లో సాధన చేసి విజయదశమికల్లా ఇంద్రియాలపై విజయాన్ని సాధించాలి.

ఈ సందర్భంలో మన అంతరాత్మ, గురువుగారు, ఆరాధ్యులు మాత్రమే మార్గదర్శకులు అని గుర్తుంచుకోవాలి. వారి కృపవల్లనే ఆత్మబలాన్ని పొందుతాం. అంటే దివ్య ప్రయోజనాల కోసం ముందుకు సాగేటప్పుడు ఎదురయ్యే అవరోధాలన్నిటినీ కాలికింద అణిచేయగల ప్రచండ శౌర్యం, సాహసం. ఈ ప్రచండమైన ఆత్మశక్తినే ఈ నవరాత్రుల్లో మనం అర్జించాలి. పరమపూజ్య గురువుగారి యుగాంతరీయ కర్మకై మనల్ని మనం సర్వతోముఖంగా సమర్పించుకోవాలి.

*– అఖండజ్యోతి, అక్టోబరు 2015*

*అనువాదం: ఎం.వి. ప్రసాద్*

## పనికి తగిన రీతిగా మనస్సును- మస్తిష్కాన్ని సిద్ధపరచాలి

*దహన సంస్కారాలకై తీసికొని వెళ్ళు శవాన్ని, ముసలితనంతో, వ్యాధితో చిక్కిశల్యమైన వ్యక్తిని దర్శించిన రాజకుమారుడు సిద్ధార్థుని మనస్సులో వైరాగ్యం మొగ్గ తొడిగింది. దీనితో సిద్ధార్థుడు రాజమహలును వీడిపోవుటకై సంసిద్ధుడైనాడు. అట్టి సమయంలో అతని బాల్యస్నేహితుడు మరియు సహాయకుడు చన్నా అతని చెంతనే ఉన్నాడు. ఇరువురు చెరియొక గుర్రాన్ని అధిరోహించి రాజ్యం పొలిమేర్లకు చేరుకున్నారు. అచ్చట అశ్వాలనిలిపి సిద్ధార్థుడు తన చెంతనున్న కత్తితో తన కేశముల ఖండించి వైచి, చన్నాను వెనుతిరిగి వెళ్ళమని ఆదేశించాడు. తదుపరి సిద్ధార్థుడు అడవి మార్గాన్ని పట్టాడు. దారిలో ఒక వేటగాడు తారసపడగా, అతనికి తన రాజోచిత వస్త్రాలను దానం చేయుటకు ప్రసన్న చిత్తంతో సంసిద్ధుడై ఉన్నానని చెప్పాడు. ఒకింత ఆశ్చర్యచకితుడైన వేటగాడు, తనకు ఈ రాజోచిత వస్త్రాలను దానం చేయుటకు గల కారణమేమని, సిద్ధార్థుని ప్రశ్నించాడు – జవాబుగా 'మిత్రమా' నేను సన్యాసి మార్గాన్ని ఎంచుకొన్నాను. కావున తదనుగుణమైన వస్త్ర ధారణను నేను చేపట్టాలి. చేపట్టే పనికి అనుకూలమైన వస్త్రధారణ మనస్సు మరియు మస్తిష్కంపైన అనుకూల ప్రభావాన్ని చూపుతాయి అన్నాడు సిద్ధార్థుడు.*

*– హిందీమూలం: అఖండజ్యోతి, సెప్టెంబర్ 2015*

*అనువాదం: పార్థసారథి*

**మానవజాతి శాంతి, సంతోషాలను తిరిగి పొందాలన్న సంపద అంతా వికేంద్రీకరణ కావలసిందే**

ఆయుర్వేద వైద్యం-7

# ఆయుర్వేదగుణ పత్రాలు-1

## మాచీ పత్రం

వంగజాతికి సంబంధించిన ఈ చిన్ని మొక్క ముళ్ళతోను, చిన్న చిన్న ఆకుపచ్చని కాయలతోను కనిపిస్తుంది.

మాచీకాయలోని విత్తనాలను కాల్చి ఆ పొగ నోటిలోకి తీసుకుంటే పళ్ళనొప్పులు తగ్గుతాయి. కీళ్ళనొప్పులున్నవారు మాచీపత్రం (నేల ములగ) రసంలో కాస్త మిరియాలపొడి కలిపి తీసుకుంటే ఉపశమనం కలుగుతుంది. మాచీపత్రంతో తయారయ్యే కంటకారిఘృతం, వాసాకంటకారి, అవలేహ్యం, వాఘ్రీహరీతకి మొదలైన ఔషధాలు అన్ని ఆయుర్వేద అంగళ్ళ లోనే లభిస్తాయి.

## బృహతీ పత్రం

ఆయుర్వేద ఔషధాలలో ఉపయోగించే 'దశమూల' ములలో బృహతీపత్రం కూడా ఒకటి.

ఇది కూడా ముళ్ళతో కూడిన చెట్టు. దీని కాండం నక్షత్రాకారంలో ఉంటుంది. పువ్వులు నీలి రంగు కలిగి, పళ్ళు పసుపు రంగులో ఉంటాయి.

**ఉపయుక్త భాగాలు:** వేరు, పళ్ళు.

**ఔషధ గుణాలు:** కడుపునొప్పిగా ఉన్నప్పుడు ఈ చెట్టు వేరును పొడిచేసి మజ్జిగలో కలిపి తాగితే నొప్పి త్వరగా తగ్గిపోతుంది. తలలో అక్కడక్కడ జుట్టు రాలి తెల్లతెల్లగా గుండ్రంగా మచ్చలు ఏర్పడినప్పుడు బృహతీ పండును అరగదీసి, తలలోని మచ్చలపై రాస్తే మచ్చలు మానిపోయి మళ్ళీ కొత్త జుట్టు వస్తుంది. లేదా తాజా పండును కోసి ఆ రసాన్ని కూడా మచ్చలపై రుద్దవచ్చు.

హృద్రోగంతో బాధపడేవారు ఈ బృహతీ వేరును బాగా కడిగి, నీడలో ఆరబెట్టి, దంచి పొడిచేసి సేవించవచ్చు. బృహతీ జీర్ణశక్తిని పెంపొందిస్తుంది. ఈ పండు రసాన్ని రాస్తే చర్మ రోగాలు నయమవుతాయి, దురద బాగా తగ్గుతుంది.

వాంతులు, కడుపులో నులి పురుగులు, హెర్పిస్‌తో బాధపడేవారు బృహతీ ఆకురసాన్ని లేదా పళ్ళరసాన్ని సేవించడం ఉపయుక్తం. కాళ్ళు చేతుల నొప్పులు, వెక్కిళ్ళు, గొంతు సంబంధిత వ్యాధులకు ఇది దివ్య ఔషధం.

గాయాలు, కురుపులు శుభ్రం చేయడానికి ఈ పెద్ద ములగ కషాయాన్ని ఉపయోగిస్తారు.

## బిల్వపత్రం

వేదాలలో బిల్వాన్ని గురించి విపులంగా వివరించారు. బిల్వధారణ వలన మనసుకు శాంతి, నెమ్మది లభిస్తాయన్న విశ్వాసం కూడా ఉంది. భారతీయ పురాణాలలో శివుడికి, బిల్వానికి అవినాభావ సంబంధం ఉంది.

శివుని గుడి ఉన్నచోట బిల్వవృక్షం తప్పక ఉంటుంది. శివపూజలో బిల్వానికి అగ్రస్థానం. అందువల్లనే శివుని 'బిల్వదండిన' అని కూడా అంటారు.

బిల్వవృక్షం (మారేడు చెట్టు): బిల్వం మధ్యస్థ ఆకారం గల వృక్షం. అంటే మర్రిమానులా లావుగా కాక, మునగ చెట్టులా తేలికగా కాకా మధ్యస్థంగా ఉంటుంది. దాని బెరడు మొరటుగా ఉండి, కొమ్మలన్నిటికీ ఒక అంగుళం పొడవుగల ముళ్ళుంటాయి. ఒకే ఆకు మూడుగా విభజింపబడి ఉంటుంది.

తెలుపు, పసుపు కలిగిన లేతరంగులోని ఆకులు సుగంధాన్ని, తియ్యదన్నాన్ని కలిగి ఉంటాయి. దీని పళ్ళు గుండ్రంగా ఉండి లోపలి గుజ్జు కేసరి రంగులో ఉంటుంది. పండులో చాలా విత్తనాలుంటాయి. ఆ విత్తనాలపై సన్నటి నూనుగు పొర ఉంటుంది. బిల్వవృక్షం వేర్లు, బెరడు, ఆకులు, పళ్ళు మరియు విత్తనాలు కూడా ఔషధ గుణాన్ని కలిగి ఉన్నాయని గమనించాలి.

**ఔషధ గుణాలు:** బిల్వం రసాయన ద్రవ్యంగా పనిచేస్తుంది. కామెర్లతో బాధపడేవారు బిల్వపత్ర రసాన్ని ఉదయం, సాయంకాలం తీసుకుంటే త్వరగా నయమవుతుంది. కఫంతో బాధపడేవారు కూడా బిల్వపు ఆకులను మెత్తగా నూరి ఎద మరియు వెన్ను (వీపు) పై రాసుకుంటే కఫం కరిగిపోతుంది.

గాయాలపై బిల్వవేరును పొడిచేసి, దానికి తగు మాత్రం పసుపు కలిపి, ఆ మిశ్రమానికి నువ్వుల నూనెకొద్దిగా చేర్చి రాస్తే గాయం త్వరగా మానిపోతుంది. లేత బిల్వపుకాయలోని

**మానవుని పరిపూర్ణ జీవనం - శ్రమ, సంతోషాలతో ముడిపడి ఉంది**

గుజ్జును నీడలో ఆరబెట్టి, పొడిచేసి, మజ్జిగలో కలిపి, అప్పుడప్పుడు కొద్దికొద్దిగా తాగితే విరేచనాలు తగ్గుతాయి, బిల్వపుకాయ పై పొట్టును తల్లిపాలలో అరగదీసి, ఆ గంధాన్ని పెదవులపైనున్న తెల్లమచ్చలు నయమవుతాయి.

మూలవ్యాధిగలవారు బిల్వపండులోని గుజ్జును, తేనెతో కలిపి తినాలి. అంతేకాక బిల్వవేరును బాగా ఉడికించి ఆ కషాయంతో మూలవ్యాధిగల ప్రదేశానికి కాపడం పెట్టాలి, దంత ధావనానికి బిల్వపు చిన్నపిల్లలకు చాలా మంచివి. కంటి జబ్బు ఉన్నవారు బిల్వపు ఆకులతో కషాయం చేసి తాగితే త్వరగా నయమవుతుంది.

## గరిక పత్రం

గరిక దేవతార్చనలలో, ముఖ్యంగా గణపతి పూజలో ఉపయోగించే అష్టమంగళ... ఒకటి గరిక ఉన్నచోట నీరు తప్పకుండా ఉంటుంది. అందుకే నీళ్ళున్న స్థానాన్ని వెదకడంలో (జల సంశోధనలో) ముందుగా గరిక ఉన్నచోటుకు ప్రాధాన్యత నిస్తారు కత్తిరించేకొద్దీ చిగురించటం దీని విశేషం.

శరీరంపైన ఉన్న రోమాలు చర్మాన్ని కాపాడేటట్లుగా గరిక ప్రాణశక్తిని రక్షణ కలుగజేస్తుంది.

**ఉపయుక్తభాగాలు:** గడ్డి, వేర్లు మాత్రమేకాక మొత్తం మొక్కంతా ఉపయోగపడుతుంది.

**ఔషధగుణాలు:** కాలిన గాయాలపై గరిక రసానికి, కొద్దిగా కొబ్బరినూనె చేర్చి పూస్తే త్వరగా మానిపోతాయి. గజ్జి. దురద, దద్దుర్లు మొదలైన చర్మరోగాలకు రోజుకు రెండుసార్లు గరికరసం, పసుపుతో కలిపి రాస్తే త్వరగా తగ్గుతుంది. ముక్కు నుండి రక్తం కారేవారికి గరిక రసాన్ని తాగించడమేగాక, ముక్కులో కొన్ని చుక్కలు వేస్తే త్వరగా తగ్గుతుంది. మూలవ్యాధి ఉన్నవారు రోజుకు 2 లేదా 3 సార్లు మూడు చెంచాల చొప్పున గరిక రసాన్ని తాగాలి.

వాంతులయ్యేవారు గరిక రసంలో కొద్దిగా బియ్యం కడిగే నీటిని కలిపి తాగాలి.

మూత్రం కట్టినవారు గరికరసంలో తేనె కలిపి తీసుకుంటే ఉపశమనం కలుగుతుంది. గరికను శుభ్రంగా కడిగి ఒక లీటరు నీళ్ళలో ఉడికించి అంటే అది పావులీటరు అయ్యేదాకా ఉడికించి వడగట్టి దానికి పాలు, బెల్లం కలిపి తాగితే నిల్వవృద్ధి కలుగుతుంది.

తేలు కుట్టినచోట గరికరసం రాయడమే కాక, కొద్దిగా తాగిస్తే ఉపశమనం కలుగుతుంది. ఇలా 2,3 సార్లు చేయాలి. అజీర్ణానికి గరికరసం దివ్య ఔషధం. జ్వరంతో బలహీనంగా ఉన్నవారికి గరిక రసం, తేనె కలిపి ఇవ్వాలి. ఆకలిలేనివారికి గరికరసంలో కొద్దిగా శొంఠిపొడి, జీలకర్రపొడి, తేనె కలిపి ఇస్తే ఆకలి వేస్తుంది.

## ఉమ్మెత పత్రం

మట్టిదిబ్బపై త్వరగా పెరిగే ఈ ఉమ్మెత్త చెట్టుకు ముళ్ళు ఉంటాయి. దీని ఆకులు, కాండం నుంచి పసుపు రంగులో పాలలాంటి ద్రవం వస్తుంది. వీటి ఆకులకు తొడిమి ఉండదు. కాండం చివరలో లేదా ఆకుల మధ్యలో పసుపు రంగులో పూలుంటాయి. కాయలు అండాకారంలో ఉండి, విత్తనాలు చిన్నగా, నల్లగా ఉంటాయి. విత్తనాల నుండి తీసిన నూనె చేదుగా ఉంటుంది.

**ఉపయుక్తభాగాలు:** వేర్లు పూలు, కాండం విత్తనాలు, పాలలాంటి ద్రవం.

**ఔషధ గుణాలు:** తేలుకుట్టినచోట ఉమ్మెత్త వేరును గంధం తీసి రాస్తే మంట, నొప్పి, వాపు ఉపశమిస్తాయి. కడుపులో నులిపురుగులు, ఏలికపాములు ఉన్నట్లయితే ఉమ్మెత్తవేరు పొడిచేసి తీసుకోవాలి.

కీళ్ళనొప్పులతో బాధపడేవారు ఉమ్మెత్త విత్తనాలను బాగా నూరి నొప్పి ఉన్నచోల రాస్తే నొప్పి తగ్గుతుంది. గజ్జి తామర మొదలైన చర్మరోగాలకు ఉమ్మెత్త పాలు లేక విత్తనాలను నూరి ఆ రసాన్ని రెండు లేదా మూడుసార్లు రాస్తే త్వరగా తగ్గిపోతాయి. ఉమ్మెత్త చెట్టు నుంచి కారే పాలు లేదా విత్తనాల నుండి తీసిన నూనెను ఆనెలపై రాస్తూ, వాటిని నివారించవచ్చు.

ఉమ్మెత్త విత్తనాలను కాల్చి ఆ పొగను పీలిస్తే పంటి నొప్పి తగ్గుతుంది. పళ్ళపై ఉన్న గార, మచ్చలు కూడా పోతాయి. చిన్న పిల్లలకు తల్లిపాలు మానిపించాలని అనుకున్నపుడు ఉమ్మెత్త విత్తనాలను మెత్తగా నూరి చనుమొనలకు రాస్తే వాళ్ళు త్వరగా మానుతారు. జ్వరం వచ్చినప్పుడు ఉమ్మెత్త పాలు తాగితే నయమవుతుంది.

*(సశేషం)*

*సేకరణ: ఎ. వేణుగోపాలరెడ్డి*

**ఆనందం ధనంలో, విద్యలో, బలంలో, సంపన్నతలో లేదు - భావ సంవేదనల్లో ఉంది**

# స్ఫూర్తిదాయక గాయత్రీపరివార్ సభ్యులు - 18

**డా॥ పుట్టా సురేష్, ఎమ్.డి.**

**అసోసియేట్ ప్రొఫెసర్, శ్రీ వెంకటేశ్వర వైద్య కళాశాల, తిరుపతి**



శ్రీ పి.వి. చలమయ్య-సులోచనమ్మ దంపతులకు 22 జులై 1970లో అనంతపురం జిల్లాలోని "యాడికి" అనే గ్రామంలో శ్రీ సురేష్ జన్మించారు. అదే జిల్లాలోని ఆత్మకూరు గ్రామములో తన ప్రాథమిక విద్యను, ఉన్నత విద్యను పూర్తిచేశారు. అటుపిమ్మట వైద్య విద్యను కర్నూలు వైద్య కళాశాలలోను, పి.జి. విద్యను శ్రీ వెంకటేశ్వర వైద్య కళాశాల తిరుపతిలో జనరల్ మెడిసిన్‌లో 2000 సంవత్సరము నాటికి పూర్తిచేశారు. చురుకైన విద్యార్థి అగుట చేత పిన్న వయస్సులోనే పి.జి. వైద్య విద్యనభ్యసించుట జరిగింది. చిన్ననాటి నుండి తన ఆలోచనలు, దృష్టి పేదరికం చుట్టూ, సామాజిక సమస్యల చుట్టూ, ప్రజల ఈతిబాధల చుట్టూరా తిరుగుతుండేవి. ఈ భావ సంవేదనలు తరచుగా సురేష్‌ను చుట్టుముట్టి భావ విప్లవాలుని గావించేవి. ఈ సమస్యలకు సమాధానం తెలిసికొన వలయుననే ఆలోచనలు తనలో సమయానుకూలంగా వెలువడుతూ ఉండేవి. ఒక్కొక్క పరి పేదరికం, పేదల బాధను చూచిన తన మనస్సు వికలమై పోతూ ఉండేది. ఇట్టి స్థితిలో వీరికి 2010-2011 ప్రాంతంలో "వార్త" తెలుగు దినపత్రికను వీరు చదువుట జరిగింది. దీనిలో ప్రధానపేజి పై భాగంలో "పండిత శ్రీరామశర్మ ఆచార్య గురుదేవుల" సద్వాక్యాలు, భావనలు ఉటంకించుట చూచి వానిని దీక్షతో పఠించేవారు. పలుమార్లు మననం చేసికొనేవారు. కొన్ని రోజులపాటు ఆ పేపరులో శ్రీరామశర్మ ఆచార్య గురుదేవుల విరచిత వ్యాసాలను, జీవన మార్గదర్శకాలను చదువుట జరిగింది. దీనితో ఆచార్యుల గురించి సంపూర్ణ వివరాలను తెలిసికొనాలని వారి రచనలను చదవాలనే ఆకాంక్ష క్రమక్రమంగా వీరిలో బలీయం కాసాగింది. ఇవి లభించే స్థలాన్ని వెతుకుటలో తిరుపతిలోని ఆధ్యాత్మిక సంస్థలను, పుస్తక విక్రయ కేంద్రాలను సందర్శించారు. ఈ ప్రయత్నంలో వీరికి గాయత్రీ పరివార్ తిరుపతిలో ఏకైక క్రియాశీల కార్యకర్తయైన శ్రీమతి ఎన్.మునిలక్ష్మిగారిని 2011లో కలిసికొనుట జరిగింది. వీరి ద్వారా పూజ్య గురుదేవుల విరచిత సాహిత్యాన్ని మరియు యుగశక్తి గాయత్రీ మాసపత్రికను చదువుట జరిగింది. ఇవి చదివిన తదుపరి ప్రజల బాధలకు సమాజం ఎదుర్కొనుచున్న అనేకానేక సమస్యలకు మూలకారణాలు తరచి చూడగా ప్రజలలో అజ్ఞానం, పేదరికం, ప్రేమరాహిత్యం, సరియైన దృష్టికోణలేమి, ఆలోచనల రీతి అవగాహనా రాహిత్యం మున్నగునవి కారణాలుగా తెలిసికొన్నారు. తన చుట్టూరా ఉన్న మరియు సమాజంలోని ప్రజలలో గల పై లోపాలను తొలగించుట ఒక్క జ్ఞానం ద్వారా మాత్రమే సాధ్యమని గ్రహించిన వీరు ప్రజలకు స్వాధ్యాయము అలవాటు చేసిన తద్వారా వారిని జ్ఞానవంతుల చేయుట సాధ్యమని భావించారు. దీనికి తోడు పూజ్య గురుదేవులు ప్రకటించిన రీతిగా మనిషి వ్యక్తిత్వ నిర్మాణం నాలుగు స్తంభాలైన "స్వాధ్యాయము, సాధన, మితవ్యయం మరియు సేవ"ల ఆధారంగా నిర్మితమవుతుంది అనే సత్ప్రవచనం వీరి మనస్సులో బలంగా నాటుకొన్నది. దీనిలో భాగంగా వీరు స్వాధ్యాయాన్ని అలవాటు చేసి తనతోటి వారిని జ్ఞానవంతుల గావించి తద్వారా రానున్న రోజులలో ఈ ఉద్యమాన్ని మరింత వ్యాప్తిగావించుటకై సంకల్పం చేశారు. తదుపరి నూటముప్పది (130 పత్రికలు) యుగశక్తి గాయత్రి మాసపత్రికలకు ఒక సంవత్సరం పాటు తానే చందా రూ.19500/-లు చెల్లించారు. ఆంధ్రప్రదేశ్‌లోనున్న 13 జిల్లాలలోని, 130 ప్రభుత్వ లైబ్రరీలకు (జిల్లాకు 10 చొప్పున) తానే ఈ లైబ్రరీల చిరునామాలు సేకరించి, చేతనా కేంద్రానికి అందించి, పత్రికల బట్వాటాకు మార్గాన్ని సుగమం చేసిన కార్యదక్షుడు మరియు దీక్షాతత్పరుడు.

తన వ్యక్తిత్వ నిర్మాణంతోపాటు సమాజం నిర్మాణం కూడా తనవంతు చేయాలనెడి సత్సంకల్పాన్ని చేబూని, జ్ఞానదాన మార్గాన్ని ఎంచుకొన్న శ్రీ సురేష్ మనందరికీ స్ఫూర్తిదాత. వృత్తిరీత్యా శరీరపరంగా మానవులకు ఆరోగ్యాన్ని అందిస్తున్న డాక్టర్ సురేష్, ప్రవృత్తిరీత్యా మానసిక పరంగా మానవుల మస్తిష్కాన్ని సంస్కరించి, తద్వారా సమాజాన్ని జ్ఞానమార్గాన, కాంతి మార్గాన, శాంతి మార్గాన నడిపించాలనే సంకల్పం,

**నడకవల్ల ఆరోగ్యం చక్కబడుతుంది**

భారతదేశం జగద్గురు పీఠాన్ని తిరిగి అలంకరించుతుంది అనే సంకల్ప విజయానికి నిలువెత్తు ఉదాహరణగా నిలుస్తుంది.

21వ శతాబ్ది ఉజ్వల భవిష్యత్ - ఇట్టి అత్యుత్తమమైన జ్ఞానదాన సంకల్పాన్ని చేబూనిన డాక్టర్ సురేష్‌గారు చక్కని ఆయురారోగ్యాలతో, సుఖశాంతులతో, సిరిసంపదలతో ఎదగాలని కోరుకుంటూ, పూజ్యగురుసత్తాను యుగశక్తి గాయత్రి ప్రార్థిస్తున్నది.

### శ్రీ వారణాసి వైకుంఠరావు - ఈశ్వరమ్మ దంపతులు



శ్రీ వారణాసి సత్యన్నారాయణ-వరహాలమ్మ దంపతులకు శ్రీకాకుళం జిల్లా, పాలకొండ తాలుకా నీలానగరంలో 1950వ సంవత్సరం మార్చినెలలో వైకుంఠరావుగారు జన్మించారు. ఎస్.ఎస్.ఎల్.సి. వరకు నీలానగరంలోనే చదివారు. అటు తరువాత తండ్రిగారు నిర్వహించుచున్న కిరాణా వ్యాపారం చూస్తూ కొంతకాలం అచ్చటనే ఉండిపోయారు. ఉద్యోగం పురుష లక్షణమనెడి దానిని నమ్మి ఉద్యోగ అన్వేషణలో విశాఖ పట్టణానికి 1998లో వలస వచ్చారు. ఈలోపు 1979లోనే బూర్జ గ్రామవాసి అయిన ఈశ్వరమ్మగారు అర్థాంగిగా వీరి జీవితంలో ప్రవేశించింది. రోడ్డు రవాణా సంస్థలో కొంతకాలం పనిచేసి స్వచ్ఛంద పదవీ విరమణ చేశారు. అటు తర్వాత జీవితంలో అనేక ఆటుపోట్లను ఎదుర్కొని, వాటన్నిటిని అధిగమించుటలో మనస్సు డస్సిపోయింది. శరీరం వీసివాడింది. డస్సిన మనస్సు సేదతీరెడి క్షేత్రాన్ని వెతుకసాగింది. ఈ వెతుకుటలో గాయత్రీ పరివార్ సభ్యులైన శ్రీమతి సావిత్రిగారు మరియు శ్రీ హేమ చంద్రరావు గార్లతో పరిచయం కలిగి గాయత్రీ యజ్ఞం మాధ్యమంగా గాయత్రీ కుటుంబంలో ప్రవేశం లభించింది. క్రమక్రమంగా అలసిసొలసిన మనస్సుకు సాంత్వన లభించసాగింది. పూజ్య గురుదేవుల విరచిత సాహిత్యం చదువసాగారు. చదివిన దానిని మననం చేయుట అలవడింది. స్వాధ్యాయాన్ని రుచి చూచిన మనస్సుకు అది వ్యసనంగా మారి చదువనిదే మనస్సుకు శాంతిలేని స్థితికి ఏర్పడసాగింది.

దీనితో ఆత్మకథ, ఏకాంత సహచరులు, ధైర్యం విడువకండి, గృహస్థ జీవనం ఒక తపోవనం, గాయత్రీ మహావిజ్ఞానం, గాయత్రీ ఉపాసన, యుగశక్తి గాయత్రి మున్నగువానిని వరుసగా చదివారు. ఈవిధంగా పూజ్యగురుదేవుల నూతన విచారధార, జీవించేకళ, మున్నగువానిపై ఒక చక్కని అవగాహన కలిగింది.

ఈ జ్ఞానాన్ని ఆధారంగా చేసికొని, అందరూ హవనం చేస్తూ ఉంటే, తాను జ్ఞానయజ్ఞాన్ని మాధ్యమంగా చేసికొని పూజ్యగురుదేవులందించిన సాహిత్యాన్ని పలువురికి పంచి తద్వారా వారిని కూడా జ్ఞానవంతులగావించెడి మార్గాన్ని ఎంచుకొని సాహిత్యాన్ని వందలు, వేల సంఖ్యలో పంచుట ప్రారంభించారు. వీరికి కావలసిన ఆర్థిక సహాయ సహకారాలను శ్రీయుతులు నరసింహారావు, సావిత్రి దంపతులు అందజేయు చున్నారు. ఈరీతిగా సమాజంలోని అజ్ఞానాన్ని పారద్రోలుట లక్ష్యంగా కృషిచేయుచున్నారు. పై విధంగా సాగుచున్న వీరి ప్రయాణంలో అనుకోని అవాంతరం కలిగి, వీరి గుండెకు శస్త్రచికిత్స చేయించుకొనవలసి వచ్చింది. ఇట్టి స్థితిలో భర్త వైకుంఠరావు అనారోగ్యానికి గురియై ఇంటికి పరిమితం అయ్యాడు. అలనాడు నరకాసురవధ వేళ రథంపై మూర్ఛిల్లిన కృష్ణునికి తోడుగా ఉన్న భార్య సత్యభామ వింటిని చేబూని నరకాసురునిపై అస్త్రశస్త్రాల ప్రయోగించి నరకాసురుని నిలువరించి, భర్తకు అండగా నిలచి, అసుర సంహారం గావించుటలో తోడ్పడింది. ఇదేవిధంగా దీనిని స్ఫూర్తిగాగొని ఈశ్వరమ్మ తన భర్త సేదదీరుచుండగా, అజ్ఞానమనెడి అసురుని పారద్రోలుటకై భార్య తన వంతు కర్తవ్యాన్ని పోషించి, పూజ్యగురుదేవుల సాహిత్యాన్ని సమాజానికి అందించుటలో అవిరళంగా కృషిచేయుచున్నారు.


దంపతులిరువురూ గృహస్థజీవనం ఒక తపోవనం అనే దానికి సజీవ తార్కాణంగా నిలచి సమాజంలోని అజ్ఞాన తిమిరాల పారద్రోలుటకై యుగశక్తిగాయత్రి మాసపత్రికను ప్రతినెలా 400 పైచిలుకు విక్రయిస్తూ, జ్ఞానయజ్ఞాన్ని వాడవాడలా, మందిరమందిరాన జరుపుచుండుట అత్యంత ముదావహం. 2005 నుండి 5 మార్లు శాంతికుంజ్‌ను దర్శించారు. ఇట్టి ఈ పుణ్యదంపతులకు పూజ్యగురుయుగ్మం ఆయురారోగ్యాల ప్రసాదించి, తగిన శక్తి సంపదలనందించి మరింత చురుకుగా జ్ఞానయజ్ఞ తపస్సును కొనసాగించేలా చేయాల్సిందిగా ఆ గాయత్రీమాతను, గురుయుగ్మాన్ని చేతనా కేంద్రము ప్రార్థించుచున్నది.

**మనుష్యులొక్కరే మన సహచరులనే సంకుచిత దృష్టిని వీడు - ప్రకృతి అంతా నీకు తోడుగా నిలుస్తుంది**

వార్తలు

# రాష్ట్రంలో జరిగిన వివిధ కార్యక్రమాలు

## అశ్విని సుబ్బారావుగారి 68వ జన్మదిన వేడుకలు



మాన్యశ్రీ అశ్విని సుబ్బారావుగారు, హైదరాబాద్ గాయత్రీ చేతనా కేంద్రము, వ్యవస్థాపకులు మరియు ప్రధాన సంయోజకులు తమ 68వ జన్మదిన వేడుకలను 10 అక్టోబరు 2015 శనివారమునాడు హైదరాబాదులో జరిగిన దానిపై ఒక నివేదిక.

శ్రీ అశ్విని సుబ్బారావుగారు, గాయత్రీ చేతనా కేంద్రము హైదరాబాద్‌లో వేళ్ళూనుకొనుటకు ప్రధాన కారకుడు. చేతనా కేంద్రాన్ని అనేకానేక వ్యయప్రయాసలకోర్చి స్థలాన్ని దానమిచ్చి, దానిలో 5 అంతస్తుల భవనాన్ని స్వంత ఖర్చులతో నిర్మించి, దక్షిణ భారతదేశంలో గాయత్రీ ప్రధాన కేంద్రంగా తీర్చిదిద్దిన కార్యదక్షుడు, వితరణశీలి మరియు సంకల్పబద్ధుడు. గత దశాబ్ద కాలములో అశ్విని హోమియోతో పాటుగా గాయత్రీ చేతనా కేంద్రము కూడా నలుదిశలా వ్యాపించింది.

అట్టి అశ్విని సంస్థ తన రజోత్సవ వేడుకలను జరుపుకొను చున్న సమయంలో శ్రీ అశ్వినిసుబ్బారావుగారు తన 68వ జన్మదినాన్ని, తాను జన్మనిచ్చిన సంస్థ జన్మదినంతో జోడించి కన్నుల పండుగగా, జనరంజకంగా నిర్వహించారు.

10వ తేది అక్టోబరు 2015 శనివారము ఉదయము 9 గంటలకు గాయత్రీ యజ్ఞముతో జన్మదిన వేడుకలు ప్రారంభింప బడ్డాయి. ఈ వేడుకలను శాంతికుంజ్, అఖిల విశ్వగాయత్రీ పరివార్ ప్రతినిధి డాక్టర్ బ్రిజ్‌మోహన్ గౌడ్‌జీ గారి సారథ్యంలో గాయత్రీ పరివార్ మరియు బంధుమిత్రుల సమక్షంలో గాయత్రీ యజ్ఞముతో పాటుగా జన్మదిన సంస్కారం నిర్వహింపబడింది. శ్రీ సుబ్బారావుగారితో పాటు వీరి కనిష్ట అల్లుడు శ్రీ టి.వి. రాజేష్‌గారి జన్మదిన వేడుకలు కూడా నిర్వహింపబడ్డాయి.

కార్యక్రమంలో భాగంగా డాక్టర్ బ్రిజ్ మోహన్‌గౌడ్ గారు జన్మదిన సంస్కారం మరియు గాయత్రీ యజ్ఞ విశిష్టతలను హాజరైన పరిజనులకు వివరించుట జరిగింది.

తదుపరి సాయంత్రము 7 గంటలకు శ్రీ అశ్విని సుబ్బారావు గారి అభినందనసభ "హోటల్ నోవాటెల్ హైటెక్స్ కన్వెన్షన్ సెంటర్"లో ప్రారంభమైంది. మంగళవాయిద్యాల నడుమ, వేదపండితుల ఆశీర్వాదముల మధ్య సహధర్మచారిణి తోడు రాగా శ్రీసుబ్బారావుగారు గాయత్రీ పరివార్‌తో కలిసి సభా వేదికకు చేరుకున్నారు. శ్రీ సుబ్బారావు దంపతులిరువురూ వేదికపై ఆశీనులు కాగా, డాక్టర్ బ్రిజ్‌మోహన్‌గారి శాంతికుంజ్ ప్రతినిధి వారిని పుష్పమాలాలంకృతుల గావించి, మంత్ర శాలువాలు కప్పి సత్కరించి, ఆశీస్సులనందించిరి. అటుపిమ్మట అఖిల విశ్వ గాయత్రీ పరివార్ ప్రధాన సంచాలకులైన డాక్టర్ ప్రణవ్ పండ్యా మరియు ఆదరణీయ శైలాబాలా పండ్యా గారి దివ్యాశీస్సుల సందేశాన్ని సభలో వినిపించుట జరిగింది. "ఈ ఆనంద సమయంలో మాకు అత్యంత ఆప్తుడు, ఆత్మీయుడైన శ్రీ అశ్విని సుబ్బారావుగారి జన్మదినాన్ని పురస్కరించుకొని గాయత్రీ ప్రత్యేకమంత్ర అనుష్ఠానాన్ని మరియు మహామృత్యుం జయ మంత్రాన్ని దేవకన్యలతో అఖండదీప సన్నిధిలో శాంతికుంజ్‌లో శ్రీ సుబ్బారావు దంపతులకు ఆయురా రోగ్యాలతో, సుఖశాంతులతో కూడిన జీవితాన్ని ప్రసాదించమని కోరుతూ జపం జరుగుచున్నది. పరమ పూజ్యగురుదేవులు, పరమవందనీయ మాతాజీల ప్రభావానికిలోనైన నాటి నుండి శ్రీ సుబ్బారావు గారు పూజ్యగురుదేవుల సాహిత్యాన్ని ఇంటింటికి (దక్షిణాదిన) చేర్పించెడి బృహత్ కార్యక్రమాన్ని చేబూనిరి. వీరికి శుభములు కలుగుగాక.

ఈ శుభసందర్భాన్ని పురస్కరించుకొని శ్రీ సుబ్బారావు గారిలోని కొన్ని విశిష్ట సేవా లక్షణాలను మననం చేసికొనుట మనకు స్ఫూర్తిదాయకం మరియు నాటు–కోసుకో" అనే పూజ్య గురుదేవుల సూక్తి వీరి జీవితంలో ఏ విధంగా ఫలించినది మనకు అనుభవైక వైద్యము.

శ్రీ సుబ్బారావుగారు జన్మతః దయార్ద్ర హృదయులు – ఆపన్న హస్తాన్ని అందించుటకై సర్వవేళలా సర్వావస్థలయందు ముందుంటారు.

**ఆనందం ప్రయత్నంలో ఉన్నది - భావనలో ఉన్నది - కలయికలో లేదు**

భారతీయ సంప్రదాయాల పట్ల భారతీయ సంస్కృతి పట్ల అమిత గౌరవ ఆదరాభిమానాలున్న వ్యక్తి. వీనిని పరిరక్షించే సంస్థల పట్ల మరియు వ్యక్తుల పట్ల అత్యంత గౌరవాన్ని కలిగి యుండుట వీరి నైజము. వీటికి సహాయ మందించుటకై తన వంతు కర్తవ్యాన్ని పోషించుటలో ఆయన ఏనాడు వెనుకంజవేయలేదు. కొన్ని సమాయాల్లో తన ఆర్థిక స్థితికి మించి సహాయాన్ని అందించారు.

అట్లే పూజ్య గురుదేవులందించిన "నాటు–కోసుకో" అనే జీవన సూత్రాన్ని అందిపుచ్చుకొని దానిని తన నిజ జీవితంలో ఆచరణలో పెట్టి ఊహించని రీతిలో ఫలాలను అందిపుచ్చు కొన్న అదృష్టశాలి.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 1990 దశకంలో ఊరూరా తిరిగి శ్రీ సుబ్బారావు దంపతులు పాము, పిచ్చికుక్క తేలుకాటు నివారణకై ఉచితంగా కొన్ని లక్షల డోసుల హోమియో మందును పంపిణీ చేసి లక్షలాదిమందిని ఈ విష ప్రాణుల బారినుండి రక్షించుటకు కారణభూతులైనారు. అట్లే భారత వికాస్ పరిషత్ అనే ఒక జాతీయ సంస్థకు హైదరాబాద్‌లో స్థలాన్ని ఉచితంగా ఇచ్చి దానిలో 5 అంతస్థుల భవన నిర్మాణానికి తమ తోడ్పాటునందించి వేలాదిమందికి కృత్రిమ అవయవాలను అమర్చి వారి జీవితాలలో వెలుగును నింపి వారిని తిరిగి సమాజ జీవన స్రవంతిలో సహజీవనం సాధించుటకు తోడ్పడుచున్న మానవతామూర్తి.

భారత వికాస్ పరిషత్ ద్వారా దేశంలో ఎక్కడా అమలులో లేని ఒక నూతన ఆలోచనకు రూపకల్పన చేసి "జనరిక్ మెడికల్ షాప్‌ల రూపంలో జంటనగరాలలో (హైదరాబాద్, సికింద్రా బాద్) 13 చోట్ల విక్రయ కేంద్రాల ద్వారా ప్రజలకు మందుల ఖరీదులో (70%) రాయితీ లభించేలా చేసి సంవత్సరానికి దాదాపు 3 లక్షల మందికి లబ్ధి కలిగేలా చూస్తున్నారు.

గాయత్రీ పరివారమైన మనందరికీ వీరి జీవితం ఎంతో స్ఫూర్తిదాయకము మరియు ఆదర్శప్రాయం. ఇట్టి వీరికి దీర్ఘాయుష్షును, సుఖశాంతులను, సిరిసంపదల చేకూర్చి సంరక్షింపవలసిందిగా పూజ్యగురుయుగ్మాన్ని మరియు అఖండ గురుసత్తాను గాయత్రీ చేతనా కేంద్రము ప్రార్థించుచున్నది.

## ఒంగోలు జిల్లాలో

**ప్రచారయాత్ర:** జనవరినెలలో కన్యాకుమారిలో జరిగే అశ్వమేధ యజ్ఞమునకు ప్రచారయాత్ర చేస్తున్న కలశరథము 01.10.2015న రాత్రి 9 గంటల ప్రాంతములో ఒంగోలు నందు ప్రవేశించినది. శ్రీమతి రాజ్యలక్ష్మి, సత్యనారాయణ దంపతులు, పరివార్‌సభ్యులు ఊరి పొలిమేరలలో రథమునకు స్వాగతం పలికారు. అక్కడినుండి నేరుగా రథము గాయత్రీ అనుగ్రహపీఠమునకు విచ్చేసింది. అక్కడ మంచెళ్ళ సీతామహ లక్ష్మీగారు, ఇతర కార్యకర్తలు హారతి ఇచ్చి స్వాగతించిన తదుపరి, రథము గోశాలకు చేరుకున్నది. అక్కడ శ్రీమతి లక్ష్మి, సుబ్బారావుగార్లు రథమునకు స్వాగతము పలికి, ముందుగా నిర్ణయించిన కార్యక్రమములను పూర్తిచేశారు. పిమ్మట రథము శ్రీ టంగుటూరి శ్రీనివాస్‌గారి ఇంటికి చేరుకున్నది. ఆ రాత్రి కార్యకర్తలు అక్కడే విశ్రమించారు. మరునాడు ఉదయము 9 గంటల నుండి రథము ఊరేగింపుగా గాయత్రీ అనుగ్రహపీఠమునకు విచ్చేసినది. గాయత్రీ పరివార్ సభ్యులు కలశమును సందర్శించుకుని, గురుదేవుల–మాతాజీల యొక్క ఆశీస్సులను అందుకునేందుకు తరలివచ్చారు. కలశమును ఎంతో అందముగా అలంకరించి పూజ చేసి, ఆరతి ఇచ్చి, ప్రదక్షిణలు చేశారు. తరువాత శ్రీమతి రాజ్యలక్ష్మి గారు 'అశ్వమేధ యజ్ఞ ప్రాశస్త్యమును' అందరికీ అర్థమయ్యే రీతిలో వివరించారు. ప్రచారరథముతో వచ్చిన పరివార్ సభ్యులు కూడా కన్యాకుమారిలో జరిగే అశ్వమేధమునకు అందరికీ ఆహ్వానము పలుకుతూ, ఎన్నో విషయములను వివరించారు. దానికి స్పందించిన ఎంతోమంది సభ్యులు తమ తమ శక్తి కొలది అంశదానమును అందించారు. దాదాపు 40,000 రూపాయలు అంశదానము ఇవ్వబడింది. ప్రసాద వితరణ జరిగినది. చివరగా అందరూ రథమునకు వీడ్కోలు పలికారు. రథము నెమ్మదిగా ఊరును చుట్టబెడుతూ శ్రీ గంజాం రంగనాథ్ గారి ఇంటికి చేరువలోకి రాగా కుటుంబసభ్యులు రథమునకు స్వాగతం పలికి, ఆరతిచ్చి, గురుదేవుల అనుగ్రహమునకు పాత్రులయ్యారు. ఇక అక్కడినుండి రథము నెమ్మదిగా చీరాలకు సాగిపోయింది.

**గొప్ప ఉద్దేశ్యం నెరవేరుటకై గొప్ప ధైర్యం కావాలి**